ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ దశమి రా. 9.44 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: స్వాతి ఉ. 8.27 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: రా. 12.30 నుండి 2.05 వరకు; వర్జ్యం: మ. 2.18 నుండి 4.00 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:271 • గురువారం 11 జనవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

కాళేశ్వరం మహాద్భుతం

దేశంలోనే ఇదో గొప్ప ప్రాజెక్ట్

కేంద్ర జలసంఘం బృందం ప్రశంసలు

ఇది సమీకృత, బహుళార్థసాధక ప్రాజెక్టు

మమ్మల్ని ప్రాజెక్టు ఆకట్టుకుంది

దీన్ని ఆమోదిస్తున్నాం.. అభినందిస్తున్నాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేంద్రజలసంఘం పంపిన బృందం ప్రశంసల జల్లు కురిపించింది. ఈ ప్రాజెక్టు దేశ చరిత్రలోనే విభిన్నమైనదని, వేగంలో.. పనుల్లో ఆదర్శనీయమైనదని వ్యాఖ్యానించింది. కేంద్రజల సంఘం సిఈ సికెఎల్ దాస్ నేతృత్వంలోని బృందం రెండ్రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు పనుల జరుగుతున్న బ్యారేజీలు, పంప్ హౌజ్‌లు, టన్నెల్స్‌ను పరిశీలించింది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో ➩ 2వ పేజీలో...



తెలంగాణకు 50 టీఎంసీలు | ఆంధ్రప్రదేశ్‌కు 60 టీఎంసీలు

కృష్ణా జలాల కేటాయింపు

త్రిసభ్య కమిటీ భేటీలో నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణానదీయాజమాన్య బోర్డు సమావేశం బుధవారం జలసౌధలో జరగ్గా, ఇరు రాష్ట్రాలకు నీటి కేటాయింపులకు నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ 60, తెలంగాణ 50టిఎంసిలు వినియోగించుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సి మురళీధర్, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ ఈఎన్‌సి వెంకటేశ్వరరావులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు ➩ 2వ పేజీలో...



ఆధార్ స్థానంలో వర్చువల్ ఐడీ

• వెబ్‌సైట్ ద్వారా తాత్కాలిక నంబర్ • అన్ని ధృవీకరణలకు ఉపయుక్తం • సమాచార గోప్యత ప్రధానం • మార్చి 1 నుంచి వర్తింపు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డుదారులు వారి గోప్యతకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే దిశగా వర్చువల్ ఐడీ అనే సరికొత్త అంశాన్ని యూఐడీఏఐ బుధవారం ప్రవేశ పెట్టింది. ఆధార్‌కార్డులు అదేపనిగా 12 అంకెల బయోమెట్రిక్ ఐడీకి బదులుగా సిమ్ వెరిఫికేషన్ సహా అనేక అవసరాలకు వర్చువల్ ఐడీని యూఐడీఏఐ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. దీనివలన కార్డుదారులు ధృవీకరణ ➩ 2వ పేజీలో...

4 పంట పెట్టుబడికి మార్గాలు

వారంపాటు గ్రామసభల్లో చర్చలు

రైతు మనోగతం తెలుసుకునే యత్నం

మంత్రివర్గం ఉపసంఘం నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెట్టుబడి మద్దతు పథకంలో మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకే తుది నిర్ణయం తీసుకుని మార్గదర్శకాలు జారీ చేయాలని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. ఆ మేరకు వారం రోజులపాటు కసరత్తు చేయాలని నిర్ణయించింది. నియోజక వర్గాల వారీగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధుల నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించాలని తీర్మానించింది. బుధవారం సచివాలయంలో పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ సబ్‌కమిటీ అనేక అంశాలపై చర్చించింది. ప్రతిష్టాత్మకమైన ఈ పథకం అమల్లో ఎదురవుతున్న చిక్కులు, సాంకేతికపరమైన అంశాలు, పరిష్కార మార్గాలపై వివిధ శాఖల ముఖ్య కార్యద ర్శులు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ అధికారులతో ➩ 3వ పేజీలో...

1. ఏఈవోలు, వీఆర్వోల ద్వారా నగదు పంపిణీ
2. ఆన్‌లైన్‌లో బ్యాంకుఖాతాల్లోకి నగదు బదిలీ
3. సమన్వయ సమితిల ద్వారా చెక్కుల పంపిణీ
4. ఇవేవీ సాధ్యం కాకుంటే కిసాన్ గిఫ్ట్ కార్డులు



న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభుతో మంత్రి కేటీఆర్ సమావేశం

ఫార్మా సిటీకి 1500 కోట్లివ్వండి

మెగా లెదర్ పార్క్ కేటాయించండి

పారిశ్రామిక కారిడార్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులివ్వండి

బయో ఆసియా సదస్సుకు రావాలని వాణిజ్య మంత్రి ప్రభుకు ఆహ్వానం

ఢిల్లీలో మంత్రి కేటీఆర్ బిజీబిజీ

హైదరాబాద్‌లో విదేశీ భవనానికి త్వరలో స్థలం కేటాయింపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్‌ప్రభును రాష్ట్ర ఎన్ఆర్ఆర్ సంక్షేమం, ఐటీ శాఖల మంత్రి తారక రామారావు కోరారు. బుధవారం ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్‌లో సురేష్ ప్రభును ఆయన కార్యాలయంలో తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్‌తో కలిసి కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశం అనంతరం ఆయన ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ... దేశంలోనే టీఎస్ ఐపాస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు కావాల్సిన స్టేటస్, ఫార్మాసిటీ అభివృద్ధికి 1500 కోట్ల రూపాయలను ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరామని చెప్పారు. నిజామాబాద్ స్పైస్ పార్కుకు రూ.20 కోట్లను ➩ 3వ పేజీలో...

హస్తినకు పెట్టుబడి చిక్కుముడి



3

నిబంధనల సడలింపునకు కేంద్రంతో సంప్రదింపులు

కరెన్సీ సర్దుబాటు కోసం ఆర్బీఐ గవర్నర్‌తో చర్చలు

త్వరలో ఢిల్లీకి వెళ్లాలని కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం

ఆ తర్వాతే సీఎం కేసీఆర్‌కు నివేదిక: మంత్రి పోచారం



రైళ్లను పరుగులు పెట్టించాలి!

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి

బడ్జెట్‌లో కొత్త రైళ్లు..

కొత్త మార్గాలుండాలి

దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలకు ఆమోదం

జీఎం అధ్యక్షతన పార్లమెంట్ సభ్యుల భేటీ

5



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు బార్లా..!


6

సింగిల్ బ్రాండ్ రిటైల్‌కు 100 శాతం

ఎయిరిండియాలో 49శాతం

సులభతర వాణిజ్యానికి మరింత ఊతం

కేంద్ర కేబినెట్ నిర్ణయాలు



భారత్ వృద్ధి రేటు బహు భేష్

• సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం 6

• వృద్ధిరేటు 7.3% • ప్రపంచ బ్యాంక్ అంచనా

ఇస్రో చైర్మన్‌గా శివన్



షార్‌లో కౌంట్‌డౌన్ 10

గణతంత్ర వేడుకకు 10 ఆసియాన్ అతిథులు



వివరాలు 11లో...

ఔరా..!



అనుమతి లేని లేఅవుట్లకు నో రిజిస్ట్రేషన్

భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక వ్యవస్థ? • పరిశ్రమల ఏర్పాటుకు గ్రామ పంచాయతీల అనుమతి తప్పనిసరి • సర్పంచులకు విస్తృతాధికారాలు • అవసరమైతే చట్టంలో మార్పులు చేర్పులు • గ్రామ పంచాయతీల్లో కోఆప్షన్ సభ్యులుగా ఎన్ఆర్ఐలు • కేబినెట్ సబ్ కమిటీ భేటీలో సుదీర్ఘ చర్చ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఎలా ఉంటుందనే దానిపైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆలోచన చేస్తుంది. బుధవారం మూడవ రోజు సమావేశమైన ఉపసంఘం దాదాపు ఎనిమిది గంటల పాటు అనేక అంశాలపైన సుదీర్ఘంగా చర్చించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్ రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. అనుమతి లేని ➩ 9వ పేజీలో...



డీలిమిటేషన్‌పై కేంద్ర కేబినెట్ నోట్

ఊపందుకున్న నియోజక వర్గాల పునర్విభజన

15న కేంద్రం కీలక నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త నియోజక వర్గాల ఏర్పాటు అంశం మళ్లీ ఊపందుకున్నది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జనవరి 15న నియోజక వర్గాల ➩ 9వ పేజీలో...

కాళేశ్వరం మహాద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని విధాలా ప్రత్యేకమైనదని బృంద సారథి, సిడబ్ల్యుసి సిఈ సికెఎల్ దాస్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొత్త ఆయకట్టుకు నీరివ్వడమే కాకుండా శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు, లోయర్ మానేరు వంటి ప్రాజెక్టులకు కాళేశ్వరం ప్రధాన ఆధారంగా మారి.. ఆయకట్టుకు భరోసా కల్పించబోతున్నదన్నారు. ఇలా ఒక భారీ ప్రాజెక్టు మరికొన్ని సాగునీటి ప్రాజెక్టులతో అనుసంధానిస్తున్న ప్రక్రియ తెలంగాణలోనే కనిపిస్తున్నదని దాస్ అభిప్రాయపడ్డారు. స్ట్రక్చర్ల నిర్మాణం, ప్రణాళిక, పనుల వేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయన్నారు. రేయింబవళ్ళు మూడు షిఫ్టులలో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానాకాలం నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు తొలి మైలురాయిని అధిగమిస్తుందని దాస్ అభిప్రాయపడ్డారు. ఈ తరహా వేగవంతమైన పనులు దేశంలో ఎక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు.. మరో 18లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ప్రశంసించారు. జూన్‌లో ప్రాజెక్టు నుండి మిడ్‌మానేరుకు నీరు అందించి.. తొలి ఫలితాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, టైమ్‌ఫ్రేమ్ ప్రకారం పనులు జరిగితే అనుకున్న గడువులోగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. జాప్యం జరగకుండా పనులు పూర్తికావాలని, అందుకు ప్రతి ఒక్కరూ.. అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని దాస్ కోరారు. నిర్దిష్ట గడువులోగా ప్రాజెక్టులు పూర్తిచేయడం ఇపుడు సవాల్‌గా మారిందని, అంచనా వ్యయం మించకుండా పనులు పూర్తిచేయడం ప్రధాన సవాల్ అని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక సవాలుగా తీసుకుందన్నారు. కాళేశ్వరం పనులు చూస్తుంటే సులువుగానే లక్ష్యాలు సాధిస్తారని భావిస్తున్నానన్నారు. ప్రాజెక్టుకు జాతీయ అభివృద్ధిలో కాళేశ్వరం కీలకపాత్ర పోషిస్తుందని, ఇదో మెగా ప్రాజెక్ట్ అన్నారు. మేడిగడ్డ వద్ద ఎలాంటి సమస్యలేదు: సిడబ్ల్యుసి డైరెక్టర్ నిత్యానందరాయ్ మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య లేదని కేంద్రజలసంఘం హైడ్రాలజీ విభాగ డైరెక్టర్ నిత్యానందరాయ్ స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద 284.2టిఎంసిల నీటి లభ్యత ఉందన్నారు. కాళేశ్వరం పనులు చాలా సంతృప్తికరంగా , వేగంగా జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, దేశంలో ఇదొక గొప్ప ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు.

గడువులోగా పూర్తిచేస్తాం: జోషి, స్పెషల్‌సిఎస్

కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేస్తామని ప్రభుత్వ స్పెషల్ సిఎస్ ఎస్‌కె జోషి అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ఈ ప్రాజెక్టు పనులను నిరంతరం సమీక్షిస్తున్నారన్నారు. నిర్ణీత గడువులోపే పూర్తిచేసి రికార్డు సృష్టిస్తామన్నారు. 2015లోనే ప్రారంభించిన ప్రాజెక్టు రెండేళ్ళలోనే ఈస్థితికి చేరిందన్నారు. సమావేశంలో కేంద్ర జల సంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్‌కుమార్, కాళేశ్వరం సిఈలు ఎన్ వెంకటేశ్వర్లు, హరిరామ్, ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు.

దేశానికే తలమానికం

- కాళేశ్వరం సందర్శించిన అటవీ అధికారులు
- ప్రత్యామ్నాయ అడవుల పెంపునకు ప్రణాళికలు
- పీసీసీ ఎఫ్ ప్రశాంత్ ఝా వెల్లడి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే తలమానికమని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ప్రశాంత్ కుమార్ ఝా ప్రశంసించారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కావడం గర్వకారణమని అన్నారు. బుధవారం ఝా నేతృత్వంలో అటవీ శాఖ ముఖ్య అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పనులు జరిగే ప్రాంతాలను సందర్శించింది. 50 మంది సభ్యులు గల ఈ బృందం ప్రత్యేక బస్సులో హైదరాబాద్ నుంచి ఉదయం బయలుదేరింది.ఇక్కడి నుంచి బయలుదేరి బృందం వరంగల్ చేరుకున్నాక కలెక్టర్ ఆమ్రపాలితో ఇతర అధికారులతో ప్రాజెక్టును గూర్చి అడిగి తెలుసుకుంది. అనంతరం భూపాలపల్లి చేరుకుంది. అక్కడ అటవీశాఖకు చెందిన వుడెన్ హౌస్‌ను పరిశీలించారు. ఆ తర్వాత మేడిగడ్డ వద్ద కాళేశ్వరం పనులను పరిశీలించారు. ప్రాజెక్టు కోసం కోల్పోయిన భూముల స్థానంలో ప్రత్యామ్నాయంగా అటవీ భూముల పెంపకంపై చర్చించారు. అనంతరం మేడిగడ్డ ఆనకట్ట, కన్నెపల్లి పంప్ హౌస్, నీరు లిఫ్ట్‌చేసే విధానం గూర్చి ఇరిగేషన్ అధికారులు అటవీ అధికారుల బృందానికి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రాష్ట్రంలో 80 శాతం భూములు సాగులోకి వస్తాయని, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులు కూడా పూర్తయితే 90 శాతం భూములు జలకళతో కలకలలాడుతాయన్నారు. ప్రాజెక్టుల కోసం విలువైన అటవీ భూములు కోల్పోతున్నప్పటికీ, వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా పెద్దయెత్తున అడవులు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. హరితహారం ద్వారా పచ్చదనం పెంచుతామన్నారు. కాళేశ్వరానికి ప్రాజెక్టుకు రికార్డు స్థాయిలో కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని ప్రశాంత్ ఝా తెలిపారు. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లా ధర్మారంలో కూడా టన్నెల్ పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దేవసేనతో పాటు ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. టన్నెల్ పనుల వివరాలను తెలుసుకున్నారు.

రాబడుల ఆశలు పెంపు

- 20% పెరగనున్న అంచనాలు
- భారీ లక్ష్యం దిశగా కసరత్తు
- సంక్షేమ నిధులకు లోటు లేకుండా
- 2018-19 బడ్జెట్‌కు రాబడులే కీలకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఆర్ఎస్ ఎన్నికల బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు సింహ భాగం కేటాయింపులు చేయనున్నారు. రూ. 1.80 లక్షల కోట్ల బడ్జెట్‌కు అనుగుణంగా రాబడి అంచనాలనూ పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ దిశలో రెవెన్యూ రాబడి శాఖల అంచనా ఆదాయాలను మరో 20శాతం పెంచుకునే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆబ్కారీ ఆదాయంతో కలుపుకుని 18శాతం వృద్ధి రేటు నమోదైన నేపథ్యంలో రానున్న ఈ ఏడాదిలో ఆదాయ లక్ష్యం పెంచుకోవాలని యోచిస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ ఇబ్బందులను అధిగమించి భారీ ప్రగతిలో ఉన్నామని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాబడులు పెరుగుతున్నా యని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈమేరకు లక్ష్యం పెంచుకోనున్నారు. ప్రస్తుత ఆర్థిక యేడాది 2017-18 వార్షిక స్థూల బడ్జెట్ గతేడాది కంటే రూ. 19వేల కోట్ల అదనపు మొత్తం పెంపుతో రూ.1,49,646 కోట్లకు ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ వార్షిక ఏడాది రెవెన్యూ మిగులుగా రూ. 4571.30 కోట్ల అంచనాతో ద్రవ్య లోటును రూ. 26096.31కోట్లకు పరిమితం చేసుకుంది. మొత్తం ద్రవ్యలోటును రాష్ట్రస్థూల ఉత్పత్తిలో 3.48 శాతంగా అంచనా వేస్తూ, సాగునీటి రంగానికి కేటాయించిన నిధులను నిర్మాణ వ్యయంగా పరిగణించిన కారణంగానే రెవెన్యూ మిగులను అధికంగా అంచనా వేసినట్లు స్పష్టమయింది. ఈ వార్షిక ఏడాది బడ్జెట్‌లో సొంత వనరుల రాబడిని 2016-17లో రూ. 58,636కోట్లనుంచి ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో రూ. 69,220కోట్లకు పెంచుకుంది. అయితే 2016-17లో సవరించిన అంచనా మేరకు రూ. 1,12,191కోట్లు వ్యయం అవుతాయని భావించినా ఆ మేరకు సాధ్యపడలేదు. ఇక కీలక వనరులు భారీగా కోత పడ్డాయి. కోర్టు వ్యాజ్యాల కారణంగా భూముల అమ్మకాల ఆదాయం, వాణిజ్య పన్నుల బకాయిలు ఖజానాకు చేరలేదు. నోట్ల రద్దు కూడా ఖజానాపై ప్రభావం చూపింది. వాణిజ్య పన్నుల రాబడి అంచనాలు రూ. 42074కోట్లు కాగా వివిధ కారణాలతో రూ. 37,439కోట్లు మాత్రమే ఖజానాకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక ఏడాది వాణిజ్య పన్నుల శాఖ రాబడిని రూ. 46,499కోట్లతో 10శాతం మేర వృద్ధిరేటును వర్తింపజేశారు. ఇప్పుడు వచ్చే ఏడాదికి మరో 15నుంచి 20శాతం పెంపును వర్తింపజేయాలని యోచిస్తున్నారు. మరో కీలక ఆదాయ వనరుగా ఉన్న ఆబ్కారీ శాఖ లక్ష్యం 2016-17లో రూ. 5083కోట్లు కాగా 2017-18లో భారీ వృద్ధిరేటుతో రూ. 8999కోట్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిని తాజాగా మరో 15 శాతం పెంచనున్నారని తెలిసింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి లక్ష్యం 2016-17లో రూ. 4291కోట్లనుంచి వివిధ కారణాలతో తగ్గించి రూ. 3వేల కోట్లకు పరిమితం చేశారు. వాహన పన్నుల రాబడిని గతేడాది రూ. 2587కోట్లనుంచి రూ. 3వేల కోట్లకు, ఇతర మార్గాల్లో రూ. 36,237కోట్లను ప్రభుత్వం అంచనాగా వేసుకుంది.



కేసీఆర్‌తో ఆర్థిక శాఖ మంత్రి ఈటల (ఫైల్ ఫొటో)

కేంద్ర వితరణ నిధులు...

ఇక కేంద్ర వితరణ కింద వచ్చే నిధులను 2015-16లో రూ. 25223.49 కోట్లు అయితే 2017-18లో ఇవి రూ. 43,862కోట్లకు అంచనా వేశారు. ప్రారంభ నిల్వను రూ. 467కోట్లతో మొదలు పెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులను రూ.1,13,083.04 కోట్లుగా నిర్దేశించింది.

10.1 శాతంగా రాష్ట్ర స్థూల ఆర్థిక వృద్ధి...

రాష్ట్ర స్థూల ఆర్థిక వృద్ధిరేటు పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా రాష్ట్రంలో రెండంకెల వృద్ధిని సాధించింది. 2014-15, 2015-16లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో 9.5 శాతం, 6.3 శాతంగా కుంటుపడినా ఆర్థికంగా రెండంకెల వృద్ధిరేటుకు చేరువైంది. 2016-17 ముగిసిన ఆర్థిక ఏడాదికి జాతీయ వృద్ధిరేటు 7.1 వాతంకాగా తెలంగాణ స్థూల ఆర్థిక వృద్ధిరేటు 10.1 శాతంగా నమోదవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

తాజా బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు ఇలా...

విద్యుత్ రంగం	4203కోట్లు
రహదారులు-భవనాలు	5033కోట్లు
పరిశ్రమలు	985కోట్లు
మిషన్‌భగీరథ	3000కోట్లు
ఫీజు రీఎంబర్స్‌మెంట్	1939కోట్లు
వ్యవసాయం	5942కోట్లు
ఇరిగేషన్	26652కోట్లు
నీటిపారుదల రంగం	2000కోట్లు
విద్య	12705కోట్లు
వైద్య, ఆరోగ్యం	5976కోట్లు
ఎస్సీ సంక్షేమం	14375కోట్లు
ఎస్టీ డెవలప్‌మెంట్ ఫండ్	8165కోట్లు
మైనార్టీ సంక్షేమం	1249కోట్లు
ఓయూ శతాబ్ది ఉత్సవాలకు	200కోట్లు
రజక, నాయిబ్రాహ్మణ సంక్షేమం	500కోట్లు
చేనేత కార్మికులకు	1200కోట్లు
మూసీ నది ప్రక్షాళన	3060కోట్లు
సైనికులు, మాజీ సైనికుల	
ప్రత్యేక నిధి హరిత హారం	50కోట్లు
ఐటీ	252కోట్లు
శాంతిభద్రతలు	4828కోట్లు
పర్యాటక, సాంస్కృతిక	198కోట్లు
రహదారుల అభివృద్ధి	5033కోట్లు
జీహెచ్ఎంసీకి	1000కోట్లు
గ్రేటర్ వరంగల్	300కోట్లు
మిగతా కార్పొరేషన్లకు	400కోట్లు
పట్టణాభివృద్ధికి	5599కోట్లు
పంచాయతీరాజ్‌కు	14723కోట్లు
విద్యారంగం అభివృద్ధికి	12,705కోట్లు
జర్నలిస్టుల సంక్షేమం	30కోట్లు
ఎంబీసీలకు	1000కోట్లు
బ్రాహ్మణ సంక్షేమం	100కోట్లు
ఆసరా పింఛన్లకు	5330కోట్లు
మైనార్టీ	1249కోట్లు
బీసీ సంక్షేమం	5070కోట్లు
మహిళా శిశు సంక్షేమం	1731కోట్లు
రైతు రుణమాఫీకి	4వేల కోట్లు

ఒక్క దమ్ముకే బానిసలైపోతారు..!



లండన్: తొలిసారిగా సిగరెట్ తాగడా నికి ప్రయత్నించిన వారిలో మూడింట రెండు వంతుల మంది ప్రతిరోజూ ధూమపానానికి అలవాటు పడిపోతారని తాజా అధ్యయ నం వెల్లడిం చింది. అధ్యయన చరిత్రలో తొలిసారి అన్నట్టుగా 2,15,000 మందికిపైగా వయోజనులపై సర్వే జరపగా సిగరెట్‌ను ఒకసారి తాగితే చాలనే భావనను తగ్గించే ప్రయత్నాలకు గట్టి మద్దతు లభించింది. అతిపెద్ద డేటాతో సిగరెట్ అనుభవాన్ని తొలిసారిగా గ్రంథస్తం చేసామని క్వీన్ మేరీ యూనివర్శిటీ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ పీటర్ హజెక్ తెలిపారు. ఏదైనా వ్యసనంగా మారుతున్నప్పుడు ఒకసారితో మొదలుపెట్టి ప్రతిరోజు అలవాటు కావడం ఒక కీలకమైన పరిణామం. అది ఒక ఉల్లాసభరితమైన చర్యను తప్పనిసరి అవసరంగా మారుస్తుంది అని అధ్యయనానికి నేతృత్వం వహించిన హజెక్ చెప్పారు. నికోటిన్ అండ్ టుబాకో రీసెర్చ్ జర్నల్‌లో సదరు అధ్యయనం ప్రచురితమైంది. పరిశోధకులు ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో అదే తరహా సర్వే ఫలితాల కోసం అంతర్జాతీయ ఆరోగ్య డేటా ఎక్స్చేంజ్‌ను శోధించారు. సర్వేలో పాల్గొన్నవారిలో 60.3 శాతం మంది ఒకసారి చూద్దామని సిగరెట్ కాల్చామని తెలిపారు. అలా చెప్పినవారిలో 68.9 శాతం మం ది ఆ తర్వాత రోజూ ధూమపానం చేస్తున్నామని చెప్పారు. పొగాకు సిగరెట్ల కన్నా కూడా ఇ-సిగరెట్లు తాగడం వ్యసనంగా మారుతుందనే వాదనలను తాజా సర్వే తోసిపుచ్చింది. ఇ-సిగరెట్లతో మొదలుపెట్టివారి కన్నా పొగాకు సిగరెట్‌తో ధూమ పానం ప్రారంభించేవారే దానికి వ్యసనపరులవుతున్నారని హజెక్ వెల్లడించారు.

అదనపు నిద్రతో ఆరోగ్యకరమైన ఆహారం



లండన్: రోజు కన్నా ఒక గంటసేపు ఎక్కువ నిద్రపోవ డంవలన చక్కెర పదార్థాలను తినడం తగ్గుతుందని, అది ఆరోగ్యకరమైన ఆహా రం తీసుకోవడానికి దారి తీస్తుందని తాజా అధ్య యనం తేల్చింది. సరైన నిద్రలేకపోతే ఊబకాయం, హృద్రోగాలకు దారి తీస్తుందని పరిశోధకులు తెలిపారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైనఆ అధ్యయనం పౌష్టికాహారం తీసుకోవడంపై పెరిగిన నిద్ర గంటల ప్రభావాన్ని పరిశీలించింది. ఎక్కువ సేపు నిద్ర పోవడం వల్ల తీసుకునే చక్కెర పదార్థాల్లో 10 గ్రాములు తగ్గిందని కింగ్స్ కాలేజ్ లండన్ పరిశోధకులు వెండీ హాల్ తెలిపారు. పిండి పదార్థాల శాతం కూడా తగ్గిం దని చెప్పారు. దీని కోసం చెరి 21 మందితో రెండు బృందాలపై ఒక వారం అధ్యయనం చేపట్టారు. మొదటి బృందంలో వారిని అదనంగా గంటన్నరసేపు నిద్రపో యేలా చేశారు. రెండవ బృందం నిద్రవేళల్లో ఎలాంటి మార్పులు చేయ లే దు. వా రం రోజుల తర్వాత మొదటి బృందం వారి జీవనశైలిలో మార్పు వచ్చింది. పౌష్టికాహారం తీసుకోవడం ప్రారంభించారు. అదనపు సమయం నిద్రపో నివా రిలో ఎలాంటి మార్పు రాలేదని తేలిందని మరో పరిశోధకులు ఖతీబ్ తెలిపారు.

మనుగడలో మహిళలే మిన్న



లండన్: మహిళలు సాధారణ పరిస్థితుల్లోనే కాదు కరవు కాటకాల్లోనూ మగవారి కన్నా మిన్నగా జీవించగలరని తాజా అధ్యయనంలో తేలింది. పురుషుల కన్నా స్త్రీలు బలహీనులనే వాదనను తోసిపుచ్చింది. జన్యువులు లేదా హార్మోన్లు లాంటి జీవసంబంధిత అంశాలు విపత్కర పరిస్థితుల్లో ఎదురీదగలిగే అదనపు సామర్థ్యాన్ని మహిళలకు అందించాయని అమెరికాలో సదరన్ డెన్మార్క్ యూనివర్శిటీ, డ్యూక్ యూనివర్శిటీలకు చెందిన పరిశోధకులు నిర్ధారించారు. యుక్త వయస్సులో కన్నా కూడా శైశవదశలోనే వారికి మనుగడ సామర్థ్యం అలవడింది. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు మగపిల్లల కన్నా ఆడపిల్లలే వాటిని సమర్థవంతంగా అధిగమించగలరని పరిశోధకులు తేల్చారు. ఇందు కోసం దాదాపు 250 సంవత్సరాల వెనక్కి వెళ్ళారు. గడచిన రెండున్నర శతాబ్దాల కాలంలో కరవు, వ్యాధులు, విపత్తుల వల్ల సంభవించిన మరణాల డేటాను అధ్యయనం చేశారు. ఉదాహరణకు 1933లో ఉక్రెయిన్‌లో కరవు వచ్చినప్పుడు జన్మించినవారిలో బాలికలు 10.85 సంవత్సరాలు జీవించగా, బాలురు 7.3 సంవత్సరాలు మాత్రమే మనుగడ సాగించారు. పీఎన్ఏఎస్‌లో ప్రచురితమైన అధ్యయన ఫలితాలు హింస లేదా ముప్పును ఎదుర్కోవడం లాంటి స్త్రీ, పురుషుల మధ్య ప్రవర్తన, సామాజిక భేదాల ద్వారా మాత్రమే ఎంతకాలం జీవిస్తారనేది పూర్తిగా వివరించలేరని తెలిపాయి.

వృద్ధిరేటు పెరుగుదలపై సర్కార్ ఖుషీ

భారీ బడ్జెట్‌కు కసరత్తు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావంతో రాష్ట్ర ఆర్థికపరిస్థితి కుదేలవుతుందని భావించిన తరుణంలో కూడా రాష్ట్ర వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం కుషీగా ఉంది. వచ్చే బడ్జెట్ కూడా రికార్డు స్థాయిలో ప్రతిపాదించేందుకు సర్కార్ సన్నాహాలు చేస్తోంది. 2017 డిసెంబర్ వరకు అన్ని రాబడుల శాఖల్లో వచ్చిన ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుంటే వృద్ధిరేటు 19 శాతానికి చేరుకుంది. ఈ ఆర్థికసంవత్సరం ముగిసేలోగా వృద్ధి రేటు మరింత పెరిగే అవకాశం ఉంది. గత సంవత్సరంతో పోలిస్తే ఇప్పటికే 8 శాతం ఎక్కువగా వృద్ధిరేటు నమోదు కావడంతో సీఎం కేసీఆర్ లక్ష్యాలకు అనుగుణంగా భారీ బడ్జెట్ ప్రతిపాదించేందుకు ఆర్థిక శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. శాసనసభ ఎన్నికలకు మరో ఏడాదిన్నర మాత్రమే గడువు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా బడ్జెట్ స్వరూపాన్ని రూపొందిస్తోంది. రాబడులు మంద గమనంతో ఉన్నాయని భావిస్తున్న తరుణంలో కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నిలదొక్కుకోవడంతో జనరంజక బడ్జెట్‌ను ప్రజల ముందు పెట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ నేతృత్వంలో జరిగిన బడ్జెట్ కసరత్తు సమావేశంలో శాఖాధిపతులకు ఈ విషయమే ఆయన నిర్దేశించారు.

ఇప్పటి వరకు అందిన రాబడుల ప్రకారం 2018 - 19 సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను రూ. 1,72,000 కోట్లతో రూపొందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వచ్చే త్రైమాసికానికి ఆదాయం పెరిగితే కొత్త బడ్జెట్ అంతకంటె మరింత పెరిగే అవకాశం లేకపోలేదని చెప్పారు.

మొత్తం మీద 2017 -18 వార్షిక బడ్జెట్ రూ.1,49,646 కోట్లు కాగా, ఆదాయంలో పెరుగుదల 19 నుంచి 25 శాతం ఉండే అవకాశం ఉన్నందున మరో రూ.25 వేల కోట్లతో 2018-19 బడ్జెట్ రూపకల్పన జరిగే అవకాశం ఉంది. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రాబడుల వివరాలు ఇలా ఉన్నాయి. పెట్రోలియం ఉత్పత్తులు అమ్మకం, మద్యం ద్వారా వచ్చిన పన్ను (వ్యాట్ రాబడి), వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ,ఎక్సైజ్ డ్యూటీ రాబడుల వివరాలు ఇలా ఉన్నాయి. విలువ ఆధారిత పన్నుల (వ్యాట్ కలెక్షన్స్) ద్వారా రూ. 19,404.54 కోట్లు,ఎక్సైజ్ డ్యూటీ పరిహారం రూ. 2,828.95 కోట్లు, ఎస్జీఎస్టీ ద్వారా రూ. 3,969.93 కోట్లు, ఇండిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సేల్స్ టాక్స్ (ఐజీఎస్టీ) ద్వారా రూ.3,438.88 కోట్లు, కేంద్రం నుంచి వచ్చిన జీఎస్టీ పరిహారం రూ. 169 కోట్లతో కలిపి మొత్తం రూ. 26,982.35 కోట్ల ఆదాయం వచ్చింది(ఆబ్కారి ఆదాయం మినహాయిస్తే). ఆబ్కారి ఆదాయంతో సర్దుబాటు చేస్తే మొత్తం రాబడి రూ.29,811.30 కోట్లుగా నమోదైంది.

తెలంగాణకు 50 ఆంధ్రప్రదేశ్ 60 టీఎంసీలు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకున్న నీటితో పాటు భవిష్యత్ నీటి వినియోగంపైనా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం కృష్ణానీటి లభ్యత 139టిఎంసిలుగా ఉండగా, ఆగస్టు వరకు వీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సి ఉందని బోర్డు సూచించింది. ప్రస్తుతం 110టిఎంసిలు మాత్రమే ఇరు రాష్ట్రాలు వాడుకునేలా కెఆర్ఎంబి ఆదేశాలిచ్చింది. మిగతా నీటిని పక్కనబెట్టింది. టెలిమెట్రీ, చిన్ననీటి వనరుల వినియోగం సహా ఇతర అంశాలపై ఇప్పటికే ఏర్పాటుచేసిన కమిటీలు ఇచ్చే నివేదికలకు అనుగుణంగా వ్యవహరించాలని బుధవారం జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయించారు.

భారత్‌లో జర భద్రం

పౌరులకు అమెరికా ప్రయాణ సలహా

న్యూఢిల్లీ: భారత్ సహా వేర్వేరు దేశాల్లో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటూ అమెరికా తన పౌరులకు తాజా ప్రయాణ సలహా జారీ చేసింది. నేరాలు, ఉగ్రవాదం కారణంగా భారత్‌లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అదే సమయంలో జమ్మూ, కాశ్మీర్‌కు ప్రయాణించవద్దని తెలిపింది. సాయుధ ఘర్షణ పొంచి ఉన్న ఇండో-పాక్ సరిహద్దుకు దాదాపు 15 కి.మీ.ల పరిధిలో అడుగుపెట్టవద్దని హెచ్చరించింది. భారత్‌లో త్వరితగతిన పెరుగుతున్న నేరాల్లో అత్యాచారం ఒకటిగా భారతీయ అథారిటీలు నివేదించాయి. పర్యాటక స్థలాలు, ఇతర చోట్ల లైంగిక దాడి లాంటి హింసాత్మక నేరం చోటు చేసుకుంది అని ప్రయాణ సలహాలో పేర్కొంది. తూర్పు-మధ్య భారత్‌లో మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉగ్రవాదులు లేదా సాయుధ మూకలు చురుగ్గా ఉన్నారని తెలిపింది. ఉగ్రవాదులు ఎలాంటి హెచ్చరిక లేకుండా పర్యాటక ప్రాంతాలు, రవాణా కేంద్రాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ లక్ష్యంగా దాడి చేయవచ్చు అని తన పౌరులను అమెరికా అప్రమత్తం చేసింది.

ఆధార్ స్థానంలో వర్చువల్ ఐడీ

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో వారి ఆధార్ నంబర్‌ను పంచుకోవాల్సిన పనిలేదు. 16 అంకెల వర్చువల్ ఐడీ ద్వారా కార్డుదారుని పేరు, చిరునామా, ఫొటో లాంటి పరిమిత సమాచారాన్ని పొందవచ్చు. కార్డుదారులు ఒకటికి మించి ఎన్ని వర్చువల్ ఐడీలనైనా పొందవచ్చని అధికారులు తెలిపారు. కొత్త ఐడీ తీసుకున్నప్పుడు పాత ఐడీ అయాచితంగా రద్దు అయిపోతుంది. వర్చువల్ ఐడీ ఒక వ్యక్తి ఆధార్ నంబర్‌కు సంబంధించి తాత్కాలికమైన 16 అంకెల సంఖ్య. ఆధార్ జారీ చేసే అథారిటీ మార్చి ఒకటవ తేదీ నుంచి వర్చువల్ ఐడీని ఆమోదించడం ప్రారంభిస్తుంది. ప్రజల నుంచి ఆధార్ ధృవీకరణ కోరే ఏజెన్సీలు జూన్ ఒకటవ తేదీ నుంచి వర్చువల్ ఐడీని తప్పనిసరిగా అంగీకరించాలి. నిర్దేశిత గడువు నాటికి సదరు ఏజెన్సీలు కొత్త విధానానికి మారని పక్షంలో అవి ఆర్థికపరమైన చర్యలను చవిచూడాల్సి ఉంటుంది.ధృవీకరణ లేదా కేవైసీ సేవల కోసం ప్రజలు ఆధార్‌నంబరుకు బదులుగా వర్చువల్ ఐడీని వినియోగించవచ్చు. ఆధార్ నంబర్ తరహాలోనే వర్చువల్ ఐడీ ద్వారా ధృవీకరణ చేపట్టడం జరుగుతుంది అని యూఐడీఏఐ ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. ఆధార్ డేటాలో వ్యక్తుల గోప్యతా సమాచార భద్రతను బలోపేతం చేసే దిశగా వర్చువల్ ఐడీ రంగంలోకి వచ్చింది. వినియోగదారులు యూఐడీఏఐ వెబ్‌సైట్ నుంచి నిర్దేశిత కాలానికి వర్చువల్ ఐడీ పొందవచ్చు. అవసరమైతే దాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకునేంతవరకు వినియో గించుకోవచ్చు. వారు సర్వీస్ ఏజెన్సీలకు ధృవీకరణ సందర్భంగా వేలిముద్రతో పాటు వర్చువల్ ఐడీని ఇవ్వాలి. దీని వలన వేర్వేరు ఏజెన్సీలకు ఆధార్ నంబర్లను సేకరించే పని తగ్గుతుంది.



యూఐడీఏఐ నిబంధనలకు లోబడి ధృవీకరణ చేపట్టే ఏజెన్సీలు ఆధార్ కార్డుదారుని తరపున వర్చువల్ ఐడీని వెబ్‌సైట్ నుంచి పొందరాదు. ధృవీకరణ సందర్భంగా ఆధార్ కార్డుదారులు వారి ఆధార్ నంబర్‌కు బదులుగా 16 అంకెల వర్చువల్ ఐడీని ఇచ్చేలా చూడాలని అన్ని ఏజెన్సీలను యూఐడీఏఐ ఆదేశించింది. ఇప్పటివరకు 119 కోట్ల మంది ఆధార్ నంబర్ కలిగి ఉన్నారు.

సర్వే నెంబర్ల పరిశీలన పూర్తి

• అప్‌డేట్ అవుతున్న భూ రికార్డులు




హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూ దస్త్రాల పరిశీలనతో అనేక అక్రమాలకు స్వస్తి పలికేందుకు వీలు చిక్కుతోంది. రకరకాల చిక్కులు తొలిగేందుకు సవరించిన రికార్డులు కీలకంగా మారనున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సాదాబైనామాలు అయితే ఈ ప్రక్షాళనతో కీలక ప్రయోజనం దక్కించుకున్నట్లయింది. 1,32,168 సర్వే నెంబర్లకు చెందిన సాదా బైనామాల క్రయ విక్రయాలకు రెవెన్యూ రికార్డుల రూపంలో చోటు దక్కింది. ఇక రెండు చోట్ల రెండు ఖాతాలకు మించిన భూములకు చెందిన లెక్కలతో గతంలో అనేక వివాదాలు వస్తూ రెవెన్యూ శాఖతోపాటు, వ్యవసాయ శాఖ, బ్యాంకులకు చిక్కులు తేవడం ఇప్పుడు ముగిసినట్లుగానే చెప్పుకోవచ్చు. రెండు ఖాతాలున్న భూములను 2,72,496 సర్వే నెంబర్లను గుర్తించి వీటిని సరిచేస్తున్నారు. ఇక పొజిషన్‌లో ఉన్న రైతుల పేర్లను సవరించిన అంశంలో 41,065 సర్వే నెంబర్ల లో మార్పులు చేర్పులు నమోదయ్యాయి. గతంలో వీటికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా మోక్షం దక్కని అనేక కేసులు ఉండటం గమనార్హం. ఒకరు పట్టాలో ఉంటే మరొకరు రికార్డుల్లో పేరున్న విషయంలోనైతే అనేక ఇబ్బందులు, ఆర్థిక భారంగా చిన్న రైతులకు తీరని సమస్య. వీటిని సరిచేసుకునేందుకు గతంలో భారీగా ముడుపులు చేతులు మారాల్సిన పరిస్థితి ఉండేది. దీనిపై కోర్టులు కూడా తప్పు పట్టిన సందర్భాలు ఉండగా నేడు దీనికి చరమగీతం పాడుతూ 1,19,370సర్వే నెంబర్లలో సవరించారు. వాటర్ బాడీలకు 7013 సర్వే నెంబర్లు, అటవీ భూములకు చెందినవి 17341సర్వే నెంబర్లను గుర్తించి రికార్డుల్లో నమోదు చేశారు. ఇక ప్రభుత్వం సేకరించిన భూములు 65611సర్వే నెంబర్లలో ఉన్నట్లుగా తేల్చారు. వ్యవసాయేతర భూములకు చెందిన సర్వే నెంబర్లు 3,49,966గా గుర్తించి జిల్లాల వారీగా రికార్డులను సవరించి రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేశారు. 1,16,845 సర్వే నెంబర్లను కొత్తగా గుర్తించి రికార్డుల్లో పొందుపర్చారు. ప్రభుత్వం పేదలకిచ్చిన అసైన్డ్ భూముల్లో ఇతరులు కబ్జాలో ఉన్న 90,063సర్వే నెంబర్లను గుర్తించి వాటిని ప్రత్యేకంగా నివేదించేందకు రెడీ చేశారు. వీటిని ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు. 1,35,016 సర్వే నెంబర్లలో ఎటాంటి భూమి లేకుండానే ఖాతా నెంబర్ ఉన్నట్లుగా గుర్తించి వీటిని తొలగించాలని నిర్ణయించారు. 6332 సర్వే నెంబర్లలో పాస పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయని, 15359సర్వే నెంబర్లకు చెందిన పాస్ పుస్తకాల జారీ జరిగినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయలేదని రుజువైంది. 1,21,718 సర్వే నెంబర్లలో రికార్డుల్లో పేర్కొన్న విస్తీర్ణంకంటే తక్కువ విస్తీర్ణం ఉన్నట్లుగా తేలింది. మరో 3,56,247 సర్వే నెంబర్లకు చెందిన వాటిల్లో రికార్డులకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్నట్లుగా గుర్తించారు. 2,12,222 సర్వే నెంబర్లలో పెండింగ్ మ్యుటేషన్ ఉన్నట్లుగా రికార్డుల ప్రక్షాళనతో వెల్లడైంది. మ్యుటేషన్లు మాన్యువల్‌గా పూర్తయినా రికార్డుల్లో నమోదుకాని 1,52,226 సర్వే నెంబర్లను గుర్తించి అప్‌డేట్ చేశారు. 13 వేలసర్వే నెంబర్లలో రెవెన్యూ కోర్టు కేసుల పరిధిలో ఉన్నాయని తేల్చారు. మరో 28,525 సర్వే నెంబర్లలో సివిల్ కోర్టు తగాదాలు ఉన్నట్లుగా గుర్తించారు. 47,22,602 సర్వే నెంబర్లలో తప్పులు ఉన్నాయని తేలింది. మొత్తం 1,81,64,320 సర్వే నెంబర్లకుగానూ 1,34,41,718 సర్వే నెంబర్లు మాత్రమే క్లీయర్‌గా ఉన్నాయని తేలింది.

స్వదేశాభివృద్ధికి సేవలందించండి

• ప్రవాస భారతీయులకు రాష్ట్రపతి పిలుపు

న్యూఢిల్లీ: ఇతర దేశాల్లో స్థిరపడిన ప్రవాసభారతీయులు అక్కడి అభివృద్ధిలో భాగస్వాములవుతూ, చట్ట సభల్లో ఉన్నత పదవులు పొందడం గర్వకారణమనీ, అదే సందర్భంలో వారు తమ ప్రాథమ్యాలను స్వదేశాభివృద్ధికి అనుసంధానం చేయాలని రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ పిలుపు ఇచ్చారు. ప్రవాసీ భారతీయ పార్లమెంటేరియన్ల అంతర్జాతీయ మహాసభలో ప్రసంగిస్తూ ఆయన, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయనీ, వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధి కృషిలో ప్రవాస భారతీయులు పాలు పంచుకోవాలని ఆయన సూచించారు. ప్రవాస భారతీయులు వివిధ దేశాలతో సజీవ వారధులని ఆయన అభివర్ణించారు. ఈ మహాసభకు 23 దేశాలకు చెందిన ఎన్నారై పార్లమెంటేరియన్లు



హాజరవుతున్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎన్ని ఆటు పోట్లు వచ్చినా, సుస్థిరంగా ఉన్నందుకు గర్వించాలనీ, భిన్నత్వంలో ఏకత్వమే మన బలమనీ, ఏ దేశానికి వెళ్ళినా, స్వదేశం అభివృద్ధి కృషిలో పాలు పంచుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు. సాధారణ పౌరులుగా కాకుండా, అక్కడి చట్టసభల్లో సభ్యులుగా రాణిస్తున్న ప్రవాస భారతీయులు తమ కార్యక్రమాలను స్వదేశాభివృద్ధికి అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. మన దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందనీ, 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలు ఫలప్రదమయ్యేట్టు ఎన్నారైలు తోడ్పాటును అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దుబాయ్ ఆర్థిక వ్యవస్థకు ప్రవాస భారతీయులే వెన్నెముకగా ఉన్నారనీ, అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో అత్యధికులు భారతీయులేనని రాష్ట్రపతి గుర్తు చేశారు. న్యూయార్క్, లండన్, గల్ఫ్ ప్రాంతాల్లోని అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాలు ఎన్నారైల భాగస్వామ్యంతోనే పని చేస్తున్నాయని ఆయన అన్నారు.

రాష్ట్రపతితో గవర్నర్ల కమిటీ భేటీ

న్యూఢిల్లీ: 'సమాజం మార్పులో ఏజెంట్లుగా గవర్నర్ల పాత్ర' అన్న అంశంపై ఒక నివేది కను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిం ద్‌కు గవర్నర్ల కమిటీ సమర్పిం చింది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తమిళనాడు గవర్న ర్ భన్వర్‌లాల్ పురోహిత్, యు.పి గవర్నర్ రామ్ నాయక్, త్రిపుర గవర్నర్ తథాగతరాయ్ హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఉన్నారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన 48వ గవర్నర్ల సదస్సులో ఈ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ అభివృద్ధి ప్రక్రియలో గవర్నర్లు నిర్వహిస్తున్న పాత్రను పరిశీలించింది. రాజ్ భవన్‌లు తమ శక్తిమేరకు సమాజా భివృద్ధికి తోడ్పడ్డాయని రాష్ట్రపతికి సమర్పించిన తమ నివేదికలో కమిటీ పేర్కొం ది ప్రాధాన్య అంశాలను గుర్తించి వాటిని సాధించడానికి తగిన చర్యలు చేపడితే.. సర్వ శ్రేష్ఠ భారత్ ఆవిష్కారమవుతుందన్నారు. అంతేకాక, తమ రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి పథకాలపై పర్యవేక్షణ చేపడుతున్నట్లు గవర్నర్లు తమ నివేదికలో తెలిపారు.

కేంద్ర ఉద్యోగులకు 15న సంక్రాంతి సెలవు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ నెల 15 వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. గతంలో ప్రకటించిన సెలవుల జాబితాలో 15 న ఐచ్ఛిక సెలవుగా ప్రకటించారు. ఐచ్ఛిక సెలవు దినాన్ని పూర్తి సెలవు దినంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కకమిటీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇంతకు ముందు సెలవు దినంగా ప్రకటించిన సెప్టెంబర్ 3 వ తేదీన కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు యధావిధిగా పని చేస్తాయని పేర్కొన్నారు.

'సర్వే' తేల్చిందిలా..

• పెట్టుబడి మద్దతు పథకంపై రైతుల అభిప్రాయాల సేకరణ • చెక్కులే బెస్ట్ అన్న 31.59 శాతం మంది రైతులు

• బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్న 27.55శాతం రైతులు

• నగదు రూపంలో ఇవ్వాలని 26.59 శాతం మంది విన్నపం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఖరీఫ్ నుంచి పెట్టుబడి మద్దతు పథకం ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ యంత్రాంగం క్షేత్రస్థాయిలో తాజాగా ఒక రోజు సర్వే నిర్వహించింది. ప్రభుత్వ సహకారాన్ని ఏ రూపంలో అందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అంశంపై వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో), మండల, జిల్లా వ్యవసాయాధికారుల ద్వారా అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వే వివరాలను రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి సి.పార్థసారధి బుధవారం వెల్లడించారు. ఈ సర్వే 30 జిల్లాలకు చెందిన 551 మండలాల్లోని 624 గ్రామాల్లో జరిగిందని తెలిపారు. సర్వేలో వివిధ గ్రామాలకు చెందిన 62,677 మంది రైతులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

ఈ ఖరీఫ్ నుంచి సాగుకు అందించనున్న పెట్టుబడి సహకారాన్ని ఏ రూపంలో ఇస్తే బాగుంటుందని రైతులను అడగగా వారు సూచించిన ప్రాధాన్యతల క్రమం ఈ విధంగా ఉంది.

➥ చెక్కు రూపేణా సాగు పెట్టుబడి సహకారాన్ని అందిస్తే బాగుంటుందని సరాసరిగా 31.59 శాతం మంది రైతులు అభిప్రాయపడ్డారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే సర్వేలో పాల్గొన్న రైతులలో మేడ్చల్ 63.8 శాతం మంది, నిజామాబాద్ 57.1 శాతం మంది, ఆదిలాబాద్ 50 శాతం మంది, 40 శాతం మంది ఈ పద్ధతిని కోరారు.

➥ కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సంగారెడ్డి, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ కొంతమంది రైతులు మొగ్గు చూపారు

➥ తమకున్న బ్యాంకు ఖాతాల్లోనే సాగుకు పెట్టుబడిగా అందిస్తున్న మొత్తాన్ని జమచేస్తే బాగుంటుందని సరాసరిగా 27.55 శాతం మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

➥ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్న రైతుల వివరాలను జిల్లాల వారీగా పరిశీలిస్తే వరంగల్ అర్బన్ 81.55 శాతం మంది, రాజన్న సిరిసిల్ల 62.28 శాతం మంది, వరంగల్ రూరల్ 49 శాతం మంది, జనగాం 44.94 శాతం మంది ఉన్నారు.

➥ 30 శాతానికిపైగా ఈ విధానాన్ని కోరిన జిల్లాల్లో నిర్మల్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, నాగర్‌కర్నూలు, మెదక్, నల్గొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి.

➥ నగదు రూపంలో సాగుకు పెట్టుబడి సహకారాన్ని అందిస్తే బాగుంటుందని సరాసరిగా 26.59 శాతం మంది రైతులు.

➥ ఈ విధానాన్ని బలపరిచిన రైతుల వివరాలు జిల్లాల వారీగా చూస్తే ఆసిఫాబాద్ 62.17 శాతం మంది, వికారాబాద్ 48 శాతం మంది, జోగులాంబ గద్వాల 46.08 శాతం మంది, రంగారెడ్డి 42 శాతం మంది ఉన్నారు.

➥ 30 శాతానికిపైగా నగదు రూపంలో కోరిన జిల్లాల్లో మహబూబ్‌నగర్, వనపర్తి, నల్గొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతులు ఉన్నారు.

➥ పోస్టాఫీసుల ద్వారా సాగు పెట్టుబడి సహకారాన్ని అందిస్తే బాగుంటుందని సరాసరిగా 6.81శాతం మంది.

➥ సాగుపెట్టుబడి సహకారాన్ని ప్రీ లోడెడ్ కార్డు లేదా సహకార విలువకు సమానమైన కార్డుల రూపంలో చెల్లిస్తే బాగుంటుందని సరాసరిగా 6.44 శాతం మంది రైతులు అభిప్రాయపడ్డారు.

➥ చివరగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా సాగుకు పెట్టుడి సహకారాన్ని అందిస్తే బాగుంటుందని సరాసరిగా 1.03 శాతం మంది రైతులు అభిప్రాయపడ్డారు.

➥ ఆరు పద్ధతుల్లో దాదాపు 60 శాతం రైతులు సాగుకు పెట్టుబడి సహకారాన్ని చెక్కు రూపంలోగానీ, తమ బ్యాంకు ఖాతాల్లో జయ చేయడానికిగానీ మొగ్గు చూపారు.

పంట పెట్టుబడికి 4 మార్గాలు



(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు సమాలోచనలు జరిపారు. గ్రామ సభల నిర్వహణకు సంబంధించి ముఖ్యమంత్రి ద్వారా ఆదేశాలు జారీ చేయించాలని అభిప్రాయపడ్డారు. ఉపసంఘంలో సభ్యులుగా ఉన్న ఆరుగురు మంత్రులు కూడా గ్రామసభల్లో విధిగా పాల్గొనాలని, కొన్ని చోట్ల వ్యవసాయం, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఈ పథకం అమలుకు దోహదపడే ప్రధానమైన నాలుగు అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం లోతుగా చర్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు) ద్వారా ఆధార్‌కార్డుల అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ విధానంలో నగదు పంపిణీకి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు గత ఏడాది కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు అడ్డొస్తున్నందున ఢిల్లీ పెద్దలతో చర్చించి ప్రత్యేక వెసులుబాటుతో అనుమతి తీసుకోవాలని తీర్మానం చేశారు. అలాగే ఆన్‌లైన్ విధానం ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేయడం ద్వారా కూడా అవకతవకలు లేకుండా పథకాన్ని అమలు చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ రైతు సమన్వయ సమితిల ద్వారా అబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినా లక్ష్యం చేరుకోవచ్చునని సబ్‌కమిటీ యోచించింది. ఈ మూడు పద్ధతుల్లో చిక్కులు ఎదురైతే ప్రత్యామ్నాయంగా ఏ ఏటీఎం సెంటర్లోనైనా విత్‌డ్రా చేసుకునే వీలు కల్పిస్తూ కిసాన్ గిఫ్టుకార్డులు పంపిణీ చేయాలని కూడా మంత్రులు నిర్ణయించారు.

చిక్కుల్లేని విధానం కోసమే అధ్యయనం

ఈ పరిస్థితుల్లో గిఫ్ట్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తే సమస్యలు ఉండవన్న విషయాన్ని గుర్తించారు. అన్నదాతలు తమ అవసరాలకు తగ్గట్లుగా సంబంధిత మొత్తాన్ని ఏ ఏటీఎం సెంటర్ నుంచైనా విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచే ప్రభుత్వం ప్రారంభించనున్న పెట్టుబడి రాయితీ పథకం అమల్లో ఎదురవుతున్న చిక్కులను అధిగమించేందుకు ఉన్నతాధికారులు సరికొత్త ఆలోచనతో ప్రత్యామ్నాయ మార్గాన్ని కనుగొన్నారు. గత కొన్ని నెలలుగా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఏటా రెండు పంటలు కలుపుకుని ఎకరాకు రూ.8వేల చొప్పున ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి మొత్తాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు మార్గాలు అన్వేషించారు.

క్షేత్రస్థాయిలో ప్రతికూలమే...

కష్ట నష్టాల్లో ఉన్న అన్నదాతలకు ప్రభుత్వం తరపున అందించే పెట్టుబడి మద్ధతు పథకంలో కిసాన్ గిఫ్ట్ కార్డుల ద్వారా రాయితీ మొత్తాన్ని బట్వాడా చేయాలన్న కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. బ్యాంకు ఖాతాల్లో జమచేయడం, చెక్కులు, డీడీల ద్వారా లబ్ధి చేకూర్చడం, గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా ఆ మొత్తాన్ని పంచడం లాంటి అనేక అంశాలు పరిశీలనలో ఉన్నప్పటికీ, అవేవీ సాధ్యపడే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం రుణ విముక్తి పథకాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, గ్రామీణ, వాణిజ్య, జాతీయ, సహకార బ్యాంకుల్లో దాదాపు ప్రతి రైతు కుటుంబానికి ఎంతోకొంత అప్పు మిగిలి ఉంది. ఆ ఖాతాల్లో పెట్టుబడి రాయితీ మొత్తాలను జమచేస్తే అన్నదాతల అవసరాలు తీర్చే అవకాశాలు లేవు.

పొంచివున్న మోసాలపైనా దృష్టి

ప్రత్యామ్నాయంగా ఆలోచించిన కిసాన్ గిఫ్ట్‌కార్డుల ద్వారా కూడా కొందరు మధ్యవర్తులు అమాయక రైతులను మోసగించే ప్రమాదం పొంచి ఉన్నందున, సాంకేతిక పరిజ్ఞానంతో తగిన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలన్న అంశంపై దృష్టికేంద్రీకరించారు. సీక్రెట్ కోడ్ లేదా ఇంకేదైనా కొత్త విధానం ద్వారా సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుందేమోనన్న కోణంలో సమాలోచనలు జరుపుతున్నారు. ఇదే అంశంపై లోతైన అధ్యయనం తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నియమించిన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ ప్రతిపాదనను సమర్పించనున్నారు. ఈ కసరత్తును ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో తుదినిర్ణయం తీసుకోనున్నారు. మార్చిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ పథకానికి నిధులు కేటాయిస్తారు. ఏప్రిల్ మొదటివారం నుంచి లబ్ధిదారులకు నిధులను బట్వాడా చేస్తారు. మే నెల 15 నాటికి అర్హులందరికీ పెట్టుబడి మద్ధతు మొత్తాన్ని అందేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. జూన్ మొదటివారం నుంచి ఖరీఫ్ పనులు ప్రారంభమవుతాయి.

చేతులెత్తేసిన బ్యాంకర్ల కమిటీ

పెట్టుబడి మద్దతు పథకంలో రైతు ఖాతాల్లోకి నగదును బదిలీ చేస్తే అప్పు కింద జమకావడాన్ని తాము ఆపలేమని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కుండబద్దలు కొట్టింది. ఆ అంశం పూర్తిగా ఆర్బీఐ పరిధిలోనిదని మంత్రివర్గ ఉపసంఘం ముందు స్పష్టం చేసింది. బకాయి పడిన బ్యాంకు ఖాతాల్లో ఎలాంటి నిధులను జమ చేసినా ఆ మొత్తం ఆటోమేటిక్‌గా బకాయిలో జమ చేయబడుతుందని అధికారులు వివరించారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకే విధమైన సాఫ్ట్‌వేర్ ఉన్నందున మార్చడం తమ పరిధిలో లేని అంశమని చెప్పారు. ఒకవేళ బ్యాంకింగ్ లావాదేవీల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు తెస్తే బకాయి పడిన రైతుల ఖాతాల్లోనే కాకుండా ఇతర ఖాతాదారులకు కూడా అదే విధానం వర్తిస్తుందని, తద్వారా అనేక సమస్యలు తలెత్తుతాయని వారు తెలిపారు.

నవ్వులపాలు కావొద్దు : సీఎం ఆదేశాలు

రాష్ట్ర ప్రతిష్ఠను పెంచేవిధంగా రూపకల్పన చేసిన "పెట్టుబడి మద్దతు పథకం" అమలులో తొందరపాటు నిర్ణయాలు తీసుకుని నవ్వులపాలు కావొద్దని సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘానికి సూచించారు. లోతుగా అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలన్నారు. సాంకేతికపరమైన అంశాలు, అవకతవకలకు దారితీసే అంశాలపై కూలంకశంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఢిల్లీకి 'పెట్టుబడి' చిక్కుముడి

• నిబంధనల సడలింపునకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు
• కరెన్సీ సర్దుబాటు కోసం ఆర్థిక మంత్రి, ఆర్బీఐ గవర్నర్‌తో భేటీ
• త్వరలో ఢిల్లీ వెళ్లాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం
• ఆ తర్వాతే సీఎంకు నివేదిక: పోచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 'పెట్టుబడి మద్దతు పథకం' అమల్లో తలెత్తిన చిక్కుముడి రాష్ట్రం పరిధి దాటిపోయింది. ప్రతిపాదిత మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించేందుకు ఆర్థిక నిబంధనలు అడ్డొస్తున్నందున కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అదే సమయంలో సుమారు రూ.5వేల కోట్లకు పైగా ఏకకాలంలో కరెన్సీ అవసరమవుతోంది. ఇందుకు సంబంధించి కూడా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్బీఐ గవర్నర్ ఉజ్జిత్ పటేల్‌లను కలిసి నిధుల సర్దుబాటును కోరనున్నారు. ఈ పథకం లక్ష్యాలు, ఫలితాలపై నివేదిక సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఉపసంఘం సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మీడి యాతో మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో అమలు చేయనున్న ఈ పెట్టుబడి మద్ధతు పథకంపై త్వరలోనే చిక్కుముడు లు తొలగిపోతాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 71.75 లక్షల రైతు ఖాతాలకు సంబంధించిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి రూ.4వేల చొప్పున చెల్లిస్తామన్నారు. మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారుల ద్వారా గ్రామాలలో సభలు, సమావేశాలు నిర్వహించి రైతుల సూచనలను, అభిప్రాయాలను తెలుసుకుంటున్నా మన్నారు. సాగుకు యోగ్యంకాని భూములను ఈ పథకం నుంచి తొలగించాలని కమిటీ సభ్యులు సూచించినట్లు వెల్లడించారు. ఎకరాలపై పరిమితి లేదన్నారు. 97.2 శాతం మంది రైతులు 10 ఎకరాలలోపే ఉన్నారని చెప్పారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా సహకరించాలని బ్యాంకులను కోరినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటు న్నామన్నారు. త్వరలోనే రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ నేతృత్వంలో ఢిల్లీ వెళ్ళి కేంద్ర ఆర్థికశాఖ మంత్రిని, ఆర్‌బిఐ అధికారులను కలిసి సమస్యను పరిష్కరించుకుంటామని మంత్రి పోచారం వివరిం చారు. అనంతరం తుది నివేదికను రాష్ట్ర ముఖ్యమం త్రికి సమర్పిస్తామన్నారు. ఈ సమావేశం లో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో పాటు ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మణికందన్, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా సిటీకి రూ. 1500 కోట్లివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రకటించిందని, ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరామని అన్నారు. హైదరాబాద్, వరంగల్, హైదరాబాద్, రామగుండం, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రీయల్ కారిడార్లకు కావాల్సిన నిధులను కేటాయించాలని సురేష్ ప్రభుకు విజ్ఞప్తి చేశామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర విభజనలో మెగా లెదర్ పార్క్ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారని, తెలంగాణ రాష్ట్రానికి మెగా లెదర్ పార్క్ కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరామని వెల్లడించారు. దేశానికే ఆదర్శవంతంగా అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్‌లో జరిగే దావోస్ సదస్సుతో పాటు ఫిబ్రవరి 22, 23వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా హాజరు కావాలని తెలంగాణా ప్రభుత్వం తరపున సురేష్ ప్రభుని ఆహ్వానించామని, తప్పకుండా సదస్సుల్లో పాల్గొంటానని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని చెప్పారు. అంతకు ముందు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పిఐఓ పార్లమెంటేరియన్ (భారత సంతతి పౌరులు) సమావేశంలోనూ



కేటీఆర్ పాల్గొన్నారు. సమావేశంలో ఆయన పలు విలువైన సలహాలు, సూచనలు చేశారు. దేశంలోనే పాస్ పోర్టుల వెరిఫికేషన్, ఇమ్మిగ్రేషన్ విషయాల్లో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని సుష్మా స్వరాజ్ ప్రశంసించారని మంత్రి పాత్రికేయులకు వివరించారు. పశ్చిమాసియా దేశాలలో చాలామంది తెలుగువారు ఉన్నారని, అక్కడి రాయబార కార్యాలయాల్లో నలుగురి చొప్పున తెలుగు ట్రాన్స్‌లేటర్లను నియమిస్తే బాగుంటుందని సమావేశంలో సూచించామని అన్నారు. యెమెన్, లిబియా వంటి దేశాల్లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి తీసుకువచ్చినా, ఆ దేశాల్లో దక్కే వేతనాలను చూసి మళ్లీ బాధితులు పర్యాటక, ఆరోగ్య వీసాలపై అక్కడికి వెళ్తున్నారని మంత్రి తెలిపారు. ఇకపై సరైన వీసా లేకుండా అవే దేశాలకు పలుమార్లు వెళ్లే వారి పాస్ పోర్టును ఐదేళ్లు రద్దు చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని సమర్థిస్తున్నట్లుగా కేటీఆర్ స్పష్టం చేశారు. నకిలీ ఏజెంట్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోందని, ఇప్పటికే చాలా నకిలీ ఏజెంట్ల దుకాణాలు మూసి వేయడమే కాకుండా వారిపై విదేశాంగ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. తెలుగు వారికి ఉపయోగపడేలా హైదరాబాద్‌లో విదేశీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని అన్నారు.

కేటీఆర్ చొరవతో బాలుడి బడిబాట

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉన్న పరిశ్రమలశాఖ మంత్రి కె తారకరామారావు చేసిన సహాయం 15 ఏళ్ళ బాలుడికి జీవితాన్నే మార్చేసింది. పాఠశాలకు పంపేందుకు ఆర్థిక స్థోమత లేని అజీజ్ అనే వ్యక్తి తన కుమారుడు సామితో కలిసి టి, సిగరెట్ స్టాల్‌ను బంజారాహిల్స్‌లో నిర్వహిస్తున్నాడు. 15 ఏళ్ళ షమీ చలిలో వణుకుతూ టీ అమ్ముతున్న పరిస్థితిని చూసిన రియాజుద్దీన్ అనే వ్యక్తి ఈ విషయాన్ని ట్విట్టర్‌లో కేటీఆర్‌కు పోస్టు చేశాడు. ఈ ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్ ఆ బాలుడికి సహాయం అందిస్తానని ట్వీట్ చేసిన వ్యక్తికి తెలిపారు. బాలుడు బడికి పోయేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని తన కార్యాలయ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. ఆసిఫ్‌నగర్‌లోని స్టేట్ మైనారిటీ స్కూల్‌లో చిన్నారికి ప్రవేశం ఇప్పించాడు. ఈనెల మొదటివారం నుంచి షమీ బడికి వెళుతున్నాడు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని సాయంచేసిన మంత్రి కేటీఆర్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి

• సాంస్కృతిక శాఖా కార్యదర్శి బుర్రా వెంకటేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సికింద్రాబాద్‌లోని పేరెడ్ మైదానంలో జనవరి 13 నుంచి 15 వరకు జరిగే 3వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ మరియు మొదటి అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లను తెలంగాణ టూరిజం, సాంస్కృతిక శాఖా కార్యదర్శి బుర్రా వెంకటేశం పర్యవేక్షించారు. నిర్వహణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రపంచ తెలుగు మహాసభల విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న కైట్ ఫెస్టివల్‌లో 10 దేశాల నుంచి 40 మంది ఇంటర్నేషనల్ కైట్ ప్లేయర్స్ పాల్గొంటున్నారని అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో 14 దేశాలతో పాటు 25 రాష్ట్రాల నుంచి 1000 రకాల స్వీట్ల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 13 నుంచి జరుగుతున్న ఫెస్టివల్‌కు జంటనగరాల ప్రజలతో పాటు వివిధ దేశాల, రాష్ట్రాల నుంచి రోజుకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరు కానున్నారని వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ ఫెస్టివల్‌కు అందరూ ఆహ్వానితులేనని, ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ టూరిజం కమిషనర్ సునీ త మహేశ్ భగవత్, సాం స్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14నే సంక్రాంతి పండగ స్వామి శాంతానంద పురోహిత్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగ ఎప్పుడు జరుపుకోవాలన్న సందిగ్ధతతకు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట శక్తి పీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్ పత్రికలకు జారీ చేసిన ఒక ప్రకటనలో స్పష్టత ఇచ్చారు. సూర్యుడు ఏ రోజు మకర రాశిలో ప్రవేశిస్తాడో ఆ రోజును మకర సంక్రాంతిగా జరుపుకుంటామని, సూర్యుడు ఈ నెల 14 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గం. 1.46 నిమిషాలకు మకర రాశిలోకి ప్రవేశిస్తున్నాడు కాబట్టి అ రోజు మకర సంక్రాంతిని ఆచరిం చాలని స్పష్టం చేశారు. పండగ ఎప్పుడు జరుపుకోవాలనే విషయంలో అపోహలొద్దని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ 14 వ తేదీన జరుపుకోవాలా? 15 వ తేదీ న జరుపుకోవాలా ? అన్న సందేహం వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. సామాజిక మాధ్యమాలలోనూ ఈ అంశం చర్చనీయాంశం కావడంతో స్వామీజీ స్పష్టతను ఇచ్చారు. 13 వతేదీ శనివారం భోగి, 14 వ తేదీ ఆదివారం మకర సంక్రాంతి, 15 వ తేదీ సోమవారం కనుమ (కరి) పండుగను జరుపుకోవాలని స్వామీజీ పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 11 జనవరి 2018

డిజిటల్ పాలనకే మొగ్గు!

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి రాగానే మూడు కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రకటించారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటలైజేషన్, డీమానిటైజేషన్‌లను పట్టుపట్టి మరీ అమలు చేశారు. మేక్ ఇన్ ఇండియాను విజయవంతంచేయడానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐల) పరిమితిని 49 శాతానికి పెంచారు. రక్షణోత్పత్తి రంగంలో పరాధీనతను తగ్గించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని కూడా ప్రకటించారు. విదేశీ పరిజ్ఞానంతో రక్షణ రంగానికి అవసరమైన యంత్రాలు, విడిభాగాలను దేశంలోనే ఉత్పత్తి చేసుకోవడం ద్వారా, తయారీరంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలన్నది ఆయన అభిమతం. విదేశాల నుంచి ఆశించిన స్థాయిలో ఎఫ్‌డిఐలు రాకపోవడంతో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. డిజిటలైజేన్ మాత్రం అనుకున్న ప్రకారమే ప్రోత్సాహకరంగా పరుగులు తీస్తోంది. 2017 మూడో త్రైమాసికంలో పార్లమెంటు జిఎస్టీని అమలులోకి తెచ్చింది. బీహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహాకూటమి నుంచి వైదొలగి ఎన్‌డిఏలో చేరడంతో బీజేపీ ప్రాబల్యం పెరిగింది. ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌ని తన ఖాతాలో వేసుకుంది. గుజరాత్‌లో మెజారిటీ తగ్గినా అధికారాన్ని నిలబెట్టుకుంది. ప్రధానమంత్రి మోడీ ప్రాధాన్యం ఇస్తున్న ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అమలు జేయడానికి, సుపరిపాలనను అందించడానికీ ఈ పరిణామాలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. అమెరికాలో మాదిరిగా భారత్‌లోని రాష్ట్రాలు ప్రజాస్వామ్యానికి ప్రయోగశాలలుగా ఉపయోగపడవచ్చు. వాటి ప్రయోగాలు రోజురోజుకీ మరింత రాటు తేలుతున్నాయి. దేశంలోని రాష్ట్రాల్లో అభివృద్ధి గురించిన తాజా వివరాలను ప్రతి వారం వాధ్వానీ నేతృత్వంలోని కమిటీ సేకరిస్తోంది.

2017 మూడో త్రైమాసికంలో ఈ కమిటీ సేకరించిన వివరాల ప్రకారం వివిధ రాష్ట్రాలు డిజిటల్ పాలనపై దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమనీ, ఇందుకు రాజకీయ మద్దతు అవసరమనీ నిర్ధారణకు వచ్చాయి.

విద్యుత్ రంగంలో రాష్ట్రాలు, ప్రైవేటు రంగం పరిధిలోని డిస్కంలు స్మార్ట్ మీటర్ల వినియోగం ద్వారా ఇంధన వాడకంలో పొదుపును పాటించగలిగాయి.

ఢిల్లీలో టాటా పవర్ విద్యుత్ పంపిణీ విభాగం వచ్చే మార్చి నుంచి 2,50,000 స్మార్ట్ మీటర్లను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ స్మార్ట్ మీటర్లను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయవచ్చు. కేంద్ర విద్యుత్ వ్యవస్థనూ, స్మార్ట్ మీటర్లను అనుసంధానం చేయడానికి దీని ద్వారా వీలుంది. ఏ విధంగా ఎప్పుడు విద్యును వినియోగదారులు వినియోగించుకోవాలో తెలియజేయ డానికి దీని ద్వారా వీలుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో పది లక్షల సంప్రదాయ బల్బుల స్థానే ఎల్ఈడీ బల్బులను వినియోగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇంధనం పొదుపునకు, మరిన్ని మెరుగైన



విద్యుత్ సౌకర్యాలను అమలు జేయడానికి ఎల్ఈడీ బల్బులు ఉపయోగపడుతున్నాయి. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. ఈ కార్యక్రమం కింద పదిలక్షల వీధి లైట్లకు సంప్రదాయ బల్బుల స్థానే ఎల్ఈడీ బల్బులను అమర్చారు. ఏటా 25 మిలియన్ డాలర్ల సొమ్మును ఆదా చేశారు. ఈ విధానాన్ని ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌ను ఎప్పుడు ఎలా వినియోగించుకోవచ్చునో వినియోగదారులకు తెలియజేసే వీలుంది. ఒడిషా కూడా ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ప్రకటించింది. ముందుగా వీధిలైట్లకు ఈ బల్బులను అమర్చి క్రమంగా ఇళ్ళకు కూడా పంపిణీ చేసేందుకు పెద్ద ప్రణాళికను రూపొందించింది.

ఆంధ్రప్రదేశ్‌లో రెండు డిస్కమ్‌లు భారత్ క్యూఆర్‌ల ద్వారా చెల్లింపులను డిజిటల్ చెల్లింపులను అనుమతిస్తున్నాయి. పాలనా సామర్థ్యాన్నీ, నైపుణ్యాన్నీ పెంచేందుకు దేశంలోని రాష్ట్రాలు డిజిటల్ పరికరాలను వినియోగిస్తున్నాయి. ఇతర రంగాల్లో కూడా డిజిటల్ సర్వీసుల వినియోగానికి అనుమతిస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెల్లింపులన్నీ డిజిటల్ ప్రాతిపదికపైనే జరుగుతున్నాయి. కూలీల వేతనాలన్నీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ విధానంలో పారదర్శకత ఎంతో ఉంది. అవకతవకలకూ, అక్రమాలకూ అవకాశాలు తక్కువ.

మహారాష్ట్రలో మహా డిబిటి పోర్టల్‌ని ప్రారంభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఈ పోర్టల్ ద్వారా సబ్సిడీ మొత్తాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రొక్యూర్‌మెంట్ల కోసం కేంద్ర ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ విధానాన్ని వినియోగించుకుంటున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రకటించాయి.

కర్నాటక ప్రభుత్వం రైతులకు తోడ్పాటునిచ్చేందుకు మైక్రో సాఫ్ట్ సంస్థతో సంప్రదిస్తోంది. ఏయే పంటలు వేస్తే రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయో తెలుసుకునేందుకు మైక్రోసాఫ్ట్ సహకారంతో సమాచారాన్ని కర్నాటక వ్యవసాయ శాఖ సేకరిస్తోంది.

పంజాబ్ ప్రభుత్వం నిర్మాణ రంగంలో కార్మికులకు వేతనాలు, ఇతర సదుపాయాలను నమోదు చేయడానికి ఒక పోర్టల్‌ని నిర్వహిస్తోంది. ఆరోగ్య సంరక్షణ, విద్య,శిక్షణ రంగాల్లో సేవల విస్తృతికి, మెరుగుదలకు డిజిటల్ పరికరాలనూ, వ్యవస్థలనూ పలు రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయి.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో శిశు సంరక్షణలో క్లౌడ్ ఆధారిత విశ్లేషణకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం కింద శిశువుల ఆరోగ్య రక్షణకు సంబంధించిన సమాచారాన్ని మైక్రోసాఫ్ట్ సహకారంతో సేకరిస్తారు. నేత్ర వ్యాధుల గురించిన సమాచారాన్ని సేకరించేందుకు మైక్రోసాఫ్ట్ సహకారం తీసుకుంటున్నారు. తెలంగాణలో ముఖ్యంగా, హైదరాబాద్‌లో డిజిటల్ ఆరోగ్య రికార్డులను నిర్వస్తున్నారు. మహిళా శిశు రక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏవిధంగా వారికి లబ్ధి చేకూరుస్తున్నాయో సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థ ద్వారా సేకరించి ప్రభుత్వం భద్రపరుస్తోంది.

కర్నాటక టాటా ట్రస్టు సహకారంతో ఆరోగ్య సేవల హబ్‌ని ప్రారంభిస్తోంది. లబ్ధిదారులకు మెరుగైన సేవలందించడానికి ఈ రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాల వినియోగాన్ని 50 శాతం పెంచేందుకు డిజిటల్ పద్ధతిని వినియోగించుకోవాలని కర్నాటక ప్రభుత్వం యత్నిస్తోంది. ఆధార్ కార్డుల ఆధారంగా 140 లక్షల ఇళ్ళకు ఆరోగ్య సేవలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

ఉత్తరప్రదేశ్ టెలిమెడిసిన్ విధానాన్ని ప్రవేశపెడుతోంది.ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందించేందుకు ఇదే మెరుగైన విధానమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రోగులకు వైద్యుల సలహాలు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉండేట్టు చూడటానికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తోంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరిశ్రమలకు అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని డిజిటల్ పద్ధతి ద్వారా అమలు జేస్తోంది. ఇందుకోసం ఒక పోర్టల్‌ని ప్రారంభించాలని నిర్ణయించింది.

గుజరాత్ ప్రభుత్వం వివిధ శాఖల్ల డిజిటల్ విధానం అమలు కోసం గూగుల్ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హర్యానా ముఖ్యమంత్రి విద్య, ఉపాధి శిక్షణ రంగాల్లో మెరుగైన సేవలను అందించడానికి ఢిల్లీలోని డెల్ ఫౌండేషన్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

చత్తీస్‌గఢ్ ప్రభుత్వం మహిళలకు స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేస్తోంది. వివిధ సేవలకు స్మార్ట్ ఫోన్‌ని వినియోగించడంలో మహిళలకు మెలకువలను నేర్పుతోంది. మొత్తం మీద దేశంలోని చాలా రాష్ట్రాలు మెరుగైన,పారదర్శకమైనపాలన కోసం డిజిటల్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యంగా, చిన్న రాష్ట్రాల్లో సుపరిపాలనకు మార్గాన్ని సుగమం చేయడానికి డిజిటల్ వ్యవస్థ ఎంతో ఉపయోగ పడుతోంది.

● ఎ.పి. స్వామి

ఎన్నారైలతో దూరం తగ్గుతోంది!

ఉపాధి కోసం, ఉన్నత విద్యా, ఉద్యోగావకాశాల కోసం ఏ దేశానికి వెళ్ళినా, స్వదేశాన్ని మరిచిపోవద్దని ప్రవాస భారతీయులకు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రధానమంత్రి, రాష్ట్రపతి హితబోధ చేయడం సర్వసాధారణమే. ఇంటర్నెట్ పుణ్యమా అని ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతోందో క్షణాల్లో తెలుసుకుంటున్న భారతీయులు లండన్‌లో పేలుళ్ళు సంభవించినా, అమెరికాలో హత్యలు జరిగినా తమ రక్త సంబంధీకులు ఎలా ఉన్నారోనని కలత చెందడమూ సర్వసాధారణమే. సమాచార విస్తృతి పెరగడం వల్ల ప్రవాస భారతీయులు స్వదేశంలో ఏం జరిగినా గతంలో మాదిరి కాకుండా వెంటనే స్పందిస్తున్నారు. మానసికంగా దూరం తగ్గుతోంది. విదేశాల్లో స్థిరపడి, అక్కడి పౌరసత్వాలను పొందిన భారతీయుల్లో ఎక్కువ మంది గతంలో వైద్యులు, ఇంజనీర్లు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు చట్టసభల్లో ప్రాతినిధ్యం సంపాదించే స్థాయికి ఎదుగుతున్నారు. అమెరికా పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా తన పాలనా యంత్రాంగంలో భారత సంతతికి చెందిన వారి సేవలను బాగా ఉపయోగించుకున్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా అదే రీతిలో భారత సంతతికి చెందిన వారిని ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న నిక్కీ హేలీ భారత సంతతికి చెందిన మహిళ. ప్రవాస భారతీయులు ప్రతి సంవత్సరారంభంలో ఢిల్లీలో కలుసుకుని ఉమ్మడి సమస్యలను చర్చించుకోవడం, భారత ప్రభుత్వం నుంచి పొందాల్సిన సహాయాల గురించి జాబితా తయారు చేసి కేంద్రానికి అందజేయడం ఆనవాయితీగా మారింది. భారతీయ ప్రవాసీ సదస్సు పేరిట మూడు రోజుల పాటు నిర్వహించే సమావేశాల్లో ఈసారి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేసిన ప్రసంగం ఆలోచనలను రేకెత్తిస్తోంది. ప్రవాస భారతీయులు కేవలం పరస్పరం పొగుడుకోవడానికి, తమ ఉన్నతి గురించి సాటివారికి తెలియజేయడానికి మాత్రమే విలువైన సమయాన్ని వెచ్చించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదనీ, స్వదేశానికి తాము సైతం ఎంతో కొంత సాయం చేయగలమా అని ఆలోచించాలని ఆయన సలహా ఇచ్చారు. ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి నరేంద్రమోడీ ఏటా ఇలాంటి సలహాలు ఇవ్వడమే కాకుండా, స్వరాష్ట్రమైన గుజరాత్‌లో పరిశ్రమల స్థాపనకు ప్రవాస భారతీయులను ఆహ్వానిస్తూనే ఉన్నారు. ఆయన పిలుపు వృథా కాలేదు. చాలా మంది ఎన్ఆర్ఐలు ఉజ్వల గుజరాత్ సభలకు హాజరై ఇప్పటికే భారీగాపెట్టుబడులు పెట్టారు. ప్రవాస భారతీయుల పెట్టుబడులను ఆశిస్తున్న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా వారికి కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం అత్యవసరం. భూములు, విద్యుత్, నీరు పుష్కలంగా లభించేట్టు చూడాలి. పరిశ్రమలు నిలదొక్కుకోవడానికి కొంతకాలం పాటు రాయితీలు ఇవ్వాలి. వీటికి సన్నద్ధం అయిన తర్వాతనే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐల) కోసం, ప్రవాస భారతీయుల నిధుల కోసం ఆశించడం అర్థవంతం అవుతుంది. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, ప్రవాస భారతీయులకు తగిన వనరులు, వసతులు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. యూపీఏ హయాంలో ప్రవాస భారతీయుల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేశారు. అంతకుముందు వాజ్‌పేయి హయాంలోని ఎన్‌డియే-1 ప్రభుత్వంలో పెట్టుబడుల ఉపసంహరణ శాఖ ఉండేది. దానిని యూపీఏ హయాంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రవాస భారతీయుల శాఖగా మార్చారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలను చేపట్టిన పరిస్థితుల్లో వచ్చిన మార్పును చూస్తూనే ఉన్నాం. హెచ్-1బీ వీసాల విషయంలో ఆయన ఎన్ని పిల్లి మొగ్గలు వేశారో కళ్ళారా చూశాం. అమెరికాలో కానీ, గల్ఫ్ దేశాల్లో కానీ, భారతీయుల సేవలు, మేథో సంపత్తి లేనిదే పనులు జరగవన్న వాస్తవాన్ని ట్రంప్ ఆలస్యంగా తెలుసుకున్నారు. హిల్లరీ క్లింటన్ అమెరికా అధ్యక్షురాలు అయి ఉంటే ప్రవాస భారతీయుల పరిస్థితి మెరుగ్గా ఉండేది. 23 పైగా దేశాల్లో చట్టసభల్లో సభ్యులుగా రాణిస్తున్న 123 మంది ప్రవాస భారతీయులు ఢిల్లీలో జరిగిన భారతీయ ప్రవాసీ దివస్‌కి హాజరు కావడం చెప్పుకోదగిన విషయం. ప్రవాస భారతీయులంటే మనకు ముందుగా గుర్తొచ్చేది అమెరికా, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన వారే. కానీ, గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన భారతీయుల శ్రేయస్సు గురించి, సమస్యల గురించి తెలుసుకుని పరిష్కరించడం ఎంతైనా అవసరం. ముఖ్యంగా, మోసపూరిత ఏజెంట్ల వలలో చిక్కుకున్న ఉద్యోగార్థుల సమస్యలను పరిష్కరించడం ఎంతైనా అవసరం. యూపీఏ హయాంలో ప్రవాస భారతీయుల శాఖ మంత్రిగా వాయలార్ రవి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులకు న్యాయం చేకూర్చే విషయమై కృషి చేశారు. ఇప్పుడు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న మాట నిజమే అయినా, ప్రత్యేక శాఖను కొనసాగిస్తే ప్రవాస భారతీయుల సమస్యలు తక్షణం పరిష్కారం అవుతాయి.

నివాళి

నిజాయితీకి నిలువుటద్దం


తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సుదీర్ఘ కాలం ఆ పదవిలో కొనసాగడం వల్ల ఆయన తర్వాత ఎవరు అని ఆరోజుల్లో పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు వచ్చేవి. అంత సమర్థులు ఎవరూ లేరని కూడా నిర్ధారణకు వచ్చిన పత్రికలు ఆ దిశగా కథనాలను కూడా ప్రచురించేవి. నెహ్రూ మంత్రివర్గంలో రైల్వే శాఖను నిర్వహించి, సమర్థుడిగా పేరు తెచ్చుకున్న లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని పదవిలో కొనసాగింది కొద్ది కాలమే


నేడు వర్ధంతి

అయినా, దేశానికి ఎంతో పేరు తెచ్చారు. 1965లో పాకిస్తాన్‌తో యుద్ధంలో భారత సత్తా తెలియజేసి పొట్టి వాడైనా గట్టి వాడనిపించారు. నైతిక విలువలకూ, ప్రమాణాలకూ లాల్ బహదూర్ పెట్టింది పేరు. శాస్త్రి అనేది ఆయన సామాజిక వర్గాన్ని సూచించే నామం కాదు. కాశీ విద్యాపీఠంలో శాస్త్రి పట్టా పొందడం వల్ల ఆయన శాస్త్రి అయ్యారు. రాజకీయాల్లో తన వారసులను ప్రవేశపెట్టాలని ఏనాడూ ఆయన ఆలోచించలేదు. రైల్వే మంత్రిగాఉన్నప్పుడు రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత స్వీకరించి రాజీనామా చేసి ఉన్నత విలువలకు దర్పణంగా నిలిచారు. పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో జైజవాన్, జైకిసాన్ నినాదాన్ని ఇచ్చి దేశ ప్రలను సంఘటితం చేశారు. దేశ రక్షణ నిధికి విరాళాలు ఇవ్వాలని ఆయన ఇచ్చిన పిలుపునకు మహిళలు స్పందించిన తీరు అపూర్వం. తమ ఒంటి మీద ఉన్న బంగారం ఆభరణాలను తృణప్రాయంగా ఎంచి దేశ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. లాల్ బహదూర్ అంటే మూర్తీభవించిన నిజాయితీ, నైతిక రీతి. ఆనాటి సోవియట్ యూనియన్‌లో భాగమైన తాష్కెంట్‌లో పాక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు వెళ్ళినప్పుడు ఆయన గుండెపోటు వల్ల మరణించారు. ఆయన మరణంపై అనుమానాలు ఈనాటికీ వ్యక్తమవుతూనే ఉన్నాయి. విషప్రయోగం వల్ల ఆయన మరణించారన్న కథనాలు ఇప్పటికీ వెలువడుతున్నాయి. లాల్ బహదూర్ అధికారంలో ఉన్నది స్వల్పకాలమే అయినా దేశ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

చరిత్రలో ఈ రోజు

- 1920: ఫ్రెంచి ప్రయాణికుల నౌక ఆఫ్రిక్ లా రోషెల్ వద్ద మునక, 550 మంది జలసమాధి.
- 1922: మధుమేహ వ్యాధి చికిత్సనిమిత్తం 14ఏళ్ళ లియోనార్డ్‌థాంప్సన్(జపాన్)కు తొలిసారి ఇన్సులిన్ ఇచ్చారు.
- 1942: కౌలాలంపూర్, మలయాలను జపాన్ ఆక్రమించింది.
- 1972: తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించింది. అబూ సయ్యద్ చౌదరి రాష్ట్ర పతిగానూ, ముజిబుర్ రహ్మాన్ ప్రధాన మంత్రిగానూ బాధ్యతలు చేపట్టారు.
- 1988: రసాయనిక ఆయుధాల (విష వాయువు, తదితరాలు)ను 140 దేశాలు నిషేధించాయి.
- 1991: ఇరాక్‌పై యుద్ధానికి ఆదేశించేందుకు అవసరమైన అధికారాన్ని అమెరికన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జి బుష్ కు కట్టబెట్టింది.



రైస్‌బ్రాన్ ఉత్పత్తిలో అగ్రస్థానం

ప్రధాన ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగులు స్థానంలో ఉన్న భారతదేశం వంటనూనెల అంశంలో దిగుమతులపై ఆధారపడింది. ఇప్పటికీ 60 శాతానికి పైబడి వంటనూనెలను దిగుమతి చేసుకోవలసి వస్తోంది. దీని విలువ 60 వేల కోట్ల రూపాయల పైమాటే. ఈ తరుణంలో రైస్ బ్రాన్ (తవుడు నుండి తీసిన నూనె) వంటనూనె ఉత్పత్తి విషయంలో మన దేశానిదే అగ్రస్థానం కావటం కాస్త సంతోషాన్నిచ్చే అంశం. ప్రపంచ రైస్‌బ్రాన్ వంటనూనె ఉత్పత్తిలో 36 శాతం మనదే కావటం గమనార్హం. ఇప్పటికీ మన దేశంలో తవుడు నూనె మిల్లులకు సరిపడా ముడిపదార్థం దొరకటం లేదు. ఈ కారణంగా అవి తమ సామర్థ్యంలో 65 శాతానికి మించి పనిచేయటం లేదు. విదేశాల నుండి తవుడు దిగుమతి చేసుకొనే అవకాశం ఉన్నా 15 శాతం దిగుమతి సుంకం కారణంగా మిల్లులు దిగుమతికి వెనుకంజ వేస్తున్నాయి. వ్యవసాయ వాణిజ్య రంగ నిపుణులు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి 15 శాతం తవుడు దిగుమతి సుంకం రద్దుకు ఒప్పించాయి. ఫలితంగా మలేషియా, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి తవుడు దిగుమతి కి అవకాశం లభించింది.

ధాన్యాన్ని మర ఆడినప్పుడు సుమారుగా 63 నుండి 65 శాతం బియ్యం, 23 నుండి 25 శాతం ఊక, 8 నుండి 10 శాతం తవుడు వస్తాయి. భారతదేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తవుడు దోహదపడింది. పశువుల దాణాలో తవుడుకే అగ్రస్థానం. పాల అధిక దిగుబడికి, పాలలో వెన్న శాతాల పెరుగుదలకు తవుడును పశువులకు ప్రధాన దాణాగా వినియోగిస్తారు. ముప్పైఏళ్ళ క్రితం తెలుగు వాడైన సర్దేశాయి తిరుమల రావు తవుడు నుండి నూనె తీసే ప్రక్రియను కనుగొన్నారు. అనంతపురంలోని తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో ఈ విజయాన్ని సాధించారు.

తవుడు నూనెలో విలువైన పోషకాలున్నాయి. తక్కువ కొలెస్ట్రాల్ గల నూనెగా ఇది పేరు పొందింది. విలువైన ఇ విటమిన్‌కు ఇది ఖజానాగా మారింది. వంటనూనెలలో పేరు పొందిన ఆలివ్ ఆయిల్‌ను సైతం సవాల్ చేసే విశిష్ట అంశాలు ఈ నూనెలో ఉండడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ నూనె వాడకం ఊపు అందుకుంది. వంటనూనెల్లో వందల రకాలు ఉన్నా అందులో పేరుపొందిన మొదటి పరికరాల్లో తవుడు నూనె (రైస్‌బ్రాన్ ఆయిల్) స్థానం సంపాదించింది. ప్రపంచంలో వరి ఎక్కువగా ఉత్పత్తయ్యే చైనాను, ప్రపంచ వరి మార్కెట్‌శాసిస్తున్న థాయ్‌లాండ్‌ను పక్కకు నెట్టి భారతదేశం తవుడు నూనె ఉత్పత్తి - వినియోగం ఎగుమతుల్లో దూసుకుపోతోంది. ఏటా నూనె తీసిన తవుడు ఎగుమతి ద్వారా 500 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో సహాదేశంలో వరి పండించే అన్ని రాష్ట్రాలలోను 400 కి పైగా తవుడు నుండి నూనె తీసే మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం మన దేశంలో 8.2 లక్షల టన్నుల తవుడు నూనె ఉత్పత్తవుతోంది. ముడి తవుడులో 15 నుండి 24 శాతం నూనె ఉంటుంది.

తవుడు నూనె మిల్లులు ఎక్కువగా ఉన్న చైనా, భారత్, థాయ్‌లాండ్, జపాన్, వియత్నాం దేశాలు అనారోగ్యకర పోటీ నివారణ కోసం ఒకసమాఖ్యగా ఏర్పడ్డాయి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రైస్‌బ్రాన్ ఆయిల్ (ఐసి ఆర్‌బిఒ) పేరుతో ఈ సమాఖ్య 2013లో థాయ్‌లాండ్‌లో సమావేశమైంది. గుండెజబ్బుల నివారణ కారణాంశాలతో పాటు తక్కువ కేలరీలు ఇతర నూనెల్లోలేని ఇ విటమిన్ 20 శాతం తక్కువ నూనె వాడినా రుచులలో తేడా లేకపోవడం మొదలైన సుగుణాల తవుడు నూనెలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ కితాబు నిచ్చింది. ఇప్పటికి ప్రపంచ వంట నూనెల రంగంలో 60 శాతం వాటాను పామాయిల్, సోయాచిక్కుడు నూనెలే ఆక్రమించడం కొసమెరుపు.

-పుట్టా సోమన్న చౌదరి, 94403 39682

తెలుగు.. మనకెంత తెలుసు!

ప్రతి మనిషి తన తల్లి గురించి, తన అమ్మనుడి (మాతృభాష) గురించి గొప్పగా చెప్పుకోవాలి. అలా చెప్పుకోవాలంటే అమ్మ మమకారాన్ని చవిచూడాలి. భాష గొప్పదనాన్ని, దాని సౌందర్యాన్ని తెలుసుకోవాలి.

మన అమ్మ నుడి గురించి మనలో చాలామందికి, చాలా విషయాలు తెలియవనే చెప్పాలి. ప్రస్తుతం మనం మాట్లాడుతున్న, రాస్తున్న తెలుగుమాటలు నిజంగా అవి మన తెలుగుమాటలు కావు. నేడు వాడుకలో వున్నమాటలలో 50 శాతం ఇంగ్లీషు పదాలు, 30 శాతం సంస్కృత పదాలు, 10 శాతం ఉర్దూ, హిందీ ఇతర పదాలువున్నాయి. అంటే మనం మాట్లాడే మాటలలో 10 శాతం మాత్రమే తెలుగుపదాలు.

ఉదాహరణకు ఈ నుడువు (వాక్యం) చూడండి.

మమ్మీ ఈ రోజు మా స్కూలులో ఫుట్‌బాల్ మ్యాచ్ ప్రారంభోత్సవం అని ఓ పిల్లాడు, అమ్మతో అన్నాడనుకుందాం.

ఒకసారి పై నుడువులో మాటలు పరిశీలిస్తే -

మమ్మీ, స్కూల్, ఫుట్‌బాల్, మ్యాచ్ - ఇంగ్లీషు పదాలు.

రోజు - అరబ్బీ పదం, ప్రారంభోత్సవం -సంస్కృత పదం అంటే అంత పెద్ద వాక్యంలో తెలుగుమాటలు, ఈ మా, లో ఎంత దుర్మార్గం, మనం మాట్లాడే మాటలు మనవి కావు. దీనికి కారణం మన పుస్తకాలలో (నోయిలు) ఇంత వరకు వాడిన భాష, ఆంధ్రీకరణ కాదు సంస్కృతీకరణ భాషను వాడడమే. అవే మనం చదవడమే కారణం.

మనం ఇప్పటికైనా కళ్ళుతెరిచి మన అమ్మనుడిని మన మాటలను రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మధ్యనే ఐక్యరాజ్యసమితి (యుఎన్ఓ) నివేదిక ప్రకారం ఇండియాలో రాబోయే 30 సంవత్సరాలలో కనుమరుగయ్యే భాషలలో తెలుగొకటని తేలింది.

నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే నేడు తెలుగువారి ఇళ్ళలో అంతా ఇంగ్లీషు బడి చదువులే. పిల్లలకు తెలుగు అక్షరాలు రావు, ఆపై తెలుగు చదవలేరు. పైగా మాట్లాడలేరు కదా! కనుక ఇకనైనా ప్రభుత్వాలు (ఏలికలు), తెలుగువారు నడుంకట్టి మన భాషను కాపాడుకోవాలి. ఒకసారి మనం నిజజీవితంలో ప్రతి పొద్దు మాట్లాడే, రాసే పదాలను పరిశీలిద్దాం.

మనం వాడుతున్న ఇంగ్లీషు పదాలు: స్టేషన్, కాలేజీ, బస్, రైలు, టికెట్, కారు, బైకు, పెట్రోలు, డీసెల్, గ్యాస్, టిఫిన్, మీల్స్, వాటర్, స్కూలు, మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ, బెట్, రెడ్, గుడ్, బ్యాడ్, రైట్, రాంగ్, ఎస్, నో, లవ్, డాక్టరు, యాక్టర్, పెన్, బ్రష్, మనీ, సుగర్, సెల్, లాప్‌టాప్... ఇలా ఎన్నో ... ఎన్నెన్నో...



మనం నిత్యం వాడుతున్న సంస్కృత పదాలు

ఇవన్నీ తెలుగుపదాలే అని అందరూ భావిస్తుంటారు. నిజానికివి సంస్కృత పదాలని మనలో చాలామందికి తెలియదు.

భాష, బాధ, భోజనం, వర్షం, కష్టం, నష్టం, ఇష్టం, మూత్రం, రక్తం, ఇంధనం, ఉపన్యాసం, అధ్యాపకుడు, కర్షకుడు, సచివాలయం, కార్యాలయం, విద్య, భామ, నూతన, ఉదయం, రాత్రి, భర్త, భార్య, మాత, పిత, అర్చన, సంవత్సరం, సంతోషం, మనస్కారం, సభ, సంస్కృతి, కృతజ్ఞత ... యిలా... ఎన్నో ఎన్నెన్నో...

మన నిత్యం వాడే ఉర్దూ, హిందీ ఇతర నుడులు

ఖర్చు, జబ్బు, కిమ్మత్తు, దవాఖానా, సుల్తాను, ఖైదీ, రోజు, పద్దు, సర్కారు, స్వారీ, కాగితం, తగాదా, జప్తు, జమానా, గుమస్తా, జమీన్, శిస్తు, ఆఖరు, వగైరా, హంగామా, చాకిరి, సలాం, జిల్లా, జమీందారు, ఖరీదు, దస్తూరి, ఫిర్యాదు, కబురు, దివాను, రుమాలు, సాలీనా, మొదలైనవి ... ఎన్నో...

మన నిత్య జీవితంలో మనకు తెలియకుండానే చాప కింద నీరులా పరభాషా పదాలు ప్రవేశించి, మన మాటల్ని బయటకు నెట్టాయి. అంటే పరభాషా పదాలు ఉపయోగించకూడదని, పరభాషను నేర్చుకోకూడదని కాదు మన వాదన.

ఏదైనా ఒక పరభాషా పదం వచ్చినప్పుడు, దానికి తగిన పదాన్ని మన మాతృభాషలో కనిపెట్టి, వాడుకలోకి తేవాలి. అలాంటి ప్రయత్నాన్ని తమిళులు, ఫ్రెంచివారు, హిబ్రూ, అరబ్బులు, కన్నడిగులు చేస్తున్నారు. కొత్తమాటలు కనుపెడుతూ, వారి అమ్మనుడిని అభివృద్ధి చేసుకొంటున్నారు. మన తెలుగువారు మాత్రం, సంస్కృతీకరణ పదాలతో, ఆంగ్ల పదాలతో పబ్బం గడుపుకొంటున్నారు. ఈ విషయాన్ని అందరూ ఆలోచించవలసి ఉంది. మేధావులు, భాషావేత్తలు, ప్రభుత్వాలు స్పందించాలి. పక్క రాష్ట్రాల వారినైనా చూసి, మన తెలుగుకు పట్టిన తెగులును వదిలించుకోవాలి. తెలుగును తప్పనిసరిగా పాఠ్యాంశాలలో చేర్చాలి. పాత జీవోలను అమలు పరచాలి. అప్పుడే తెలుగుభాష పదికాలాల పాటు మనగలుగుతుంది. లేదంటే రాబోయే కాలంలో తెలుగు అక్షరాలను మ్యూజియంలో చూడవలసి వస్తుంది.

వాడుకలోకి తెచ్చుకోవలసిన కొన్ని తెలుగు మాటలను పరిశీలిద్దాం

సాఫ్ట్‌వేర్ : నునురువు, **హార్డ్ వేర్:** కటురువు, **పేపర్, కాగితం:** రాతాకు, **కంప్యూటర్:** లెక్కెన, ఎనికెన, **గుడ్‌మార్నింగ్:** మేలుపొద్దు, **గుడ్ ఈవినింగ్:** మేలు మాపటేల, **నైట్:** చీకటేల, **వెల్‌కం, స్వాగతం:** మేలురాకడ, **కాన్వెంట్, ప్రైమరీ స్కూల్, ప్రాథమిక**: మొదలిడుబడి, తొలిబడి, **సెకండరీ స్కూలు:** మలిబడి, **హైస్కూల్:** మిడిబడి, **కాలేజీ, కళాశాల:** పాటిచదివిలు, **యూనివర్శిటీ:** పెనుచదివిలు, **పాఠము, లెసన్:** చదువెన, **ప్రభుత్వం:** దొరతనం, **హెల్‌మెట్:** తలకాపెన, **స్టాండ్:** నిలిపెన, **స్టీరింగ్:** తిప్పెన, **విరామం:** విడుపు, **మార్కులు:** పొందికలు, అంకములు, **సభ:** కూటువ. **బస్సు:** పేరెగి, **కారు:** ఊరేగి, **సమాఖ్య:** ఎల్లది, సాటిది, **వ్యవస్థ:** కూటమి, **సంఘము:** కూటమి, మేళకం, **రచయిత:** రాతరి, **కవి:** నుడిరి, **సాహిత్యం:** నున్నుడి, **కావ్యం:** నెన్నుడి, **కాఫీ:** కాగినీరు, **క్రికెట్:** జిగటాట, **బ్యాట్:** బొప్పిని, **మాతృభాష:** అమ్మనుడి, **రైలు:** పట్టాలబండి, **ఎక్స్‌ప్రెస్:** వడిబండి, **కాలుక్యులేటర్:** ఎంచిక, **ఇంటర్నెట్:** లోవల, **సినిమా:** తెరాట, **సెల్:** చేపలుక, **టివి:** తొలచూపి, **ప్రారంభోత్సవం** : తొలికొను వేడుక, **రోడ్డు:** బాట, పోక, **దినము:** పొద్దు, నాడు, **బాధలు, కష్టాలు:** ఇడుములు, పాట్లు, **ప్రశ్న:** అడగ, **సమాధానం** : విడుపు, ఎరికెన.

● రాఘవ మాస్టారు
కర్నాటక సాహితీ సమాఖ్య,
బెంగళూరు - 0974377 6920

సూటిమాట

జయకు నోబెల్ ఇవ్వాలి

దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి, అన్నా డిఎంకె అధినేత్రి జయలలిత పేరును నోబెల్ బహుమతికి సిఫార్సు చేయాలి. ఇరవై రెండేళ్ళ క్రితమే ఆమె ఆడపిల్లల హత్యల నిరోధక పథకాన్ని (తొట్టిల్ కుళై థైగల్ తిట్టం-- క్రెడిల్ బేబీ స్కీమ్) ప్రవేశపెట్టారు. ఆమె పేదల కోసం ప్రవేశపెట్టిన జనాకర్షణ పథకాలన్నీ ఒకెత్తు. ఆడపిల్లలు భారంగా భావించి భ్రూణహత్యలకు పాల్పడుతున్న నేటి సమాజంలో వారిని కాపాడేందుకు



జయలలిత ఉదాత్తమైన ఆలోచన చేశారు. అందుకే ఆమె నోబెల్ బహుమతికి అర్హురాలు. ఆమె అప్పట్లో సేలంలో ఈపథకాన్ని ప్రారంభించారు. తర్వాత రాష్ట్రమంతటా విస్తరింపజేశారు. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత భ్రూణ హత్యలు బాగా తగ్గాయి. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాతే, కేంద్రం సేవ్ బేబీ చైల్డ్ నినాదాన్ని ఇచ్చింది.

❑ తమిళనాడు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్
వి.జయరామన్

మేడారం జాతరకు రాహుల్?



న్యూఢిల్లీ: సమ్మక్క,సారక్క జాతరకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రానున్నారా? అవుననే అనిపిస్తున్నది జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే. ప్రపంచంలోనే అత్యంత పెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క సారక్క జాతరకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌ను తీసుకురావాలని తెలంగాణ కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఆయన సమ్మక్క సారక్క జాతరకు వచ్చేందుకు రాహుల్ గాంధీని ఒప్పించేందుకు కొప్పుల రాజు తదితరులతో భేటీ అయి చర్చలు జరుపుతున్నారు.

అధిక సంతానానికి నజరానా

ఐజ్వాల్: 'పిల్లల్ని కనేయండి.. నగదు బహుమతి అందుకోండి. ఒకరిద్దరితో ఆగిపోవద్దు.. వీలైనంత ఎక్కువ మందికి జన్మనివ్వండి' ఇది మిజోరాం రాష్ట్రంలోని బజార్ వెంగ్ బాప్టిస్టు చర్చి ప్రకటన. నానాటికీ పెరిగిపోతున్న జనాభా నియంత్రణకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, మిజోరాం చర్చి ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో మిజో జాతి ఆధిపత్యం క్షీణిస్తున్నందునే ఈ విధమైన ప్రకటన చేసినట్లు పేర్కొంది. నాలుగో కాన్పుకు రూ. 4000, ఐదో కాన్పుకు రూ. 5000 చొప్పున నగదు నజరానా ఇస్తామని చర్చి కార్యదర్శి ప్రకటించారు. గరిష్టంగా ఎంతమందినైనా కనొచ్చని సూచించింది. ఈ పాలసీని మిగతా చర్చిలు కూడా సమర్థించాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మిజోరాం జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 52మందిగా ఉంది. అరుణాచల్ తర్వాత రెండో అతితక్కువ జనసాంద్రత రాష్ట్రంగా నిలిచింది. జనాభా వృద్ధిరేటు గత దశాబ్ద కాలంలో 23.48 శాతం ఉంది. అంతకు ముందు ఇది 29.18 శాతంగా ఉండేది. 2006లో 34 శాతంగా ఉన్న నవజాత శిశువుల సంఖ్య 2016లో 18శాతానికి పడిపోవడం పట్ల మిజోజాతి ఆందోళన వ్యక్తంచేస్తున్నది.

గుల్బర్గా నరమేధం నిందితుడి అరెస్టు

అహ్మదాబాద్: 2002 నాటి గుల్బర్గ్ నరమేధం ఘటనలో నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. 16 ఏళ్ల తర్వాత అశిష్ పాండేను బుధవారం అహ్మదాబాద్‌లోని అస్లాలి ప్రాంతంలో క్రైంబ్రాంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆనాటి మారణహోమం కేసులో 24 మందిని దోషులుగా ప్రకటించిన ప్రత్యేక న్యాయస్థానం 11 మందికి జీవితఖైదు విధించింది. వీరిలో ఐదుగురు పరారీలోనే ఉండిపోయారు. ముస్లింలు ఎక్కువగా ఉండే గుల్బర్గ్ సొసైటీలో గుర్తుతెలియని దుండగుల మూక 69 మందిని హతమార్చింది. మృతుల్లో కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎహసాన్ జాఫ్రి కూడా ఉన్నారు. గోద్రా అల్లర్ల అనంతరం చోటుచేసుకున్న దారుణ మారణకాండల్లో ఇదే అత్యంత విషాదకరమైంది. ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా పేర్కొన్న నాటి నుంచి పాండే అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. హరిద్వార్, వాపి తదితర ప్రాంతాలకు మకాం మార్చి, ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేశాడు. ఇతని ఆచూకీ గురించి క్లూ అందుకున్న పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేశారు.

అగ్నికీలల్లో మెము రైలు

పాట్నా: మొకామా స్టేషన్‌లో మెము రైలు అగ్నికీలల్లో చిక్కుకుంది. మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా రైలు నుంచి మంటలు ఎగసిపడ్డాయి. మొత్తం 16 బోగీలలో నాలుగు బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్టేషన్‌లో ఓ పక్కన నిలిపివున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తూర్పు కేంద్ర రైల్వే అధికారి రాజేష్ కుమార్ వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే 30 కిలోమీటర్ల దూరంలోని బార్త్ నుంచి ఆర్‌పీఎఫ్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఫైరింజన్ల సాయంతో మంటలు ఆర్పేందుకు మూడు గంటలపాటు శ్రమించారు. బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎవరో ఆకతాయి చేష్టలతో నిప్పు పెట్టివుంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

ఏడో రోజూ రోడ్డెక్కని బస్సులు

చెన్నై: తమిళనాడులో రోడ్డు ట్రాన్సుపోర్టు కార్మికుల ఆందోళన ఏడో రోజుకు చేసింది. జీతాల పెంపు డిమాండ్‌తో వీరు సమ్మెకు దిగారు. బుధవారం కూడా ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించడంతో సామాన్య జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్‌టీసీ కార్మికులు రోడ్డెక్కారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆందోళనలు జరుగుతున్న ప్రాంతాల్లో పెద్దఎత్తున బలగాలను మోహరించారు. తాత్కాలిక డ్రైవర్లను నియమించినప్పటికీ ఆశించిన మేర ప్రయోజనం కలగలేదు. మరోవైపు పొంగళ్ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ముందుగా టికెట్లు బుక్‌చేసుకున్న ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. వరుసగా రెండో రోజు రిజర్వేషన్ కౌంటర్లు మూసివేయబడ్డాయి. రిటైర్‌మెంట్ ఉద్యోగుల లబ్దికి సంబంధించి 750 కోట్ల రూపాయలను రెండు మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ 30కి ముందు పదవీ విరమణ పొందిన వారికి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అదేవిధంగా 2011-17 కాలానికి డీజిల్ సబ్సిడీ ప్రోత్సాహం కింద 5,138కోట్ల రూపాయలను కూడా త్వరలోనే చెల్లిస్తామని ముఖ్యమంత్రి పళనిస్వామి హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సమ్మె విరమించాలని ఉద్యోగులను కోరారు.

యూపీలో చలికి 40 మంది మృతి

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో చలి తీవ్రతకు గత 24 గంటల్లో 40 మంది మరణించారు. దీనితో చలి తీవ్రత కారణంగా మరణించిన వారి సంఖ్య 143కు చేరింది. బుధవారం ఉదయం పొగమంచు కారణంగా రాష్ట్ర రాజధానిలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ సాధారణ జన జీవనం అస్తవ్యస్తమైంది. ఉత్తర భారతదేశంలో దట్టమైన పొగమంచు అలుకుముంది. దీనితో విమాన, రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 49 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. 22 రైళ్లను రద్దు చేశారు. ఢిల్లీలో పొగమంచు కారణంగా గత కొన్ని రోజులుగా రైళ్లు, విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. ఇవాళ పొగమంచు వల్ల 24 రైళ్లు రద్దు కాగా, 52 రైళ్లు ఆలస్యం, మరో 34 రైళ్ల వేళల్లో మార్పులు చేశారు.



రైళ్లు కావాలి లైన్లు కావాలి



దక్షిణ మధ్య రైల్వేకు ఎంపీల వినతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, సేవలపై చర్చించడానికి సికింద్రాబాద్ రైల్ నిలయంలో పార్లమెంటు సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే సమావేశం నిర్వహించింది. సికింద్రాబాద్, హైదరాబాద్, గుంతకల్, నాందేడ్ రైల్వే డివిజన్ల పరిధిలోని సుమారు 20 మంది పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక పరిధిలో ఇప్పటికే కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలపైన ప్రధానంగా చర్చించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుండి వచ్చిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తమ నియోజక వర్గాల పరిధిలో రైలు మార్గాలు, సౌకర్యాలు, విస్తరణ తదితర అంశాలపైన ప్రతిపాదనలు చేశారు. దక్షిణ మధ్య రైల్వే కూడా అనేక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్, సంబంధిత రైల్వే అధికారులు సమావేశంలో పాల్గొని జోన్ పరిధిలో రైల్వే పురోగతిని, కొనసాగుతున్న పనులను, విస్తరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలను రైల్వే బోర్డుకు నివేదించడం జరుగుతుందని జీఎం వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని పార్లమెంటు సభ్యులకు వివరించారు. సభ్యులు వ్యక్తపరిచిన ఆలోచనలన్నీ రైల్వే అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేయడానికి దోహదపడతాయన్నారు. రైల్వే అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలు, సేవల రూపకల్పనలో ఎంపీల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని, సరికొత్త ప్రాజెక్టులు, సేవల ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డు ఆమోదానికి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీలు తమ నియోజక వర్గాల్లో అమలు కావలసిన అనేక రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, సేవల గురించి చర్చించారు. కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, నడుస్తున్న రైళ్ల కొనసాగింపు, అదనపు స్టేజీలు, ఆర్‌వోబీ, ఆర్‌యుబిల నిర్మాణాలు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జీఎం వినోద్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ - నిజామాబాద్, జగ్గయ్యపేట - మేళ్ల చెరువు - జాన్‌పహాడ్, దేవకద్ర - జక్లేర్, బీదర్ - గుల్బర్గా స్టేషన్ల మధ్య కొత్త రైల్వే మార్గాల ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కర్ణాటకలోని యాద్గిర్‌లో రైల్ బోగీ కార్ఖానాను ప్రారంభించామన్నారు. ఎంఎంటిఎస్ రెండవ దశపనులు 2018 చివరికి పూర్తవుతాయన్నారు. చర్లపల్లి, లింగంపల్లి, నాగులపల్లి రైల్వే స్టేషన్లను టర్మినల్ స్టేషన్లుగా అభివృద్ధి చేయడం జరుగుతుం దన్నారు. భద్రతా ప్రణాళికలో భాగంగా లెవెల్ క్రాసింగ్ గేట్ల స్థానంలో 100 రోడ్ ఓవర్ బ్రిడ్జీలను, రోడ్ అండర్ బ్రిడ్జీలను రాష్ట్ర అనుమతి రాగానే నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఖాజీపేట వద్ద వ్యాగన్ పి ఓ హెచ్ వర్క్‌షాప్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో ఎంపీలు బండారు దత్తాత్రేయ, కె. కేశవరావు, గోదం నగేష్, బూర నర్సయ్యగౌడ్, భగవంత్ ఖూబా, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బి. వినోద్‌కుమార్, ఎ. సీతారామ్‌నాయక్, ఎ.పి. జితేందర్‌రెడ్డి, సిహెచ్ మల్లారెడ్డి, నంది ఎల్లయ్య, గుత్తా సుఖేందర్ రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్, పసునూరి దయాకర్, సునీల్ బలీరాం గైక్వాడ్, బి.వి. నాయక్, బి.బి. పాటిల్, రాపోలు ఆనంద్ భాస్కర్, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు. సమావేశంలో అనేక అంశాలు చర్చించామని, పనుల్లో వేగం పెరగవలసి ఉందని ఎంపీలు అన్నారు. అనేక ప్రతిపాదనలు ఆమోదానికి నోచుకోవడం లేదని, తెలంగాణలో రైల్వేను మెరుగుపర్చవలసి ఉందన్నారు.

బి. వినోద్ కుమార్

కాజీపేట నుండి కరీంనగర్‌కు నేరుగా రైల్వే లైన్ నిర్మించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని కోరాం. పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వే లైన్‌ను ఎలక్ట్రిఫికేషన్ చేయాలని కోరడం జరిగింది. ఇందుకు టెండర్లను పిలిచామని జీఎం తెలిపారన్నారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డి

జగ్గయ్యపేట - మేళ్లచెరువు గూడ్స్ మార్గాన్ని ప్యాసింజర్ లైన్‌గా మార్చాలని కోరడం జరిగింది. నల్లగొండ - మాచర్ల మార్గం పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాం. పగిడిపల్లి - నల్లపాడు డబ్లింగ్ పనుల గురించి అడిగాం, ద.మ. రైల్వే ఆదాయంలో ముందుంది - సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేస్తుంది అని అన్నారు.

బండారు దత్తాత్రేయ

ఎంఎంటిఎస్ రెండవ దశ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరా. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రపంచ ప్రమాణాలలో అభివృద్ధి చేయవలని ఉందన్నాను. నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లను ప్రయాణికులకు అనుగుణంగా మరింతగా మార్చవలసి ఉంది, చర్లపల్లి టెర్మినల్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ముంబాయి, చెన్నయ్, తిరుపతికి సూపర్ ఫాస్టు రైళ్లను నడపాలన్నారు.

మల్లారెడ్డి

మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిగా లాలగూడ ఆసుపత్రి, మల్కాజిగిరి స్టేషన్‌ను అభివృద్ధి పర్చాలి, వికలాంగులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలి. మేడ్చల్, బొల్లారం, కొంపల్లి ఆర్‌యుబిలను పూర్తి చేయాలి.

బూర నర్సయ్య

పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజు నడిపించాలని కోరాను. షిరిడి, ఇంటర్ సిటీ, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను హోల్డింగ్ చేసి యాదాద్రికి అను సంధానం చేయమని సూచించాను. హైదరాబాద్ - వరంగల్‌కు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం మూడవ లైను వేయమని కోరాను. హైదరాబాద్ - అమరావతి మధ్యన హైస్పీడ్ రైలు అవసరాన్ని గుర్తు చేశాను.

కొండా విశ్వేశ్వరరెడ్డి

రైల్వే విజన్, మార్గదర్శకాలు మారవలసి ఉంది. ఎంఎంటీఎస్‌ను వికారాబాద్ వరకు విస్తరించాలని కోరాను. అవసరమైన చోట రైళ్లు అగడం లేదు. కొన్ని ముఖ్యమైన స్టేషన్‌లో రైళ్లను ఆపాలని కోరాను. రైల్వేలో షార్టు డిస్టెన్స్ పెంచాలని సూచించడం జరిగింది.

ఇలాగైతే మనుగడ ఎలా?

- మూడు నెలలుగా అందని జీతాలు ● పస్తులతోనే విద్యార్థులకు పాఠాలు
- మానసిక ఒత్తిళ్లతో సతమతం ● ఏడు నెలల్లో ఐదుగురు మృతి ● అయోమయంలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు ● నెలనెలా జీతాలివ్వాలని జేఎల్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పాఠాలు బోధిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు కష్టకాలం వచ్చిపడింది. సకాలంలో జీతాలు అందక అల్లాడుతున్నారు. గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. వేతనం పెరిగిందన్న ఆనందం లేకుండా పోయింది. అపుడో.. ఇపుడో అందక పోతాయా అనుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. పస్తులుంటూనే విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఈక్రమంలో కొందరు తీవ్ర ఒత్తిళ్లకు బలవుతున్నారు. సకాలంలో వేతనాలు అందక, అప్పులు తీర్చే మార్గం కనిపించక సతమతం అవుతున్నారు. గత రెండు నెలల్లో ముగ్గురు కాంట్రాక్ట్ లెక్చరర్లు మానసిక ఒత్తిడి కారణంగా మరణించారని అసోసియేషన్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్రమం తప్పకుండా వేతనాలు అందేలా చూడాలని, బకాయిలు విడుదల చేయాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3687 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తుండగా, 130 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 899 మంది పనిచేస్తున్నారు.

- డిసెంబర్ నెల మొదటి వారంలో పెద్దపల్లి జిల్లా మంథని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేసే కాంట్రాక్ట్ లెక్చరర్ కె వేణుగోపాల స్వామి హఠాత్తుగా మరణించారు. బీపీ, గుండె నొప్పి కారణంగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
- వేణుగోపాల స్వామి చనిపోయిన 15 రోజుల్లో అదే కాలేజీలో పని చేసే గంధం లక్ష్మినారాయణ కూడా మృతి చెందాడు.
- మూడు రోజుల క్రితం కామారెడ్డిలో సయ్యద్ పాష అనే కాంట్రాక్ట్ లెక్చరర్ మరణించాడు.
- 5 నెలల క్రితం హైదరాబాద్ జిల్లాకు చెందిన డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు ఫయాజుద్దీన్, సుల్తానా కూడా మరణించారని అసోసియేషన్ నేతలు తెలిపారు.

రెండు నెలల వేతనాలు విడుదల !

అక్టోబర్, నవంబర్ రెండు నెలలకు సంబంధించి కాంట్రాక్ట్ లెక్చరర్ల వేతనాలను విడుదల చేసినట్టు సమాచారం. అయితే ఈ వేతనాలు కాంట్రాక్ట్ లెక్చరర్లకు అందాలంటే మరో 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. వేతనాలు లేకుండానే సంక్రాంతి పండుగను జరుపుకోవల్సిన దుస్థితి ఏర్పడిందని అసోసియేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మదరసాలపై అసత్య ప్రచారం

- ఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ షరీఫ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మానవత్వంతో కూడిన ధార్మిక విద్యను ప్రబోధించే మదరసాలపై అసత్య ప్రచారం చేస్తున్న షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ వసీం రిజ్వీ ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రభుత్వ విప్ ఎం.ఎ. షరీఫ్ డిమాండ్ చేశారు. అజ్ఞానంతో అపవాదులు మోపుతూ ప్రభుత్వాలకు లేఖలు రాస్తున్న రిజ్వీ మతాలను విశ్వసించే వారికి సంక్రమించిన హక్కును అప్రజాస్వామికంగా కాలరాసే ప్రయత్నంగా ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. మదరసాలలో చదువుతున్న వారిలో పేదలే ఎక్కువగా ఉంటారని, వారికి తిండి, బట్ట, నివాసం ఉచితంగా అందించి సమాజంలో ఉత్తములుగా వారిని తీర్చిదిద్దేందుకు ధార్మిక విద్యతో పాటు స్కూల్ విద్యలను కూడా ప్రబోధిస్తున్న విషయాన్ని రిజ్వీ దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని షరీఫ్ మండిపడ్డారు.

మదరసాల నిర్వహణ స్థానికుల, ఆ ప్రాంతంలోని దాతృత్వ హృదయం గల ముస్లింలు ఇచ్చే జకాత్, సద్‌ఖాలాంటి ఆర్థిక సహకారంతో నడిస్తుంటే, విదేశాల నుంచి నిధులు వస్తున్నాయంటూ ఆరోపించడం రిజ్వీ అజ్ఞానానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. రిజ్వీ నిఖార్సయిన ముస్లిమై సమర్థ కలిగిన వాడైతే మదరసాల జోలికి పోకుండా సిబిఎస్ఈ సిలబస్‌తో ఆరు నుంచి పాఠశాల, వైద్య, ఇంజనీరింగ్, న్యాయ శాస్త్ర, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర అన్ని కోర్సులతో ఉచిత విద్య నేర్పే కేంద్ర విద్యాలయాలు ఏర్పాటుచేసి ముస్లిం సమాజంపట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని షరీఫ్ డిమాండ్ చేశారు.

కర్ణాటకలో హిందూ వ్యతిరేక ప్రభుత్వం



బెంగళూరు: కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం హిందూ వ్యతిరేక ప్రభుత్వమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించారు. చిత్రదుర్గలో బుధవారం నిర్వహించిన 'నవ కర్ణాటక నిర్మాణ పరివర్తన యాత్ర'ను ఉద్దేశించి అమిత్‌షా మాట్లాడుతూ.. సిద్ధరామయ్య ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. 'కర్ణాటకలో హిందూ వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని, ఇండియా వ్యతిరేక సంస్థ ఎస్‌డీపీఐపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించిందన్నారు. ర్యాడికల్ గ్రూప్ పీఎఫ్ఐపై క్రిమినల్ కేసులన్నీ ఎత్తేశారు. ఆలయ అర్చకులకు మాత్రం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు' అని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించిన కేంద్ర నిధులను సిద్ధరామయ్య ప్రభుత్వం వారికి చేరనీయడం లేదని కూడా అమిత్‌షా ఆరోపించారు. 13వ ఫైనాన్స్ కమిషన్ కర్ణాటకకు రూ.88,583 కోట్లు కేటాయిస్తే, ప్రభుత్వం 14వ ఫైనాన్స్ కమిషన్ కింద ఆ నిధులను రూ.2,19,500 కోట్లకు పెంచిందన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్, బజరంగ్ దళ్‌లో ఉగ్రవాద శక్తులు: సిద్ధరామయ్య

బీజేపీ, ఆరెస్సెస్, బజరంగ్ దళ్‌లో ఉగ్రవాద శక్తులు ఉన్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. హిందూత్వ సంస్థలపై సిద్ధు మరోసారి మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. అతివాద ఎస్డీపీఐ అయినా, బజరంగ్ దళ్ అయినా శాంతిని భగ్నం చేస్తే విడిచిపెట్టబోమని హెచ్చరించారు.

సమావేశంలో నిద్రపోయిన సీఎం

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మడికెరిలో జరిగిన తమ పార్టీ సమావేశానికి హాజరయ్యారు. ఒకవైపు పార్టీ సమావేశం జరుగుతుండగానే సిద్ధరామయ్య తన కుర్చీలో కూర్చుని హాయిగా నిద్రపోయారు. పార్టీ సమావేశంలో సిద్ధరామయ్య నిద్రపోతున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

వేగవంతంగా భూసేకరణ

- టీఎస్ ఐఐసీ చైర్మన్ బాలమల్లు
- ఉద్యోగ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత ఏడాది వివిధ ప్రాజెక్టులకు ప్రతిపాదించిన భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలని టిఎస్-ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు అధికారులను కోరారు. ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, జహీరాబాద్ నిమ్జ్, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కు, ఫుడ్ పార్కులు ఈ ఏడాది ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆయన కోరారు. టిఎస్-ఐఐసి ఉద్యోగుల క్యాలెండర్ - 2018ని బుధవారం పరిశ్రమల భవన్‌లో ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా బాలమల్లు మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో ఐఐసి లక్ష్యసాధనలో ముందుండాలని, ప్రతి కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. ఈ ఏడాది బుద్వేల్ ఐటిపార్కు, కరీంనగర్, ఖమ్మంతో పాటు తెలంగాణలోని ప్రధాన నగరాల్లో ఐటిహబ్, టవర్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. అన్ని జిల్లాల్లో కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుకు అనువైన భూములను ఎంపిక చేయాలని ఐఐసి అధికారులు, ఉద్యోగులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి ఆలోచనలకు అనుగుణంగా వేగవంతమైన పారిశ్రామిక ప్రగతితో బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్-ఐఐసి ఎండి ఈవి నర్సింహారెడ్డి, నిమ్జ్ సీఈవో మధుసూదన్, సీఈ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విఠల్ పాల్గొన్నారు.

సంచార జాతులకు ఏదీ గుర్తింపు?

- ఓసీలుగా కొనసాగుతున్న 20 కులాలు ● 40 వేల కుటుంబాలు..
- 1.60 లక్షల జనాభా ● అందులో 14 ఆశ్రిత కులాలు ● సంక్షేమ పథకాలకూ దూరంగా సంచార జాతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని సంచార జాతుల వారు ఏ కుల జాబితాలోనూ లేకపోవడంతో వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదరణ లభించడం లేదు. వారు సంచార జాతులకు చెందిన వారు కావడంతో వారికి కనీసం ఆధార్ కార్డులు లేవు, రేషన్‌కార్డులు లేవు, ఓటరు గుర్తింపు కార్డులు లేవు. ఇవి ఉండాలంటే వారికి స్థిర నివాసం ఉండాలి. కానీ వారికి స్థిరనివాసం అంటూ ఎక్కడ లేకపోవడంతో వారికి ఎటువంటి గుర్తింపు లేదు. దీంతో వారికి ఎటువంటి గుర్తింపు లేకుండా పోయింది. పైగా వారి కులాలు ఇటు ఎస్సీ, ఎస్టీలో గానీ, అటు బీసీ జాబితాలో గానీ లేకపోవడంతో వారికి కులసర్టిఫికెట్లు సైతం జారీ చేయడం లేదు. దీంతో వారి పిల్లలు బడికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. వారి పిల్లలను స్కూల్‌లో చేర్పించాలంటే ఎక్కడ ఉంటారు, ఆధార్ కార్డు, ఏ కులం అని అడుగుతున్నారు. వారికి ఎటువంటి గుర్తింపు లేదు, కులం పేరు చెబితే కుల సర్టిఫికెట్ తెచ్చుకోవాలంటున్నారు. తీరా వీరు కులసర్టిఫికెట్స్ కోసం తహీశీల్దార్ ఆఫీసులకు వెళితే వీరి కులాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఏ జాబితాలోనూ లేవకపోవడంతో వారు కులం సర్టిఫికెట్స్‌ను జారీ చేయడం లేదు.

20సంచార జాతులు ఏ జాబితాలో లేవు

తెలంగాణ రాష్ట్రంలో 20 సంచార జాతులు ఎస్సీ, ఎస్టీ బీసీ జాబితాలోనూ లేవు. 20 కులాల్లో 14 వరకు ఆశ్రిత కులాలు ఉన్నాయి. ఈ 20 కులాల వారు తెలంగాణలోని అన్ని జిల్లాలోనూ ఉన్నారు. ప్రధానంగా ఈ కులాల వారు హైదరాబాద్‌లో గుడిసెలు వేసుకుని రోడ్లపక్కన, నాలాల పక్కన ఉంటూ కొందరు యాచకవృత్తి ద్వారా, మరికొందరు చేతివృత్తుల ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. కాకిపడగల, గంజికోట, అద్దపు సింగలు, గౌడజెట్టి, ఎనోటి, మంద హెచ్చుల, రొమ్మ, పనస, సాధన సురులు, బైలు కమ్మర్లు, సన్నాయిల, బాగోతుల, బొప్పల, శ్రీక్షత్రియ రామజోగి, ఓడ్, తెరచీరల, పాండవుల వారు, బండార, ఘిసాడి తదితర సంచార జాతుల వారు ప్రస్తుతం ఏ కుల జాబితాలోనూ లేరు. ప్రతి సంచార జాతి రాష్ట్ర వ్యాప్తంగా కనీసంగా 2వేల కుటుంబాలు ఉంటారు. 20 కులాల వారు కలిపి సుమారు 40వేల కుటుంబాలు, 1.60 లక్షల మంది జనాభా ఏ కుల జాబితాలోనూ లేకపోవడంతో వారు ఓసీలుగా కొనసాగుతున్నారు.

అందని సంక్షేమ పథకాలు

రాష్ట్రంలో 20 సంచార జాతులు ఏ కుల జాబితాలోనూ లేకపోవడంతో వీరికి ప్రభుత్వం అందిస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అందడం లేదు. అందుక ప్రధాన కారణం వీరికి ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడం. వీరికి ఏ గుర్తింపు కార్డు లేకపోవడంతో వారి పిల్లలు చదువుకోలేకపోతున్నారు, సంచారజాతుల్లోని వృద్ధులకు పెన్షన్లు అందడం లేదు, వీరికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం కూడా ఎక్కడా ప్రకటించలేదు. వారికి ఏ జిల్లాలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తున్నట్టు, ఇచ్చినట్టు దాఖలాలు లేవని సంచార జాతుల నాయకులు చెబుతున్నారు. కళ్యాణలక్ష్మికి కూడా అర్హత లేని పరిస్థితుల్లో సొంత ఖర్చులతో పిల్లలకు పెళ్లిలు చేస్తున్నట్టు చెబుతున్నారు.

ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి: వెంకటనారాయణ

తెలంగాణ రాష్ట్రంలో ఏ జాబిలోలేని 20 సంచార జాతుల వారికి కుల సర్టిఫికెట్లు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల అధ్యక్షులు వై వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సంచార జాతుల వారికి ప్రత్యేకంగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. ప్రత్యేక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. 10 కోట్లు కేటాయించాలన్నారు. బీసీల సమస్యలపై ప్రభుత్వానికి ఇచ్చే నివేదికలో సంచార జాతులపై ప్రత్యేకంగా ప్రస్తావించాలని ఆయన కోరుతున్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు తమ సంచార జాతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

కులం	ఆశ్రిత కులం
ముదిరాజ్	కాకిపడగల
పద్మశాలి	సాధనాసురులు
రజక	గంజికోట
నాయిబ్రాహ్మణ	అద్దపు సింగలు
గౌడ	గౌడజెట్టి/ఎనోటి
యాదవ	మంద హెచ్చుల
విశ్వబ్రాహ్మణ	రొమ్మ పనస

కులాంతర వివాహం.. కుల బహిష్కరణ

- నిర్మల్ జిల్లా నవాబ్‌పేటలో ఘటన
- పోలీసులనాశ్రయించిన బాధితులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టెక్నాలజీలో సమాజం ముందుకు పోతున్నా.. ఇంకా కుల జాడ్యం ఎక్కువగానే కనిపిస్తోంది. ఎదో ఒక చోటా కుల బహిష్కరణలు, వివక్షత కొన సాగుతూనే ఉంది. కులాంతర వివాహం చేసుకున్నారని నిర్మల్ జిల్లాలో ఏకంగా కుల బహిష్కరణ చేశారు. దీంతో ఆ కుటుంబం ఆరు నెలలుగా నరకయాతన అనుభవిస్తోంది.

వివరాల్లోకి వెళ్లితే నిర్మల్ జిల్లా కడం మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన శాకారపురం లత (బెస్త కులం) ఎస్సీ కులానికి చెందిన కార్తీక్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నది. ఆ తర్వాత లత, కార్తీక్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి లత అక్క జ్యోతి వనభోజనాలకు వెళ్లింది. అయితే వారికి ఊహిం చని షాక్ తగిలింది. కులాంతర వివాహం చేసుకున్న లతతో పాటు ఆమె అక్క జ్యోతిని కుల పెద్దలు వన భోజనానికి అను మతించలేదు. అక్కడితో ఆగకుండా జ్యోతి కుటుంబ సభ్యు లతో ఎవరు మాట్లాడినా, ఏమైనా సహాయం చేసినా వారికి రూ. 5 వేల జరిమానాను విధిస్తామని తీర్మానం చేశారు. ఈ విషయంపై జ్యోతి గ్రామ పెద్దలను ఆశ్రయించగా.. గ్రామ పెద్దలు సైతం రూ. 30 వేలు చెల్లిస్తేనే కులంలోకి తీసుకోవాలని రాజీ కుదిర్చారు. అయితే మొదట చేసినా తీర్మానం ప్రకారం రూ. 5 వేలు చెల్లిస్తామని జ్యోతి చెప్పినా గ్రామ పెద్దలు తిర స్కరించారు. దీంతో జ్యోతి కడెం పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జ్యోతి ఫిర్యాదుతో రం గంలోకి దిగిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రవేశ పరీక్ష.. నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సులో చేరడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులను నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా స్వీకరించనున్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 28 వరకు స్వీకరిస్తారని రిజిస్ట్రార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష మార్చి 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుంది. అభ్యర్థులు ప్రవేశ పరీక్షఫీజు రూ. 300 క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాల్సి ఉంటుందని, మీసేవా ద్వారా అయితే రూ. 310 చెల్లించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తెలంగాణలోనూ మార్చి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

మరిది పెళ్లి... వదినకు తంటాలు

- పచ్చని సంసారంలో పచ్చనోట్ల చిచ్చు

దుగ్గొండి, ఆంధ్రప్రభ న్యూస్: ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు ... మరిది పెళ్ళి వదిన ప్రాణం మీదకు వచ్చింది. చిన్న కోడలు అధిక కట్నం తేవడంతో పెద్ద కోడలూ అదనపు కట్నం తేవాలని అత్తింటి వారు పోరు మొదలు పెట్టారు. సాఫ్ట్‌వేర్ భర్త కూడా డబ్బు తీసుకొస్తేనే ఇంటిని రావాలని ఆంక్షలు విధించాడు. పుట్టింటి వారి పరిస్థితి బాగాలేకపోవడంతో ఎక్కడికి వెళ్ళాలో తెలియక ప్రస్తుతం ఆ పెద్ద కోడలు అత్తింటి ముందు మౌన పోరాటం చేస్తోంది. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం పొనకల్ గ్రామానికి చెందిన శరత్‌బాబు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన శిరీషతో 2013లో వివాహమైంది. వీరికి కూతురు. శరత్‌బాబు సోదరుడి వివాహంలో తమ్ముడికి ఆయన అత్తింటి వారు రూ. 10 లక్షల కట్నమిచ్చారు. దీంతో పెద్ద కోడలు శిరీష కూడా అదనపు కట్నం తేవాలని కండీషన్ పెట్టారు. దీంతో కొన్నాళ్ళ పాటు కన్న కూతురితో పుట్టింట్లోనే ఉంది. భర్త ఎప్పటికైనా వస్తాడని ఎదురు చూసిన శిరీష చివరకు అత్తింటికి వచ్చింది. శిరీష రాకను గమనించిన అత్తింటి వారు ఇంటికి తాళం వేసుకుని వెళ్ళిపోయారు. దీంతో శిరీష చేసేదేమీ లేక ఇంటి ముందే బైఠాయించింది. బెంగళూరులో ఉన్న తన భర్త వచ్చి తీసుకు వెళ్ళాలని, అప్పటి వరకు తానిక్కడి నుంచి కదలనని శిరీష చెబుతోంది. మొత్తం మీద పచ్చని సంసారంలో పచ్చనోట్లు చిచ్చు పెట్టాయి.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

మారుతి కార్ల ధరకు రెక్కలు
రూ.17,000 వరకు పెంపు

న్యూఢిల్లీ : మారుతి సుజుకి బుధవారం నాడు అన్నీ మోడల్స్ కార్లపై రూ.17వేల వరకు ధరలు పెంచేసింది. నిర్వహణా వ్యయం పెరిగిపోవడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని బీఎస్ఈకి సమాచారం అందించింది. మోడల్‌ను బట్టి ధర రూ.1,700 నుంచి రూ.17,000 వరకు పెంచినట్లు వివరణ ఇచ్చింది. ముడి పదార్థాలు, పరిపాలన పరిమైన వ్యయం, డిస్ట్రిబ్యూషన్ ఖర్చులు పెరిగిపోయాయని తెలిపింది. ఆల్టో 800 సీసీ నుంచి ప్రీమియం క్రాస్‌వోవర్ ఎస్ క్రాస్ వరకు విక్రయిస్తోంది. వీటి ధర రూ.2.45 లక్షల నుంచి రూ.11.29 లక్షలు వరకు ఉంటాయి. ఇప్పటికే పలు కంపెనీలు ...టాటామోటార్స్ జనవరి 1 నుంచి 25వేలుపెంచేసింది. హ్యుందాయ్ మోటార్, హోండాకార్స్, మహీంద్రా అండ్ మహీంద్రాలు ఈ నెల నుంచి ధరలు పెంచుతామని ప్రకటించాయి. అయితే ఏ వాహనంపై ఎంత పెంచేది ఇప్పటి వరకు ప్రకటించలేదు.



100% ఎఫ్‌డీఐలకు ఓకే
ఇక విదేశీ పెట్టుబడుల వరద


● ఎఫ్‌డీఐ పాలసీ సవరణలకు కేబినెట్ ఆమోదం ● సులభతర వాణిజ్యం కోసమేనని ప్రకటన ● కీలక రంగాల్లో ఆటోమేటిక్ రూట్‌లో 100% ఎఫ్‌డీఐలు ● ఎయిరిండియాలో 49% విదేశీ పెట్టుబడులకు అనుమతి




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సులభతర వాణిజ్యానికి మరింత ప్రోత్సాహం ఇచ్చే దిశగా కేంద్రమంత్రి వర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. దేశంలోకి పెట్టుబడులు, ఆదాయం, ఉద్యోగ కల్పనను పెంచేందుకు విదేశీపెట్టుబడుల విధానాన్ని మరింత సరళీకరించింది. బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్రమంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియాలో 49శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ వర్తకంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నేరుగా ఆటోమేటిక్ రూట్‌లో వందశాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. కీలకమైన రంగాలలో విదేశీ పెట్టుబడులకు ద్వారాలు బార్లా తెరిచింది. ఈమేరకు నూతన ఎఫ్‌డీఐ విధానానికి ఆమోదం తెలిపింది. దీంతో సింగిల్ బ్రాండ్ రిటైల్ వర్తకంలో వందశాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కలగనుంది. వీటితో పాటు నిర్మాణ రంగం అభివృద్ధి కోసం వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతించింది. ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐలు నేరుగా ప్రైమరీ మార్కెట్ల ద్వారా పవర్ ఎక్స్ఛేంజ్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఎఫ్ డీఐ విధానం లోని వైద్య పరికరాలు అన్న పదానికి నిర్వచనం మారుస్తూ... చేసిన సవరణకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది.విదేశీ పెట్టుబడుల విధానానానికి చేసిన పలు సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. పెట్టుబడుల నిబంధనలను సరళీకరించడంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. విదేశీ పెట్టుబడులు భారీ స్థాయిలో దేశంలోకి వచ్చి ఆదాయం, ఉపాధికల్పన పెరగనుంది. ఫ్రెండ్లీ ఎఫ్‌డీఐ పాలసీ ద్వారా దేశ ఆర్థికరంగానికి మరింత ఊపు లభించనుంది. కీలకమైన రంగాలలో ఆటోమేటిక్ రూట్ ద్వారా వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతించంతో పెద్దఎత్తున పెట్టుబడులు రానున్నాయి. నిర్మాణరంగం, బీమా, పింఛన్లు, ఆర్థిక సేవలు, ప్రసారమాధ్యమాలు, పౌరవిమానయానం, ఫార్మాసూ టికల్స్, ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీలు, తదితర రంగాల్లో ఎఫ్‌డీఐ సంస్కరణలతో భారీ మార్పులు రానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా 20141- 15లో 45.15 బిలియన్ డాలర్లు, 2015-16లో 55.46 బిలియన్ డాలర్లు, 2016-17 లో 60.08 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. కాగా యూపీఏ హయాం 2013- 14లో కేవలం 36.05 బిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఐలను మరింత ఆకర్షించేందుకు నిబంధనలు మరింత సరళీకృతం చేస్తూ కేంద్రమంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ మూసివేతకు ఆమోదం తెలుపుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరక ు కంపెనీ ఉద్యోగులకు బకాయిలు ఇప్పటికే చెల్లించిట్లు తెలిపింది. సంస్థ భూములను కర్నాటక ప్రభుత్వానికి అమ్మారు.

2020 వరకు ఎంపీ ల్యాడ్స్ పథకం

ఎంపీ ల్యాడ్స్ పథకాన్ని 2020 వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయిం చింది. 14వ ఆర్థిక సంఘం ముగిసే వరకు దీనిని కొనసాగించాలని నిర్ణయించారు. ప్రతి ఏడాదికి ఈ పథకం అమలుకు 3,950 కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రానున్న మూడేళ్లకు ఇందుకోసం 11,850కోట్ల రూపా యలు ఖర్చు చేయనుంది. పథకంలో భాగంగా ప్రతి పార్లమెంటు సభ్యుడు తమ నియోజకవర్గంలో శాశ్వత పనులు చేసేందుకు నిధులు కేటాయిస్తారు. ప్రధానంగా ఈ పథకం కింద కమ్యూ నిటీ భవనాలు, తాగునీరు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, రోడ్లు తదితర పనులకు నిధులను ఖర్చు చేస్తారు.



ఎయిరిండియాలో 49% విదేశీ పెట్టుబడులు



ప్రభుత్వ రంగ సంస్థ ఎయిరిండియాలో 49శాతం విదేశీ పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం అనుమతించడం కీలక నిర్ణయమని మార్కెట్ నిపుణలు అభిప్రాయ‌ప డుతు న్నారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని పెట్టుబడిదా రులకు ఓ సానుకూల సంకేతం పంపుతుం దని అంచనా వేస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఎయిరిండియా సంస్థ నష్టాల్లో కూరుకు పోయింది. ఈ నేపథ్యంలోనే ప్రభు త్వం ఎయిరిం డియాలో విదేశీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో విదేశీ విమాన సంస్థలు ఎయిరిం డియాలో పెట్టుబడులు పెట్టే అవకాశాలున్నాయి. అయితే సింహభాగం 51శాతం ప్రభు త్వం వద్దనే ఉండనుండ డంతో, భారతీయ విమాన సంస్థగానే కొనసాగుతుంది.

మార్కెట్లను ఆకట్టుకోని ఎఫ్‌డీఐ
స్వల్పనష్టాలతో ముగిసిన మార్కెట్

ముంబై: కేంద్రప్రభుత్వం బుధవారం నాడు విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చింది. ఇవేవీ మదుపరులు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. కార్పొరేట్ ఫలితాలు, బడ్జెట్‌పైనే మదుపరులు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్‌ఇండియాలో విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతం పెట్టుబడులకు అనుమతించింది. దీంతో పాటు సింగిల్‌బ్రాండ్ రిటైల్, నిర్మాణరంగం, పవర్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులకు అనుమతించింది. కాగా గురువారం నాడు ఐటి కంపెనీలు క్యూ3 ఫలితాలు ప్రకటించబోతున్నాయి. ముందుగా గురువారం టీసీఎస్, గురువారం ఇన్ఫోసిస్ ఫలితాలు వెల్లడిస్తుంది. మొత్తానికి బుధవారం సెన్సెక్స్ 10.12 పాయింట్లు క్షీణించి 34,433.07 వద్ద నిఫ్టీ 4.80 శాతం క్షీణించి 10,655.50 వద్ద ముగిసింది. కాగా మంగళవారం విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.303.94 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.522.90 కోట్ల షేర్లు కొనుగోలు చేశారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్‌ఆటో, ఎస్‌బీఐ, టాటామోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టి, పవర్‌గ్రిడ్, ఐటీసీ, లిమిటెడ్; హీరోమోటో, ఎస్ బ్యాంకు, సన్‌ఫార్మా, కొటక్ బ్యాంకు, ఎంఅండ్ఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, టాటాస్టీల్, ఐసీఐసీఐ బ్యాంకులున్నాయి. దీనికి వ్యతిరేకంగా లాభాలను ఆర్జించిన షేర్లు టీసీఎస్, విప్రో, కోల్ ఇండియా, అదానీపోర్ట్స్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఒఎన్‌జీసీ, హెచ్‌యూఎల్, రిల్‌లున్నాయి.

డిసెంబర్‌లో జోరందుకున్న డిజిటల్ లావాదేవీలు
సుమారు వంద కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ : డిజిటల్ లావాదేవీలు డిసెంబర్ నెలలో రికార్డు స్థాయిలో వందకోట్లు దాటిపోయాయని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వెల్లడించిం ది. డిసెంబ ర్ 2017లో మొత్తం 1.06 బిలియన్ డిజిటల్ లావాదె వీలు జరగ్గా... నవంబర్ 2017లో మొత్తం 998 మలియన్ లావాదేవీ లు జరిగాయని సుమారు 6.5 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. డిజిటల్ లావదేవీల విషయానికి వస్తే వివిధ రకాలల్లో చెల్లింపులు జరిగాయి. వాటిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మిడయేట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) కార్డ్స్, ఆన్‌లైన్ వ్యాలెట్‌లున్నాయి. పక్కాగా చెప్పాలంటే నవంబర్‌తో పోల్చుకుంటే డిసెంబర్‌లో యూపీఐ ద్వారా 40శాతం లావాదేవీలు జరిగాయి. అలాగే ఐఎంపీఎస్ ద్వారా 10 శాతం లావాదేవీలు పెరిగి 98 మిలియన్ లావాదేవీలు డిసెంబర్‌లో జరగ్గా.. నవంబర్‌లో 89.5 మిలియన్ లావాదేవీలు జరిగినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వివరించింది. అలాగే స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. దీంతో పాటు సంప్రదాయంగా జరిగే కార్డు లావాదేవీలు కూడా గతేడాది డిసెంబర్‌లో ఎనిమిది శాతం పెరిగి 564 మిలియన్‌లకు చేరగా.. అంతకు ముందు నవంబర్‌నెలలో 244.6 మిలయన్‌లుగా నమోదయ్యాయి.

రూ.1,2,5 నాణెల ముద్రణ నిలిపివేత
ఆన్‌లైన్ చెల్లింపుల ప్రభావం



న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం తాత్కాలికంగా రూ.1,2,5 నాణెల ముద్రణను నిలిపివేసింది. ఇప్పటికే దేశంలోని పలు మింట్‌లలో (టంకశాలల్లో) గుట్టలు గుట్టలుగా నిల్వలు పేరుకుపోయాయి. సెక్యూరిటి ప్రింటింగ్ అండ్ మింటింగ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) మంగళవారం నాడు ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలోని మింట్‌లలో ఇప్పటికే 2.525 మిలియన్ నాణెలు నిల్వలు అలా పేరుకుపోయాయి. రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) వాటిని తీసుకుని చలామణిలో తీసుకురాకపో వడంతో మింట్‌లలో అవి అలా రాసులు రాసులుగా పోగయ్యాయి. ఆర్‌బీఐ ఎందుకు ఈ నాణెలను తీసుకోవడం లేదంటే గత 6-9 నెలల నుంచి ఆన్‌లైన్ చెల్లింపు వ్యవస్థ పెరిగిపోవడంతో ఈ నాణెలు తీసుకోవడం లేదు. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వం ఆన్‌లైన్ చెల్లింపులను పెద్దెత్తున ప్రోత్సహిస్తూ వస్తోంది. ఇప్పటికే భారీగా పేరుకుపోయిన నాణెల నేపథ్యంతో మింట్‌లలు కొత్త నాణెల ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. అయితే కొత్త నాణెల ఉత్పత్తి నిలిపివేయడం వల్ల మార్కెట్లో నాణెల కొరత ఏర్పడదు కానీ.. దీంతో పాటు దేశంలోని పలుమింట్‌లలో పనిచేస్తున్న సుమారు 3,000 మంది ఉద్యోగులపై కూడా ప్రభావం చూపుతుంది. దీనిపై ఇప్పటికే యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని వారు తమ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు. దేశంలోని మింట్‌లు లేదా టంకశాలలో రూ.1,2,5 నాణెలను ఏడాదికి 2.528 వందల కోట్ల నాణెల ముద్రించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. కాగా ఈ ఏడాది దేశంలో 15.5 వందల కోట్ల నాణెల డిమాండ్ ఉండొవచ్చునని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది.

వృద్ధిరేటుకు ఊపు!

● జీడీపీ పెరుగుతుందని కితాబు ● 2018లో జీడీపీ 7.3శాతం





వాషింగ్టన్ : భారత ఆర్థికవ్యవస్థకు ప్రపంచ బ్యాంకు మంచి కితాబిచ్చింది. ముమ్ముందు మంచి పురోగతి సాధ్యపడు తుందని వెల్లడించింది. దేశ ఆర్థిక పరిస్థితి అమోఘంగా ఉంటుందని ప్రశంసలు కురిపించింది. ఏడాది (2018) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.3 శాతంగా, వచ్చే రెండు సంవత్సరాల్లో వృద్ధిరేటు 7.5 శాతంగా నమోదు కావచ్చునని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చుకుంటే భారత్‌కు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రభుత్వం కొన్ని శక్తివంతమైన సంస్కరణలు తీసుకోరావడమే దీనికంతకూ కారణమని పేర్కొంది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్థిక వ్యవస్థలో కొంత మేర వ్యతిరేక ప్రభావం కనిపించిందని.. అయినా 2017లో 6.7 శాతం వృద్ధిరేటును సాధించగలిగిందని కితాబిచ్చింది. కాగా 2018 ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుందో మంగళవారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోల్చుకుంటే వచ్చే దశాబ్ద కాలంలో భారత్ అగ్రస్థానంలోనిలుస్తుందని తేల్చి చెప్పింది. స్వల్పకాలానికి సంబంధించి గణాంకాలపై తాను దృష్టి పెట్టడం లేదని.. దీర్ఘకాలంలో భారత్ వృద్ధిరేటులో దూసుకుపోయే సత్తా కలిగి ఉందని ప్రపంచ బ్యాంకు డైరెక్టర్, డెవలెప్‌మెంట్ ప్రాస్పెక్టస్ గ్రూపు ఐయాన్ కోసే పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. చైనాతో పోల్చుకుంటే.. ప్రస్తుతం భారత్ వృద్ధిరేటు కాస్తా వెనుకబడింది. అయితే క్రమంగా వృద్ధిరేటులో చైనాను భారత్ మించిపోతుంద న్నారు. గత మూడు సంవత్సరాల వృద్ధిరేటు చూస్తే పటిష్టంగానే ఉందని.. కోస్ చెప్పారు. ఈ ఏడాది 7.3 శాతం, వచ్చే రెండేళ్ల పాటు 7.5 శాతం దాటిపోతుందని ఆయన భరోసాను వ్యక్తం చేశారు.

చైనా వృద్ధిరేటు 2017లో 6.8 శాతం కాగా.. భారత్ కంటే 0.1 శాతం ఎక్కువ. కాగా ఈ ఏడాది చైనా వృద్ధిరేటు 6.4 శాతం, వచ్చే రెండేళ్ల పాటు వృద్ధిరేటు స్వల్పంగా తగ్గి 6.3 శాతం, 6.2 శాతానికి దిగివస్తుందన్నారు. అయితే వృద్ధిరేటు పుంజుకోవాలంటే ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టాల్సి ఉంటుందని సూచించింది. వాటిలో పెట్టుబడులకు పెద్దపీట వేయాలని, అలాగే బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలపై దృష్టిపెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యతో పాటు కార్మకరంగంలో సంస్కరణలు తీసుకురావాలని.. విద్య, ఆరోగ్యరంగాల్లో సంస్కరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న అంశాలపై దృష్టి పెడితే భారత్ వృద్ధిరేటుకు తిరుగుండదని కోసే అన్నారు. భారత్‌కు బాగా కలిసొచ్చే అంశం ఏమిటంటే పెద్దమొత్తంలో ఉన్న జనాభా.. అన్నీ రంగాల్లో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పోల్చుకుంటే భారత్‌లో మహిళా కార్మికులు చాలా తక్కువన్నారు. యువతలో నిరుద్యోగాన్ని తగ్గించడానికి ప్రైవేటు పెట్టుబడులను పెద్దెత్తున ఆకర్షించాలన్నారు. బ్యాంకుల్లో మొండిబకాయిలను గాడిలో పెడితే చాలా వరకు ఈ సమస్యను తీర్చినట్లేనని కోసే అన్నారు. మొత్తానికి భారత్‌కు వచ్చే పది సంవత్సరాల పాటు 7 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధించే సత్తా కలిగి ఉందన్నారు. ప్రభుత్వం జీఎస్టిని తీసుకురావడంపై ప్రత్యేక శ్రద్ధ చూపించిదని.. దీంతో పాటు బ్యాంకులకు మూలధనం సమకూర్చడం చాలా కీలకమన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే ఏ ఏ రంగాల్లో ఇబ్బందులున్నాయో వాటిపై దృష్టి పెట్టిందన్నారు. త్వరలోనే దాని ఫలితాలు కనిపిస్తాయన్నారు. భారత్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని.. వృద్ధిరేటు పెంచకునే సత్తా కలిగి ఉందని.. అదేసమయంలో కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు తెలెత్తినా.. దీర్ఘకాలంలో వృద్ధిరేటు ఆరోగ్యకరమైన రీతిలో 7 శాతం కంటే ఎక్కువ సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రపంచబ్యాంకు నివేదికలో వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18 జీడీపీ వృద్ధిరేటు 6.7శాతం... క్రితం ఏడాది వృద్ధిరేటు 7.1 శాతంతో పోల్చుకుంటే కాస్తా తగ్గే అవకాశాలున్నాయి. దీనికి ప్రధాన కారణం వస్తు సేవల పన్ను (జీఎస్టి)అమల్లోకి తేవడమేనని తెలిపింది. దీంతో పాటు బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న మొండిబకాయిలతో పాటు ప్రైవేట్ పెట్టుబడులు మందగించడం కూడా వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణమని ప్రపంచబ్యాంకు తాజా నివేదికలో వివరించింది.


బజాజ్ డిస్కవరీ బైక్‌లు



న్యూఢిల్లీ : బజాజ్ ఆటో బుధవారం నాడు డిస్కవ రీ రేంజికి చెందిన రెండు కొత్త బైక్‌లను మార్కెట్లో విడుద ల చేసింది. డిస్కవరీ 110, డిస్కవరీ 125 మోడ ల్స్ ధరను రూ.50,496 నుంచి రూ.56,314 (ఎక్స్ షోరూం మహా రాష్ట్ర)గా ప్రకటిం చింది. ప్రీమియం సెగ్మెంట్‌లో మంచి పట్టుసాధించ డానికి ఈ బైక్‌లను మార్కెట్‌కు పరిచయం చేసింది. డిస్కవరి 110 మోడల్ బైక్ పవర్ 115.5 సీసీ ఇంజిన్‌ను కలిగి ఉంటుంది ధర రూ.50,496 కాగా, డిస్కవరీ 125సీసీ .. 124.5 సీసీ పవర్ యూనిట్ ధర రూ. 43,491 కాగా డ్రమ్, డిస్క్ యూనిట్ ధర రూ.56,314గా నిర్నయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త బైక్‌లను విడుదల చేసిన తర్వాత బజ్‌జ్ ఆటో ప్రెసిడెంట్ (మోటార్‌సైకిల్) ఎరి క్ వాస్ మాట్లాడుతూ.. 100 సీసీ సెగ్మెంట్‌లో ప్లాటినా, కంఫోర్ట్‌టెక్ , సీటి 100 లో మార్కెట్లో మంచి పట్టు సాధించామని, ప్రస్తుతం డిస్కవరి 110,125 సీసీ సెగ్మెంట్‌లో ప్రీమియం అనుభూతిని కస్టమర్లు పొందుతారని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీపై ఆసక్తి కలిగిన వారు బైక్‌లను ఇష్టపడతారని.. రెండు మోడల్స్ బైక్‌ల ఫీచర్ల విషయానికి వస్తే ఎల్ఈడీ, డేటైం రన్నింగ్ హెడ్ ల్యాం ప్స్‌తో పాటు డిజిటల్ ఇన్స్ట్రుమెంట్, డిస్‌ప్లే ప్యానెల్ ఉంటాయని తెలిపారు.


హైదరాబాద్ రియల్ మార్కెట్ ఆశాజనకం

● రెండో త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్‌కు భారీగా డిమాండ్ ● పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ నుంచి కుదుటపడుతున్న మార్కెట్ ● నైట్ ఫ్రాంక్ అధ్యయనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి డిమాండ్ పెరుగుతోందని, స్థిరాస్తి పెట్టుబ డులకు మంచి అవకాశం ఉందని నైట్ ఫ్రాంక్ పేర్కొంది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఇప్పుడిప్పుడే మార్కెట్ పుంజుకుంటోందని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రియల్ మార్కెట్ వేగం అందుకోనుందని నైట్‌ఫ్రాంక్ హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్ శ్యాంసన్ ఆర్థర్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18కిగానూ రెండవ త్రైమాసిక అధ్యయనాన్ని బుధవారం ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి విధింపు తర్వాత రియల్ మార్కెట్ కుంటుపడిందని, ఆ తర్వాత నిలదొక్కుకుని మళ్ళీ వేగం పుంజుకుందని చెప్పారు. జులై నుంచి డిసెం బర్ వరకు గృహ నిర్మాణంలో కేవలం 940 యూనిట్లకుమాత్రమే డిమాండ్ రావడంతో, గత ఏడాదితో పోల్చితే హౌసింగ్ రంగం 84 శాతం క్షీణించిందని ఆయన చెప్పారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ యాక్టు (రేరా) ప్రభావంతో మార్కెట్ స్తంభించి 13శాతం అమ్మకాలు పడిపోయాయని చెప్పారు. జిఎస్‌టిపై స్పష్టమైన అవగాహన లేకపోవడం, వెంటనే గృహ ప్రవేశం చేసేందుకు అనువుగా ఇళ్ళ లభ్యత లేకపోవడంతో అమ్మకాలు బాగా తగ్గాయని శ్యాంసన్ చెప్పారు. మార్కెట్‌లో ఈ మధ్యకాలంలో విక్రయించిన గృహాల్లో 40శాతం రూ.50 లక్షలలోపే ఉన్నాయని, బిల్డర్లు కూడా వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటికి డిమాండ్ ఎక్కువగా ఉందని, అయితే అవి ఎక్కువగా అందుబాటులో లేవన్నారు. నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లపై జిఎస్‌టి వసూలు చేస్తున్నందున వీటి ధర భారీగా పెరిగిపోతున్నందున రెడీ-టు-మూవ్ గృహా లకే డిమాండ్ ఎక్కువగా ఉందని శ్యాంసన్ చెప్పారు.ఆఫీస్ స్పేస్ మార్కెట్ పరంగా చూస్తే రెండవ త్రైమాసికంలో సరి కొత్త రికార్డును నమోదు చేసింది. నిర్మాణాన్ని పూర్తిచేసిన భవనాలన్నీ కార్యాలయాలతో కళకళ లాడుతు న్నాయి. మరెన్నో భవనాలు నిర్మా ణాలు పూర్తి చేసుకుంటున్నప్పటికీ పెరుగు తున్న డిమాం డ్‌కు తగ్గట్టుగా అందుబాటులో లేవని నైట్‌ఫ్రాంక్ అధ్యయనం వెల్లడించింది. హైదరాబాద్‌లో ఇప్పటికే 50 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌లో కార్యాలయాలు పని చేస్తుండగా, మరో 8 లక్షల అడుగుల స్పేస్‌కు డిమాండ్ ఉందని శ్యాంసన్ చెప్పారు. బెంగళూరులో రద్దీ పెరగడం, చెన్నైలో వాతావరణం అను కూలించక పోవడంతో ఐటిరంగం హైదరాబాద్ వైపు చూస్తోంది. వాతావరణం సమతుల్యత, అన్ని వనరులు కలిగిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరింత విస్తరించనుందని ఆయన చెప్పారు.


హ్యుందాయ్ కొత్త వెర్నా



న్యూఢిల్లీ : హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఐ ఎంఎల్) బుధవారం నాడు కొత్తగా రెండు వెరియెంట్ మిడ్‌సైజు ప్రీమియంసెడాన్ వెర్నాలను మార్కెట్లో విడుదల చేసింది. 1.4 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ధర రూ.7.79 లక్షల నుంచి రూ.9.09 లక్షల వరకు (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా ప్రకటించింది. గత ఏడాది ఆగస్టు లో హ్యుందాయ్ కొత్త జనరేష న్ వెర్నాను మార్కెట్లో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే మార్కెట్లో 1.6 లీటర్ పెట్రోల్, డిజిల్ పవర్‌ట్రెయిన్స్‌కు విక్రయిస్తోంది. కొత్తగా బుధవారం నాడు విడుదల చేసిన నెక్స్ట్‌జెన్ వెర్నా 1.4 లీటర్ కప్పా డ్యూయెల్ వీటివీటి ఇంజిన్ కలిగింది. ఇంధన సామర్థ్యం కాస్తా ఎక్కువగా ఇస్తుందని డ్రైవింగ్‌కు సౌకర్యవం తంగా ఉంటుందని కస్టమర్ల అంచనాలకు తగ్గట్లు కారును రూపుదిద్దామని హెచ్ఎంఐఎల్ డైరెక్టర్ సేల్స్, మార్కెటింగ్ రాకేశ్ శ్రీవాత్సవ ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ మార్కెట్లో వెర్నాకు మంచి ప్రజాదరణ ఉందని, దీన్ని మరింత బలోపేతం చేయడానికి కస్టమర్లకు విస్తృత స్థాయిలో అవకాశాలు ఇచ్చేందుకు కొత్త మోడల్స్‌ను అందు బాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. కొత్త వెర్నా పవర్ ఔట్‌పుట్ 100 పీఎస్ తో పాటు, మైలేజీ లీటర్ పెట్రోల్‌కు 19.1 కిలోమీటర్లు వస్తుందని ఆయన చెప్పారు. రెండు మోడల్స్‌ను ప్రస్తుతానికి అందుబాటులో ఉంచారు. ఒకటి ఈ, రెండోది ఈఎక్స్, రెండు ఆరు స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్‌లు కలిగినవే. కాగా 1.6 లీటర్ పెట్రోల్ ఇంజిన్ వెర్నా ధర రూ.9.68 లక్షల నుంచి రూ.12.48 లక్షలు, డిజిల్ వెర్నా 1.6 లీటర్ ఇంజిన్ కారు ధర రూ.9.42 లక్షల నుంచి రూ.12.87 లక్షల వరకు ఉంటుంది.

కిడ్నీ జబ్బులు పెరుగుతున్నాయ్!

●దాతల కోసం వ్యాధిగ్రస్తుల ఎదురుచూపు ●40 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ●ఇప్పటికే పీపీపీ పద్ధతిలో 10 కేంద్రాలు ●కృత్రిమ కిడ్నీల తయారీలో అమెరికా శాస్త్రవేత్తలు నిమగ్నం ●త్వరలోనే మానవులపై ప్రయోగం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్‌తో చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్ అనేది కిడ్నీలు ఫెయిల్ అయిన వారికి కచ్చితంగా చేయించాల్సి ఉంటుంది. డయాలసిస్ చేయకపోతే కిడ్నీలు ఫెయిల్ అయిన వారు బతకడం కష్టం.వీరి గుండెకు శుద్ధి చేసిన రక్తం అందడం తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో వివిధ అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. దీంతో డయాలసిస్ అనే ప్రక్రియ ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని శుద్ధి చేస్తారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి వారంలో ఒకటి నుంచి మూడు సార్లు డయాలసిస్ చేస్తారు. ఒక్కసారి డయాలసిస్ చేయాలంటే రూ.3000 వరకు ఖర్చవుతోంది. తెలంగాణ ప్రభుత్వం పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టీషిపేట్) పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుకు నడుం బిగించింది. డయాలసిస్ మిషన్లను ప్రైవేటు వారే ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ కూడా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఈ మిషన్లు ఏర్పాటు చేస్తే దానికి ఏమైనా మరమ్మతులు వచ్చినప్పుడు పెద్ద మొత్తంలో ఖర్చు కావడం, రోగుల ఇబ్బందులనుదృష్టిలో పెట్టుకొని పీపీపీ పద్ధతిలో డయాలసిస్ మిషన్లను ప్రవేశపెట్టారు.

ఒక్కసారికి 1,500 రూపాయల ఖర్చు

ఒక్క రోగికి డయాలసిస్ చేయడానికి 1,300-1,500 రూపాయలను యంత్రాలు ఏర్పాటు చేసిన వారికి ప్రభుత్వం చెల్లిస్తోంది. దీంతోపాటు డయాలసిస్ పేషెంట్లకు సింగిల్‌యూజ్డ్ ఫిల్టర్లను వాడేలా ఒప్పందం చేసుకుంది. గతంలో ఒక్క ఫిల్టర్‌ను 10 మందికి వాడేవారు. దానివల్ల రోగి ఇన్‌ఫెక్షన్ల బారిన పడేవారు. ఇప్పుడు అలా కాకుండా ఒక్క ఫిల్టర్ ఒక్కరికే వాడేలా ప్రభుత్వం వారితో ఒప్పందం చేసుకుంది. చాలామంది రోగులు జిల్లాల నుంచి నగరానికి వచ్చి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎక్కడికక్కడ జిల్లాలో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే మెరుగైన వైద్యంతో పాటు ఇన్‌ఫెక్షన్లు లేని వైద్యం అందించాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే గాంధీ, నిమ్స్, వికారాబాద్, సిరిసిల్లా, సంగారెడ్డి, సిద్ధిపేట, గద్వాల, వనపర్తి, వనస్థలిపురం, మలక్‌పేట ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. త్వరలో ఖమ్మం, ఆదిలాబాద్‌లలో ప్రారంభం కానుంది.

గాంధీ, నిమ్స్‌లలో డయాలసిస్ కేంద్రాలు

ప్రస్తుతం గాంధీలో 28 యంత్రాలు డయాలసిస్ సేవలను అందిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ, నాన్ ఆరోగ్యశ్రీ కింద సేవలను అందిస్తున్నారు. నెలకు 1000 మందికి చికిత్స అందిస్తున్నాయి. నగరంలోని మూడు బోధనాసుపత్రుల్లో క్లస్టర్ల వారీగా డయాలసిస్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. దీంతో పాటు నిమ్స్‌లోనూ డయాలసిస్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 697 మంది దాతల నుంచి కిడ్నీల నుంచి సేకరించి వారికి అమర్చగా ఇంకా 1610 మంది దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

కిడ్నీలా పనిచేసే కృత్రిమ అవయవం

అసలైన కిడ్నీలా పనిచేసే ఒక కృత్రిమ అవయవాన్ని అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. ఇది విజయవంతం అయితే డయాలసిస్ అవసరం ఉండదు. మూత్రపిండాల వ్యాధి ముదిరిపోయిన రోగులకు ఈ అవయవ మార్పిడి సరైన చికిత్సగా వైద్యులు పేర్కొంటున్నారు. అమెరికాలో ఏటా 25 వేల మూత్రపిండాల మార్పిడులు జరుగుతున్నట్టు సర్వేలో తేలింది. ఇంకా లక్ష మంది పైగా ఈ అవయవం మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు. డయాలసిస్ రోగులు ఆయుర్దాయం 5 నుంచి 10 ఏళ్ల మధ్యే ఉంటుంది. ఈ డయాలసిస్ విరుగుడుగా షువోరాయ్ నేతృత్వంలోని ఓ బృందం జీవకృత్రిమ మూత్రపిండాన్ని రూపొందించింది. దీన్ని శరీరంలోకి చొప్పించవచ్చు. దీనివల్ల శరీరంలోకి వచ్చే గొట్టాలు, ఇతర అనుసంధాల అవసరం ఉండదు. ఇందులో అధునాతన సిలికాన్ నానో టెక్నాలజీని చొప్పిస్తారు. అందువల్ల భారీ స్థాయిలో ఈ సాధనాల ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. రక్తంతో కలిసి పని చేయడానికి వీలుగా సిలికాన్ పొరలకు వినూత్న అణుపూతలను పూశారు. మూత్రపిండాల మార్పిడి అనంతరం శరీర రోగ నిరోధక వ్యవస్థ నుంచి వ్యతిరేకతను ఎదుర్కొ వడానికి ఇమ్యూనోసప్రెసెంట్ ఔషధాలను వాడాల్సిన అవసరం ఉండదు. సహజ మూత్రపిండాలు నిర్వహించే అన్ని రకాల విధులను ఈ కృత్రిమ అవయవం నిర్వర్తిస్తుందని అక్కడి నిపుణులు చెబుతున్నారు. దీనిని త్వరలోనే మానవులపై ప్రయోగించనున్నట్టు వారు తెలిపారు.

పనివిధానం ఇలా...

తొలుత ఈ సాధనంలోని హీమోఫిల్టర్ మాడ్యూల్‌లోకి రక్తం ప్రవేశిస్తుంది. అక్కడ తొలి శుద్ధి జరుగుతోంది. ఈ క్రమంలో నీరులా ఉండే అల్ట్రాఫిల్ట్రరేట్ ఏర్పడుతోంది. ఇందులో కరిగిన విషతుల్య రసాయనాలు, చక్కెరలు, లవణాలు ఉంటాయి. ఆ తరువాత మూత్రపిండాల కణాలతో ఒక బయో రియాక్టర్ ఈ అల్ట్రాఫిల్ట్రరేట్‌ను శుద్ధి చేస్తుంది. చక్కెరలను, లవణాలను తిరిగి రక్తంలోకి పంపేస్తుంది. ఈ క్రమంలో నీటిని శరీరం తిరిగి గ్రహించేసి అల్ట్రాఫిల్ట్రరేట్‌ను మూత్రంగా మార్చేస్తుంది. దానిని శరీరం నుంచి వెలుపలకు పంపడం కోసం మూత్రాశయంలోకి చేరవేస్తుంది.

రోగులు పెరగడం బాధాకరం

వైద్య సేవలు పెంచుతున్నామన్నా ఆనందం కంటే రోగులు పెరుగుతున్నారన్న బాధే ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం బోర్‌వెల్ నీరే కారణంగా చెప్పవచ్చు. అడుగంటిన నీటి వనరుల వాడడం వల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఓ సర్వేలో తేలింది. వీటి నివారణ నిమిత్తం ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హరితహారం పథకాలను ప్రవేశపెట్టింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు జిల్లాల నుంచి రాకుండా వారికోసం అక్కడే కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. త్వరలో అన్ని మిగతా జిల్లాలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నాం.



మంత్రి లక్ష్మారెడ్డి

'పల్లె'కు వైద్యం

●పీహెచ్‌సీల్లో అధునాతన పరికరాల ఏర్పాటు ●అల్ట్రాసౌండ్‌తో పాటు ఆటో ఎనలైజర్ పరికరాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పీహెచ్‌సీల్లో అధునాతన పరికరాలను సమకూర్చుతోంది. ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా అందుకు తగినట్టుగానే జిల్లా స్థాయి ఆస్పత్రుల్లో అధునాతన పరికరాలను సమకూర్చుకోవడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కేసీఆర్ కిట్, జేఎస్‌వై (జననీ సురక్షయోజన) జేఎస్ఎస్‌కెలాంటి పథకాల వల్ల గ్రామీణులు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కట్టారు. వీటితో పాటు బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ సర్వీసులు త్వరలో ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు ఆటో ఎనలైజర్, అల్ట్రాసౌండ్ పరికరాలను త్వరలో పీహెచ్‌సీలలో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఏటా 7 లక్షల కాన్పులు జరుగుతుండగా కేసీఆర్ కిట్ పథకం అమలు నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 6 లక్షల కాన్పులు నమోదవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి అల్ట్రాసౌండ్ పరికరం వలన చాలా మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణుల కష్టాలు తీరనున్నాయి. కడుపులో బిడ్డ పరిస్థితి గురించి తెలుసుకోవడానికి ఇన్నాళ్లు పరీక్షల కోసం చాలాదూరం ప్రయాణించాల్సి వచ్చేది. గతంలో గర్భిణికి బ్లడ్, స్కానింగ్, పరీక్షలు చేయించడానికి స్థానికంగా ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లతో పీహెచ్‌సీలు ఎంఓయూ కుదుర్చుకునే వారు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ఎక్కడైతే కాన్పులు జరుగుతాయో అక్కడ అల్ట్రాసౌండ్ పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ పరీక్షల వలన గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి వీలవుతుంది.

ఎంబీబీఎస్ డాక్టర్లుఅనుమతి లేదు

అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించడానికి గతంలో ఎంబీబీఎస్ డాక్టర్లకు అనుమతి ఉండేది కాదు. ప్రస్తుతం వీరు కూడా పరీక్షలు నిర్వహించవచ్చని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో ఎంబీబీఎస్ డాక్టర్లకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.చాలా కాలంగా కమిటీ ఏర్పాటు కాకపోవడంతో లింగనిర్ధారణ పరీక్షలు పీహెచ్‌సీల్లో నిర్వహించే అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖా ప్రిన్సిపల్ సెక్రటరీ లింగ నిర్ధారణ పరీక్షలను పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకనుంచి అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించాలనుకునే ఎంబీబీఎస్ వైద్యులకు ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి వారితో గర్భిణి మరియు శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చని ప్రభుత్వం ఆలోచన. వైద్యులు ఒక నెల శిక్షణ తీసుకొని అల్ట్రాసౌండ్ పరీక్ష రాసి పాస్ అయితే వారికి ఆరునెలల శిక్షణ అవసరం కూడా లేదని ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతోపాటు ప్రైవేటు క్లీనిక్‌లు, ఆస్పత్రులకు చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా...

పీహెచ్‌సీలలో ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. సిబ్బంది నియామకంతో పాటు ఆధునిక పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతం పీహెచ్‌సీలకు భారీగా రోగులు వస్తున్నారు. త్వరలో బస్తీ దవాఖాన, డయాగ్నస్టిక్ సర్వీసుల వలన ప్రభుత్వానికి ఇంకా పేరు వస్తుంది. అవసరమైన సిబ్బంది నియామకం కూడా చాలా వరకు పూర్తి చేశాం. ప్రభుత్వ ఆశయాన్ని తూచా తప్పకుండా పాటించి జిల్లా ఆస్పత్రుల అభివృద్ధికి పాటు పడతాం.



- హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ పద్మజ

త్వరలో బస్తీ దవాఖానాలు

గ్రామీణ ప్రాంతాల్లోని బస్తీల్లో మెరుగైన వైద్యం అందించడానికి బస్తీ దవాఖానాల పేరుతో త్వరలో ప్రారంభించనుంది. దీనికి ప్రతి దవాఖాన కింద స్టాఫ్ నర్సు, ఒక డాక్టర్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. బస్తీలు ఉన్న చోట కమ్యూనిటీ హాల్‌ను కేటాయిస్తే అందులో బస్తీ ఆస్పత్రులను ఏర్పాటు చేయనున్నారు. వీటిని త్వరలో ప్రారంభించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్‌లో మొదటగా బస్తీ దవాఖానలను ప్రారంభించనున్నారు.

తెలంగాణ డయాగ్నోస్టిక్ సర్వీసులు

ప్రస్తుతం రోగులను పట్టిపీడిస్తున్న దానిలో మొదటి అంశం డయాగ్నస్టిక్ సర్వీసులు. ప్రజలు వచ్చిన రోగం గురించి తెలుసుకోవాలంటే జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి నెలకొంది. వీటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టడానికి ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్ పేరుతో సర్వీసులను ప్రారంభించనుంది. అన్ని పీహెచ్‌సీలలో రోగి నుంచి రక్తాన్ని సేకరించి ఐపీఎం నారాయణగూడకు పంపిస్తారు. వారు తరువాత రిపోర్టులను పీహెచ్‌సీలకు పంపిస్తారు. ప్రస్తుతం ఈ సర్వీస్‌లను హైదరాబాద్‌లోని 12 పీహెచ్‌సీలలో 8వ తేదీ (సోమవారం) నుంచి ప్రభుత్వం ప్రారంభించనుంది.వీటిలో చాలా పరీక్షలను చేయనున్నారు.

ఆటో ఎనలైజర్ పరికరాన్ని అన్ని పీహెచ్‌సీలకు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ పరికరం ఉంటే అన్ని రకాల పరీక్షలు చేయడానికి వైద్యులకు సులువు అవుతుంది. అన్ని జిల్లాలకు ఇవ్వడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

అత్యాధునిక సౌకర్యాల కల్పనే ధ్యేయం.. మంత్రి లక్ష్మారెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రులను చూసి భయపడే పరిస్థితి నుంచి ప్రజలు బయటకు రావడానికి వీలుగా ఉచితంగా పేదలకు వ్యాధినిర్ధారణ పరీక్షలతో పాటు రోగాన్ని కూడా నయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. దీనికోసం ఆధునిక వసతులు, అత్యాధునిక సౌకర్యాలను ప్రతి ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఆస్పత్రిని కూడా ఆధునీకరించడానికి తగిన చర్యలు చేపట్టాం. ఆస్పత్రుల్లోని పోస్టులను భర్తీకి 10కి పైగా నోటిఫికేషన్లను ప్రకటించాం. ఆస్పత్రుల్లో రోగులను చూసుకోవడానికి పేషెంట్ కేర్ సిబ్బందిని కూడా రిక్రూట్‌మెంట్ చేసుకున్నాం. మిగతా నియామకాలు సంవత్సరం లోపు పూర్తి చేస్తాం.

స్కాలర్‌షిప్ దరఖాస్తులకు 10 తుది గడువు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపకార వేతనాలు, బోధన ఫీజులకు దరఖాస్తు చేసుకోవడానికి ఇ-పాస్ వెబ్‌సైట్‌ను తిరిగి ప్రారంభించారు. విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం జనవరి 11 నుండి ఫిబ్రవరి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనవలసి ఉంటుందని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి డాక్టర్. బుద్ధ ప్రకాశ్ జ్యోతి తెలియచేశారు. కళాశాలలు, విద్యార్థులు ఉపకారవేతనాలు, బోధనా ఫీజుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకొనవలసి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో 2017-18 విద్యా సంవత్సరం ఫ్రెష్, రెన్యువల్ పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేయడానికి జూన్ 20 నుండి నవంబర్ 30 వరకు ఈ పాస్‌ను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోని విద్యార్థులు మరికొంత మంది ఉన్నారని వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని అర్హులైన వారందరికి ఉపకారవేతనాలు, బోధనా ఫీజులు అందించేందుకు వీలుగా మరో సారి ఈ పాస్‌ను తెరవడం జరిగిందన్నారు. ఎట్టి పరిస్థితిలోను గడువు తేదీని పొడిగించబోమని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోని విద్యార్థులు, కళాశాలలకు ఉపకారవేతనాలు, బోధనాఫీజుల చెల్లింపులు జరగవన్నారు. విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు కళాశాలల్లోనే ప్రత్యేకంగా కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరింది.

కోర్టుకు హాజరైన యాంకర్ రవి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీ నటుడు చలపతిరావు గతంలోమహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను సమర్థించి కోర్టు కేసును ఎదుర్కొంటున్న బుల్లి తెర నటుడు రవి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యాడు. నటుడు చలపతిరావు మహిళలను కించ పరిచే విధంగా వ్యాఖ్యలు చేశారు. వ్యాఖ్యల పట్ల మహిళా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న రవి చలపతిరావు వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడారు. దీంతో కొన్ని మహిళా సంఘాలు కోర్టులో కేసు వేశాయి. ఈ కేసు విచారణ నిమిత్తం రవి కోర్టుకు వచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని, దీనిపై సోషల్ మీడియాలో త్వరలోనే స్పందిస్తానని రవి చెప్పాడు. కోర్టులంటే తనకెంతో గౌరవమని, హాజరవాలన్న ఆదేశాల మేరకు రావడం జరిగిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలు ఒకటైతే ప్రచారమైంది మరో రకమన్నారు. ఈ విషయాలను కోర్టుకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. కేసు తదుపరి విచారణను కోర్టు ఫిబ్రవరి 7 కు వాయిదా వేసింది.

హాజరుకు గడువివ్వండి..ప్లీజ్

●యాంకర్ ప్రదీప్ వినతి...పోలీసుల అంగీకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కోర్టు హాజరు విషయంలో బుల్లి తెర యాంకర్ ప్రదీప్ ట్రాఫిక్ పోలీసులను మరోసారి మినహాయింపును కోరారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నిబంధనల మేరకు కౌన్సెలింగ్‌కు హాజరు కాని ప్రదీప్ షూటింగ్‌లు ఉన్నాయన్న వినతితో మినహాయింపును పొందాడు. చివరకు సోమవారం ట్రాఫిక్ పోలీసుల కౌన్సెలింగ్‌కు హాజరైన విషయం తెలిసిందే. ఆ తర్వాత మంగళవారం కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. అయితే కోర్టుకు సమర్పించిన పేపర్లు, నివేదిక తయారీ విషయంలో జాప్యం కారణంగా బుధవారం హాజరు కావాలని పోలీసులు ప్రదీప్‌ను ఆదేశించారు. అయితే తనకు ముందుగా ఖరారైన కొన్ని షూటింగ్‌లున్నాయని, కోర్టు హాజరుకు కొద్ది రోజులు మినహాయింపు ఇవ్వాలని మరోసారి కోరడంతో పోలీసులు అంగీకరించారు.

టీఎన్ఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ తెలంగాణ అనుబంధ సంఘం తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టిఎన్ఎస్ఎఫ్) 2018 క్యాలెండర్‌ను పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధి కొత్తకోట దయాకర్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు ఎం.అమర్‌నాథ్ బాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, తెలుగు యువత అధ్యక్షుడు టి.వీరేందర్ గౌడ్, టిఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బూర్గుల రమాకాంత్ గౌడ్, నాయకులు ఎస్.ప్రసాద్, రవీందర్, టి.ప్రసాద్, శివగౌడ్, సాయి సూర్యగౌడ్, సాయిచరణ్‌రెడ్డి, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో బీసీ మేళాలు

●వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి జోగు రామన్న



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ఎంబీసీలు, సంచార జాతుల వారికి రుణాలు ఇవ్వడం కోసం ఫిబ్రవరి నెలలో జిల్లాల్లో బీసీ మేళాలను ఏర్పాటు చేస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. రుణాల కోసం ఎంబీసీలు, సంచార జాతుల వారు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఫెడరేషన్‌లు ఉన్న 11 కులాలకు చెందిన వారు ఐదు మంది సభ్యులతోనే సొసైటీల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మంత్రి జోగు రామన్న తెలిపారు. ఇప్పటి వరకు సొసైటీ కోసం 11 నుంచి 15 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా దానిని కాస్త తగ్గించి ఐదుమంది ఉన్నా సొసైటీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫెడరేషన్లు ఉన్న కులాల వారు వెంటనే సొసైటీలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను మంత్రి జోగు రామన్న బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ అనితా రాజేంద్ర, అదనపు కార్యదర్శి సైదా, అదనపు సంచాలకులు కిరాడ్ అలోక్ కుమార్, మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని 11 కులాలకు సంబంధించి ఫెడరేషన్లను ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు 11 నుంచి 15 మంది ఉంటేనే సొసైటీ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని, ఇకపై దానిని ఐదు మందికి తగ్గించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకోవడానికి హెచ్‌టిటిపిః// టిఎస్‌బిసిడబ్ల్యూ. సీజీజీ. జీవోవి. ఇన్ వెబ్ సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రం లోని ఎంబీసీలు, సంచార జాతులకు రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని, అందులో భాగంగా జనవరి మూడో వారంలో ఈ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రజక, నాయి బ్రాహ్మణ, వడ్డెర, సగర ఉప్పర, వాల్మీకి బోయ, భట్రాజ, కృష్ణ బలిజ, పూసల, కుమ్మర శాలివాహన, విశ్వబ్రాహ్మణ, మేదర ఫెడరేషన్లు ట్యాడి టాపర్ కార్పొరేషన్ ద్వారా 11,640 సంఘాలు నమోదు చేసుకున్నారని, వాటిలో 2,71,928 మంది సభ్యులుగా ఉన్నారన్నారు.

12నుంచి బీసీ రాజకీయ సమ్మేళనాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను రాజకీయంగా చైతన్యం చేస్తూ 70 నియోజకవర్గాల్లో బీసీ రాజకీయ సమ్మేళనాలను నిర్వహించాలని నిర్ణయించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం బీసీ భవన్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన మీడియాకు తెలిపారు. సమావేశంలో పి లక్ష్మినారాయణ, కుల్కచర్ల శ్రీనివాస్, రేవంత్, అనంత శ్రీనివాస్‌గౌడ్, వరికుప్పల మధు, జి మహేష్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అప్పుడే ఎన్నికల వాతావరణం వచ్చిందని, ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీ లన్నీ బీసీలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని జాజుల డిమాండ్ చేశారు. గతంలో ఒకరు దళిత సీఎం అని ప్రకటించారని, మరొకరు బీసీ సీఎం అని ప్రకటించారని ఇంకొకరు బడుగులనే సీఎంని చేస్తామని ప్రకటించి ఎవరు వారి మాటలను నిలబెట్టు కోలేదని విమర్శించారు. ఈ నెల 12 నుంచే బీసీ రాజకీయ చైతన్య సమ్మేళనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. 12న వరంగల్‌లో 20న చౌటుప్పల్, 28న హైదరాబాద్, 30న బోధన్‌లో బీసీ రాజకీయ సమ్మేళనాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి చివరి వారంలో 20వేల మంది ప్రతినిధులతో బీసీల రాజకీయ దిశా- దిశ నిర్దేశం కోసం బీసీ రాజకీయ ప్లీనరీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రేపటిలోగా జీతాలు చెల్లించాలి

●రేయాన్స్ యాజమాన్యానికి ప్రభుత్వం హెచ్చరిక ●ఫిబ్రవరిలోగా ఫ్యాక్టరీ భవితవ్యం తేల్చాలని అల్టిమేటం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్ - బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) కార్మికులకు ఈనెల 12వ తేదీలోగా ఒకనెల జీతం చెల్లించాలని కార్మిక మంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆదేశించారు.

ఫ్యాక్టరీ మూతపడి రెండేళ్ళు గడుస్తున్నా కార్మికుల సమస్యలు తీర్చడం లేదని రేయన్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మంత్రులు నాయిని, కడియం శ్రీహరి, చందూలాల్ జేఏసీ నేతలు ఈనెల 2వ తేదీన సచివాలయంలో సమావేశం నిర్వహించారు. 14, 15 తేదీల్లో సంక్రాంతి పండుగ ఉన్నందున 12వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, ఫిబ్రవరి నెలలోపు ఫ్యాక్టరీ భవితవ్యం తేల్చాలని బుధవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు.

ఇటీవల పేపర్ పల్ప్‌కు ధర పెరగడంతో రేయన్ ఫ్యాక్టరీని పేపర్‌పల్ప్ ఫ్యాక్టరీగా మార్చి నడిపించే ప్రతిపాదనను పరిశీలించాలని కంపెనీ ప్రతినిధులకు మంత్రులు సూచించారు. లేనిపక్షంలో ఫ్యాక్టరీ మూసివేయాలనుకుంటే కార్మికులకు రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 14న కంపెనీ బోర్డు మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫ్యాక్టరీ సీఈవో అగర్వాల్ మంత్రులకు చెప్పారు. ఈసారి తుది నిర్ణయం ఫ్యాక్టరీ యాజమాన్యమే తీసుకోవాలని, నిర్ణయాన్ని వాయిదా వేయవద్దని మంత్రులు స్పష్టంచేశారు. యాజమాన్యం తన నిర్ణయాన్ని తెలపకుంటే ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యంపట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫిబ్రవరిలో కంపెనీ బోర్డు మీటింగ్ జరిగిన తర్వాత అక్కడ తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకు ఫిబ్రవరి మూడవ వారంలో మరోసారి సచివాలయంలో సమావేశం కావాలని నిర్ణయించారు. ఫ్యాక్టరీ నడిపేందుకు వీలుగా యాజమాన్యాన్ని ఒప్పించి రావలసిందిగా సీఈవోకు మంత్రులు సూచించారు. ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిపై మంత్రులకు యూనియన్ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్యనాయక్, బిల్ట్ ఇండస్ట్రీ డీజీఎం కేశవరెడ్డి, బిల్ట్ వర్కర్స్ జేఏసీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

మంద కృష్ణను బేషరతుగా విడుదల చేయాలి: ఆర్కే

హైదరాబాద్ ఆంధ్రప్రభ: అప్రజాస్వామికంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగను బేషరతుగా విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శాంతియుతంగా తమ ఆఫీసులో దీక్ష చేస్తున్న మంద కృష్ణను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. బుధవారం కృష్ణయ్య చంచల్‌గూడ జైల్లో మందకృష్ణను కలిసిన అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, భూపేష్‌సాగర్, కోట్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణమాదిగ 23 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారని, అందులో భాగంగానే తమ ఆఫీసులో దీక్షచేపట్టారని గుర్తు చేశారు. శాంతియుతంగా దీక్ష చేస్తున్న ఆయన్ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారని విమర్శించారు.

ప్రైవేట్ జూ.కాలేజీల గుర్తింపునకు గడువు పెంపు

హైదరాబాద్‌ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువును పెంచుతూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా జనవరి 31 వరకు సమర్పించడానికి అవకాశం కల్పించినట్టు బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ. 1000తో ఫిబ్రవరి 7 వరకు, రూ. 3000తో ఫిబ్రవరి 14 వరకు, రూ. 5000తో ఫిబ్రవరి 21 వరకు, రూ. 10వేలతో ఫిబ్రవరి 28 వరకు, రూ. 15వేలతో మార్చి 7 వరకు, రూ. 20వేల అపరాధ రుసుంతో మార్చి 14 వరకు అవకాశం కల్పించినట్టు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు 13 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులుగా ప్రకటించినట్టు అశోక్ మరో ప్రకటనలో తెలిపారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలి

●బీసీ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంక్షేమ సంఘం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పించాలని తెలంగాణ బీసీ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఉద్యోగాల నియామకంలో బీసీలకు ఉన్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. బీసీ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల మహాసభ బుధవారం కోఠిలోని వైద్య, విధాన పరిషత్‌లో జరిగింది. మహాసభకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు బి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా జాతీయబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాసభలో గుజ్జ కృష్ణ, డాక్టర్ ప్రవీణ్, వెంకటేశ్వరరెడ్డి, ప్రకాష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగసవరణ చేపట్టాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలు ఐక్యంగా పోరాడి రాజ్యాంగబద్ధమైన హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయడానికి ఎటువంటి రాజ్యాంగపరమైన అడ్డంకులు లేవని స్పష్టం చేశారు. గతంలోని పాలకులు వీటినిపై దృష్టి పెట్టకపోవడం వల్లనే ఇది జరగలేదని అన్నారు. ప్రస్తుతం ప్రధానిగా బీసీ వ్యక్తి ఉన్నారని ఇప్పుడు ఆ ప్రయత్నం చేయాలని అన్నారు. బీసీలకు ఉద్యోగ నియామకాల్లో ఉన్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని లేకపోతే బీసీ సమస్యలపై పార్లమెంటు ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

కాకినాడ నుంచి జనసాధారణ్ రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి సందర్భంగా పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకొని అడ్వాన్స్ రిజర్వేషన్ అవసరంలేని పూర్తిగా రెండవ తరగతి జనరల్ బోగీలతో జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్లను సికింద్రాబాద్ నుండి గుంటూరు - విజయవాడ మీదుగా కాకినాడకు ఈ నెల 11,12 తేదీలలో దక్షిణ మధ్య రైల్వే నడుపుతుంది. ఈ జనసాధారన్ ప్రత్యేక రైళ్లన్నీ పూర్తిగా 2వ తరగతి జనరల్ బోగీలతో ఉంటాయి. రైలు వినియోగదారులకు ఉపయోగపడే విధంగా కనీస ధరలతో జంటనగరాల నుండి కాకినాడకు నడుపుతారు. ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులు సికింద్రాబాద్ నుండి గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటాయి. రైల్ నెంబర్ 07050 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ జన్‌సాధారణ్ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి కాకినాడకు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లల్లో ఆగుతుంది. ఈ జనసాధారణ్ ప్రత్యేక రైళ్లన్నీ 16 జనరల్ 2వ తరగతి బోగీలు, 2 లగేజీ కం బ్రేక్ వ్యాన్ కోచ్లను కలిగి ఉంటాయి.

ఠాణాలకు కార్పొరేట్ హంగులు

● నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు ● ఊరూరా క్లూస్ టీమ్ వాహనాలు ● ఫ్రెండ్లీ పోలీసింగ్ దిశగా అడుగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 2018 టెక్నాలజీ ఇయర్‌గా ప్రకటించిన డీజీపీ మహేం దర్‌రెడ్డి అందుకు అనుగుణంగా జిల్లాల్లో పరిస్థితులను మెరుగుపర్చే దిశగా ప్రయత్నాలకు శ్రీకారం చుడుతున్నారు. సైబర్ నేరాలు ఓ ఛాలెంజింగ్ అని ఆయన చెప్పకనే చెబుతున్నారు. ఇటీవల వార్షిక సమావేశంలో నేరాలు పెరిగాయని చెప్పిన ఆయన రానున్న కాలంలో సైబర్ నేరాలు పెరుగుతాయని, వాటిని నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీ పెరిగిన క్రమంలో నేరగాళ్లు కూడా అంతేస్థాయిలో టెక్నాలజీని అందిపుచ్చుకునే అవకాశం లేకపోలేదన్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాలు మరింత విస్తృతం కాగలవన్నారు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని చేపట్టిన సంస్కరణలను వివిధ కమిషనరేట్లు, జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

ప్రధానంగా 98 శాతంగా ఉన్న ప్రజలను భాగస్వాములను చేసి రెండు శాతంగా ఉన్న నేరాలను అరికట్టగలమన్న అభిప్రాయాన్ని ఆయన పదే పదే వ్యక్తపరుస్తూ వస్తున్నారు. అంతేకాదు, ప్రజల భాగస్వామ్యంతోనే ఏదేని సాధ్యపడగలదన్న అభిప్రాయాన్ని ఆయన కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో కమ్యూనిటీ సహకారంతో నేనుసైతం ప్రాజెక్టు అమలుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం వల్ల ఒనగూరే ప్రయోజనాల్లో జిల్లాల్లో అధికారులు ప్రజలకు వివరిస్తూ వారిని జాగృతం చేస్తున్నారు.



హైదరాబాద్ కాప్ యాప్ తరహాలో టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్‌ను సిబ్బందికి అందుబాటులోకి తెచ్చారు. తద్వారా ప్రతి సిబ్బందికి తాను చేసే పనికి సంబంధించి టెక్నాలజీ పరంగా అతిసులువుగా వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇక్కడ అవలంబించిన మాదిరిగా వారి వారి విధులను వర్గీకరించి వారిలో సమర్థులైన సిబ్బందికి థర్డ్ పార్టీ ద్వారా గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుంది. ఆ విధానాన్ని సైతం ఇతర కమిషనరేట్లు.. జిల్లాల పరిధిలో విస్తరిస్తున్నారు. మరోవైపు క్లూస్ టీమ్స్ వాహనాలను సైతం జిల్లాలకు పంపే యోచనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు.

ఓ వైపు టెక్నాలజీని అందిస్తూనే మరోవైపు కమిషనరేట్ పరిధిలో, జిల్లాల హెడ్ క్వార్టర్స్‌తో పాటు ఊరూరా పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణకు సంబంధించి కూడా చర్యలు చేపడుతున్నారు. గతంలో పోలీస్‌స్టేషన్లకు ఇచ్చే మెయింట్‌నెన్స్‌తో పనిలేకుండా.. కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా రాష్ట్రమంతటా అన్ని పోలీస్‌స్టేషన్లలోని పోలీసు స్టేషన్లను ఆధునీకరించే ప్రయత్నం జరుగుతోంది. అయితే, హైదరాబాద్ మాదిరి స్థాయిలో కాకపోయినా.. పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్.. కూర్చొవడానికి కుర్చీలు తదితర ఏర్పాట్లను చేయనున్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని కలిగించే విధంగా కృషి చేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సిబ్బందికి చెబుతూ వస్తున్నారు. ఈ దిశగానే ఆయన ప్రయత్నిస్తున్నారు. శాంతి భద్రతలు సజావుగా ఉంటేనే పెట్టుబడులు తరలి వస్తాయని, ఒక్క హైదరాబాద్‌కే కాదు మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా పెట్టుబడులు తరలి వస్తే ప్రయోజనం అనన్యం అని ఆయన సిబ్బందికి చెబుతున్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలతో పాటు ఆయా ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచే ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసుశాఖ ప్రాధాన్యతను గుర్తెరిగారు. పోలీసులు అడిగినా అడగకపోయినా అత్యాధునిక వాహనాలు సమకూర్చారు. అదే క్రమంలో టెక్నాలజీని కూడా సమకూర్చారు.

నిధుల విషయంలో వెనుకాడే ప్రసక్తి ఉండబోదని, శాంతిభద్రతలు, మతసామరస్యం పరిరక్షించబడాలని ఆ దిశగా కృషి చేయాలని తొలినాళ్లలోనే పోలీస్ బాస్‌లకు సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా పోలీస్ బాస్‌లు కృషి చేస్తూ వచ్చారు. సీసీ కెమెరాల వల్ల 90 శాతం నేరాలను అదుపు చేయగలిగారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం. ప్రభుత్వ కాంక్షకు అనుగుణంగా హైదరాబాద్ కమిషనరేట్‌లో తనదైన ముద్రతో అనే కానేక సంస్కరణలకు నడుం బిగించిన మహేందర్‌రెడ్డి నేడు రాష్ట్ర పోలీస్ బాస్‌గా ఆ సంస్కరణలు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యేలా కృషి చేస్తుండటం గమనార్హం. కాగా, అంతిమంగా పెట్టుబడుల ధామంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం.



మహాజాతరకు భద్రత కట్టుదిట్టం

● భక్తులకు అసౌకర్యం కలగని రీతిలో ఏర్పాట్లు

● సీసీ, డ్రోన్ కెమేరాలతో పహారా

● ట్రాఫిక్ నిర్వహణకు పక్కా ప్రణాళిక

భూపాలపల్లి ప్రతినిధి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన భద్రత పరమైన చర్యలు తీసుకుంటున్నట్లు నార్త్‌జోన్ ఐజీ వై.నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ ఆర్.భాస్కరన్, జయశంకర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.వి. కర్ణన్‌లతో కలిసి మేడారంలో ఐజీ విస్తృతంగా పర్యటించి, భద్రత, ట్రాఫిక్‌తో పాటు పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లా డుతూ ఈసారి మహాజాతరకు కోటి మందికి పైగా భక్తులు వస్తారని, భక్తులకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 10వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. భక్తుల భద్రత కోసం ఈసారి సాంకేతికతను ఎక్కువగా విని యోగించనున్నమని ఐజీ పేర్కొన్నారు. క్రౌడ్ కంట్రోల్ కెమెరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పాటు, మేడారం యాప్‌ను త్వరలోనే ప్రారం భించనున్నట్టు ఐజీ నాగిరెడ్డి వెల్లడించారు. అలాగే మహాజాతరలో అగ్ని ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విపత్తు నిర్వహణ శాఖతో పోలీసులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. ఆ తర్వాత ఎస్పీ ఆర్.భాస్కరన్‌తో కలిసి పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, సమ్మక్కను తీసుకు వచ్చే చిలుకలగుట్ట, సారమ్మను తీసుకువచ్చే కన్నెపల్లి ప్రాంతాన్ని, జంపన్నవాగు వద్ద భద్రత ఏర్పాట్లను, క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా భద్రతా చర్యలు, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రతిష్టాత్మక మేడారం మహాజాతరను నిరంతర నిఘాతో ప్రశాంతంగా ముగించటంలో పోలీసుశాఖ శక్తికి మించి పనిచేయాలని ఐజీ నాగి రెడ్డి అన్నారు.

బ్రాహ్మణ రచయితలకు శుభవార్త

● రచనల ముద్రణకు రూ. 50వేల ఆర్థిక సాయం

● ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రచయితలు, రచయిత్రులు, కవులు, కవయిత్రులకు శుభవార్త. కావ్యహితం పథకం కింద బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు తమ రచనలను ముద్రించుకోవడానికి వీలుగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ గరిష్టంగా యాభైవేల రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు బుధవారం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అడ్మినిస్ట్రేటర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథ కం కింద దరఖాస్తు చేయాలనుకొనే వారు నివాస, ఆదా య, కుల ధృవీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తుతో పాటు రచనల రెండు ప్రతుల్ని admin-tbsp-gad@telanga na.gov.in అన్న మెయిల్ ఐడికి గాని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యాలయం, తిలక్‌రోడ్, బొగ్గులకుంట, హైదరాబాద్‌కు ఫిబ్రవరి 10వ తేదీలోగా పంపాలన్నారు. గడువు తేదీలోగా వచ్చిన రచనలను నిపుణుల కమిటీ పరిశీలించి నియమ, నిబంధనల మేరకు వాటిని ఎంపిక చేసి ఆర్థిక సాయం కోసం సిఫారసు చేస్తుందన్నారు. ఆధ్యాత్మిక, చారిత్రక, పౌరాణిక, సామాజిక అంశాలకు సంబంధించిన కవిత్వం, విమర్శ, వ్యాసం, వ్యాఖ్యానం, కథ, నవల, పరిశీలనాత్మక వ్యాసాలు, రచయితలకు, రచయిత్రులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రంథ ముద్రణకు తగిన అనుమతి ఇవ్వబడిన తరువాత తగిన నిధులు విడుదల కావడానికి ముద్రించబడిన గ్రంథం యొక్క పది ప్రతులను అడ్వాన్స్ స్టాంప్ రిసిప్ట్‌తో పాటు పంపించాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

రాజకీయ నిరుద్యోగులకు దేవాలయాలు పునరావాస కేంద్రాలా!

● ఆలయాలను కాపాడుకునేందుకు భక్తులతో ఉద్యమం

● విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి

కదిరి, ప్రభన్యూస్: దేశంలో దేవాలయాలు రాజ కీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రాలుగా మారా యని, దేవాలయాలు కాపాడుకోవడానికి భక్తులతో ఉద్యమం నడుపుతామని విశాఖ శ్రీ శారదా పీఠాధిప తి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగం గా కదిరిలో మూడు రోజుల పాటుగా భక్తులకు అను గ్రహ భాషణం చేసిన స్వామిజీ బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవ నారసిం హ క్షేత్రాలలో పురాతనమైన ఖాద్రీ నృసింహ క్షేత్రంలో బస చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చినట్లు స్వామిజీ పేర్కొన్నారు. దేశంలోని పురాతన దేవాలయాల పరిస్థితి, అర్చకులపై పాలక మండళ్ల పెత్తనం, దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనాలపై దృష్టి సారించి వాటి స్థితిగతులను పరిశీలించడం జరుగుతోంద న్నారు. విజయయాత్రలో సనాతన సాంప్రదాయాలతో పాటు దేవాలయాల విశిష్టతపై హిందువులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.



రాష్ట్రం తో పాటు దేశంలో దేవాలయాల వ్యవస్థ కుప్ప కూలు తోందన్నారు. దేవాలయాలు రాజకీయ నిరుద్యోగుల కు పునరావాస కేంద్రాలుగా మారాయని స్వామిజీ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడి, కాళహస్తిలో మరెక్కడైనా దిగజారుడు తనంతో కూడిన క్షుద్రపూజలకు ఆలవాలంగా మారడం శోచనీయంగా పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనంతో పాటు రాజకీయ పెత్తనం మితిమీరిందన్నారు. దేవాలయాల్లో ప్రతిదీ డబ్బుకు అమ్ముడుపోయే విధ ంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంద న్నారు. దేవుని దర్శించుకోవాలన్నా డబ్బుతోనే ముడి పడడం జరుగుతోందన్నారు. అన్ని మతస్థుల విష యంలో ప్రభుత్వ జోక్యం లేకపోతుండగా, హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని? స్వామిజీ ప్రశ్నించారు. దేవాలయాలను కాపాడుకోవాలని, భక్తులతో ఉద్యమం నడపనున్నట్లు స్వామిజీ ఈ సందర్భంగానే వెల్లడించారు. కాగా ఖాద్రీనృసింహ క్షేత్రానికి కర్ణాటక భక్తుల తాకిడి విపరీతంగా ఉందని, అయితే భక్తులకు వసతి సౌకర్యాలను కల్పించడంలో లోపం ఉందన్నారు. ఈ లోపాలపై దేవాదాయ శాఖ కమీషనర్‌కు, దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లనున్నట్లు స్వామిజీ తెలిపారు. మకర సంక్రమణ అనంతరం రాయలసీమలోని కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నట్లు స్వామిజీ తెలిపారు.



ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు ప్రజలకు ఉంది

నల్లకుంట, ప్రభ న్యూస్ : ప్రభుత్వాన్ని నిలదీసే అధికారం ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకుందని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలంగాణ రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్‌కోదండరాం అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సమానపనికి సమాన వేతనం-సుప్రీం కోర్టు తీర్పు అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అధికారం దుర్వినియోగంచేస్తే ప్రజలే సరైన సమాధానం చెబుతారని, ప్రజలు ఎంతకాలం అంగీకరిస్తే అంతకాలమే పనిచేయాల్సి వస్తుందన్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా సమానత్వపు హక్కును ప్రభుత్వం అమలు చేయాల్సిన అవసరముందన్నారు. సమానపనికి సమాన వేతనం సుప్రీం కోర్టు ఇచ్చిన ముఖ్యమైన తీర్పు. రాజ్యాంగ ప్రకారమే పాలన చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. నా ఇష్టం వచ్చినట్టు పాలిస్తానంటే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనీస వేతనాల చట్టానికి తూట్లు పొడుస్తూ కార్మికుల రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు.

నిబంధనలు పాటించని బడులపై వేటెయ్యండి

కడియం శ్రీహరికి హెచ్‌ఎస్‌పీఏ విజ్ఞప్తి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రైవేటు స్కూల్స్ ఫీజుల పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ప్రైవేటు స్కూల్స్ అమలు చేయడం లేదని, అమలు చేయని స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ బుధవారం ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరికి విజ్ఞప్తి చేసింది. సంఘం నేతలు అశీష్ నెరెడీ, సీమ, హిర్‌దేశ్ గుప్తా తదితరులు ఉన్నారు. ప్రభుత్వానికి సమర్పించిన ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ సిఫారసులను అమలు చేయకుండా ప్రభుత్వం స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రైవేటు స్కూల్స్ అమలు చేయడం లేదని హెచ్‌ఎస్‌పీఏ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేటు స్కూల్స్ ఫీజులను ప్రతి ఏడాది పెంచినట్టుగానే ఈ ఏడాది కూడా పెంచుతున్నాయని ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయని స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



99 ఏళ్ల వృద్ధురాలికి తుంటి మార్పిడి

దేశంలోనే ఇది మొదటిసారి: డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 99 సంవత్సరాల వృద్ధురాలికి తుంటిమార్పిడి శస్త్రచికిత్సను చేసి రికార్డు సృషించారు సికింద్రాబాద్ నర్సింగ్ హోంకు చెందిన వైద్యులు. ప్రస్తుతం ఆమె కోలుకోని మునుపటిలా నడుస్తుండడం గొప్ప విషయమని డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సకు సంబంధించి డా.శ్రీనివాస్‌గౌడ్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిం చారు. వయస్సు మళ్లిన ఒక రోగికి ఇటువంటి శస్త్రచికిత్స నిర్వహించడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. 99 ఏళ్ల ప్యారీ బాయి కిందటేడాది డిసెంబర్ 10న తన ఇంట్లో ఉన్న బాత్‌రూంలో కాలు జారిపడింది. ఆ సమయంలో ఆమె తుంటికీలు విరిగిపోయింది. దీంతో ఆమె మంచానికే పరిమితమయ్యింది. ఆమె కొడుకు, కోడలు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌కు సంప్రదించగా 11వ తేదీన ఆమెకు శస్త్ర చికిత్సను నిర్వహించారు. డీహెచ్‌ఎస్ (డైనమిక్ హిప్ స్క్రూ) సర్జరీ - సి-ఫార్మ్ మార్గ నిర్దేశంతో వెన్నెముకకు అనస్థీషియా ఇచ్చి శస్త్రచికిత్స ద్వారా ఫ్రాక్చర్‌కు ఒక రకమైన ప్లేట్‌ను, స్క్రూను బిగించారు. ఆస్టియోపొరోసిస్ కారణంగా ఆమె ఎముకలు డొల్లగా మారాయని దీంతో ప్రత్యేకంగా డిజైన్ చేయబడిన ఇంప్లాం ట్లను తీసుకురావడం జరిగిందని డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ శస్త్రచికిత్స చేయ డానికి గంటన్నర సమయం పట్టిందని, గతంలో 93 సంవత్సరాల వయస్సు గల రోగికి ఇలాంటి ఆపరేషన్ చేశామని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో 99 ఏళ్ల వృద్ధురాలికి ఇలాంటి శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

పరోక్ష ఎన్నికలు పెడితే ఉద్యమిస్తాం

పంచాయతీరాజ్ ఛాంబర్ హెచ్చరిక



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గ్రామ సర్పంచ్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించాలని కొత్త చట్టంలో ప్రతిపాదిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలం గాణ పంచాయతిరాజ్ ఛాంబర్, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రభు త్వాన్ని హెచ్చరించింది. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కొత్త చట్టంతో చిచ్చు పెట్టొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రిజర్వేషన్లు రెండు విడతలుగా కొనసాగించాలని చేసిన ప్రతిపాదనను ఈ సంఘాలు స్వాగతించాయి. పంచాయతిరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి బుధ వారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన తో పాటు ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బడిపల్లి సిద్ధార్థ, ఉపాధ్యక్షులు అంజనీ ప్రసాద్, అశోక్ రావు, రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సం ఘం అధ్యక్షుడు ఆర్ పురుషోత్తంరెడ్డి, ఇతర నాయ కులు బెల్లం శ్రీనివాస్, పండిల్లాపల్లి వెంకట్ తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, గ్రామపంచాయతీలను పటిష్టం చేసేందుకు కొత్త చట్టం తీసుకురావడాన్ని తాము స్వాగిస్తున్నామని, అదే సందర్భంగా సర్పంచులకు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని చట్టం తీసుకువస్తే మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. దీంతో గ్రామాల్లో అలజడి వస్తుందని హెచ్చరించారు. పరోక్షఎన్నికలు నిర్వహిస్తే ప్రజలకు జవాబుదారీ తనం లోపిస్తుందని, వార్డు సభ్యులదే పెత్తనం ఉంటుందని, అంతేగాక పదవి ఎప్పుడు ఉంటుందో...ఊడుతుందో అనే ఆందోళనతో పరిపాలన చిద్రమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయం సేకరించాలని కోరారు. 1959నుంచి మహారాష్ట్రలో పరోక్ష పద్ధతిలో సర్పంచులను ఎన్నుకునే వారని,ఈ విధానం వల్ల కలిగే దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకుని 2017 లో పరోక్ష పద్ధతిలో ప్రజలు ఎన్నుకునే విధానాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, పరోక్ష పద్ధతిలో సర్పంచు లను ఎన్నుకోవడం స్థానిక ప్రభుత్వాలకు గొడ్డలిపెట్టుగా అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో గ్రామాల్లోనే 73 శాతం ప్రజలు నివరిస్తున్నారని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్కపైసా కూడా పంచాయతీలకు మంజూరు చేయలేదని విమర్శించారు. సిద్ధార్థ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం 8666 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ఇప్పుడున్న పంచాయతీలకు కార్యదర్శులు లేరని, కొత్తగా ఏర్పాటుచేసే 4 వేలకు పైగా గ్రామ పంచాయతీల పరిస్థితేంటని ప్రశ్నించారు.

భార్య చేతిలో భర్త హతం

ఆత్మహత్యగా చిత్రీకరణకు ప్రయత్నం



కారేపల్లి, ప్రభ న్యూస్ : భార్య చేతిలో భర్త హతమైన ఘటన మంగళవారం రాత్రి కారేపల్లి మండలం సామ్యతండాలో చోటు చేసుకుంది. సామ్యతండాకు చెం దిన బానోత్ శ్రీను (35) కూలీ పనులు, రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనులు చేసుకుంటూ జీవిస్తు న్నాడు. భార్య లక్ష్మి ఇల్లెందు వెళ్లి కూరగాయల వ్యాపారం చేస్తుంది. ప్రతీ రోజు మద్యం తాగి ఇంటికి వచ్చే శ్రీను, భార్యతో గొడవకు దిగేవాడు. మంగళ వారం రాత్రి కూడా ఇద్దరి మధ్య భారీ వివాదం జరిగింది. అనంతరం నిద్రకు ఉపక్రమించగా తెల్లవారుజామున శ్రీను పురుగుల మందు తాగి మృతి చెందాడంటూ చుట్టుపక్కల వారికి, బంధువులకు ఫోన్లో కబురు చెప్పింది. మృతుడి ఇంటివద్దకు చేరుకున్న బంధువులకు, గ్రామస్తులకు పురుగుల మందు తాగినట్లు ఏమీ లేకపోవడం, శ్రీను మెడవద్ద కమిలి ఉండడం, నోట్లో నాలుక బయటకు వచ్చి ఉండడంతో హత్య చేసి ఆత్మహత్యగా పేర్కొంటుందంటూ వారి భార్యలక్ష్మికి దేహశుద్ధి చేయడంతో ఆమె అక్కడ నుండి పరారై కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. మద్యం తాగి నిత్యం వేధిస్తుండడంతో తానే జాకెట్‌తో మెడకు ఉరివేసినట్లు లక్ష్మి పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ హత్యను లక్ష్మి ఒక్కతే చేసిందా..? ఎవరైనా సహకరించారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గతేడాది సరిహద్దుల్లో 138 మంది పాక్ సైనికుల హతం

● ఇంటెలిజెన్స్ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: 2017లో జమ్ము,కశ్మీర్‌లోని వాస్తావాధీన రేఖ(ఎల్‌ఓసి) వెంబడి చొరబాట్ల సమయంలో.. ఇతర వ్యూహాత్మక దాడుల్లో పాకిస్తాన్‌కు చెందిన 138 మంది సైనికులను హతమార్చామని ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇదే సమయంలో భారత్ తన 28 మంది సైనికులను కోల్పోయిందని తెలిపాయి. తమవైపు చనిపోయిన సైనికుల వివరాలను పాక్ వెల్లడించదని... చనిపోయిన వారంతా సాధారణ పౌరులుగా చిత్రీకరిస్తుందని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదిగా జమ్ము కశ్మీర్‌లో భారత సైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘనలను, ఉగ్రవాదుల కలాపాలను దీటుగా ఎదుర్కొంటున్నదని, సరిహద్దుల్లో పరస్పర కాల్పులసందర్భంగా పాక్‌కు చెందినసైనికులు 138 మృతిచెంగా, 155 వరకు తీవ్రంగా గాయపడటమో లేదా చనిపోవడమో జరిగిందని ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్పాయి.

సరిహద్దు చొరబాట్లు నిరోధించడంలో పాల్గొన్న భారత సైనికుల్లో 70 మంది గాయపడ్డారని పేర్కొన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం, పాకిస్తాన్ 2017లో 860 సార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడింది. 2016లో ఈ సంఖ్య 221 మాత్రమే.

వ్యవసాయం దండగ అన్నారు

● అన్నదాతల కష్టాలు వారికి ఎలా తెలుస్తాయి? ● ఏడాది ఓపిక పట్టండి

● మీ కష్టాలు తీరుస్తా ● ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్ హామీ

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో: అసలు వ్యవసాయమే దండగ అన్నవారికి రైతులు పడే కష్టాలెలా తెలుస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న ప్రజాసంకల్ప పాదయాత్ర లో భాగంగా ఆయన బుధవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని మారు మూల పల్లెల గుండా ముందుకు సాగారు. పెనుమూరు మండలం జెట్టివానిపల్లెలో మొదలైన పాదయాత్ర వెదురుకుప్పం మండలం జక్కిదొన, గంటావారిపల్లె, బొట్లవారిపల్లె, నల్లవెంగనపల్లె, మాతూరు క్రాస్, పాతగుంట, చెన్నుగారిపల్లె మీదుగా గుండుపల్లి వరకు దాదాపు 14 కిలోమీటర్ల దూరం కొనసాగించారు. దారి పొడ వునా చెరకు, పళ్ల రైతులు, నల్లబెల్లం తయారీ రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. పండిం చిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెర కు రైతులు సహకార చక్కెర కర్మాగారాలు మూతపడి పోవడంతో ప్రైవేటు కర్మాగారాల దోపిడీకి గురవుతున్నారన్నారు. నల్లబెల్లం తయారీదారులైన రైతులు అటు బెల్లం తయారీపై ఆంక్షలు విధించడమే కాక ఇటు బెల్లం తయారీ యంత్రాలకు సంబంధించిన విద్యుత్ బిల్లుల భారంతో కుంగిపోతున్నామన్నారు. దాదాపుగా అందరి సమస్యలను వ్యక్తిగతంగా విం టూ వచ్చిన జగన్ ప్రతి ఒక్కరికి వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి చేయతలపెట్టిన పథకాలను వివరించారు. అసలు వ్యవసాయమే దండగన్న వారే రాష్ట్రాధినేతలుగా ఉన్నప్పుడు రైతులకు ఏవిధంగా మేలు జరుగు తుందని ప్రశ్నించారు. మరో ఏడాది పాటు ఓపిక పడితే తమ ప్రభుత్వ హయాంలో అందరి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. మారుమూల గ్రామాల గుండా కొనసాగిన యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జగన్‌కు ఘనంగా స్వాగ తం పలికారు. పలుచోట్ల యువతీ యువకులు జగన్ తో సెల్ఫీలు దిగడానికి పోటీలు పడ్డారు. ఉదయం జెట్టి వానిపల్లెలో మొదలైన యాత్ర సాయంత్రం గుడ్డుపల్లె చేరుకోవడంతో ముగిసిందగి. 58వ రోజుయాత్రలో భాగంగా జగన్ నల్లవెంగనపల్లె చేరుకోవడంతో 800 కిలోమీటర్ల దూరం పూర్తయిందని పార్టీ వర్గాలు చెప్పడంతో అక్కడ జగన్ మొక్కను నాటారు. ఈ పాదయాత్రలో గంగాధరనెల్లూరు శాసన సభ్యుడు నారాయణస్వామి తదితర స్థానిక నేతలు పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం గు ండానే కొనసాగనున్న యాత్ర తిరిగి చంద్రగిరి నియో జకవర్గానికి చెందిన రామచంద్రాపురం మండ లంలో కొనసాగుతుందని పార్టీ వర్గాలు ప్రకటించాయి.



'సాయిబాబాను చర్లపల్లికి తరలించండి'

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాజద్రోహం నేరం కింద నాగ్‌పూర్ అండా సెల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను వెంటనే హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించాలని ఆయన సతీమణి వసంత ప్రభు త్వాన్ని కోరారు. అంగవైకల్యంతో పాటు ఆయనకు కిడ్నీ సమస్యలు, కడుపులో కణుతులు పెరుగుతున్నాయని, అయినా జైలు అధికారులు వైద్య సహాయం అం దించడం లేదని ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి తీసుకెళ్లి మందులు, పుస్తకాలు కూడీ ఇవ్వకుండా మానసి కంగా, శారీరకంగా హింసిస్తున్నారని వసంత వాపోయారు. పరిస్థితి ఇలాగే కొన సాగితే ఏ క్షణంలో ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

నోడల్ అధికారుల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైకోర్టు కంప్యూటర్ కమిటీల ప్రథమ జాతీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు జిల్లా జడ్జి క్యాడర్‌కు చెందిన ఇద్దరు నోడల్ అధికారులను హైకోర్టు ఎంపిక చేసింది. లక్నోలోని జుడీషియల్ శిక్షణ, పరిశోధన సంస్థ (జేటీఆర్ఐ)లో 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే కంప్యూటర్ కమిటీల జాతీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు విజయవాడలోని 12వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి.వేణుగోపాలరావు ,రంగారెడ్డి జిల్లా ఎల్.బీ నగర్‌లోని 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంతకుమార్‌ను ఎంపిక చేసినట్లు ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏప్రిల్ 15న మోడల్ స్కూళ్ల ప్రవేశపరీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆరవ తరగతిలో చేరడానికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. అదే విధంగా 8 నుండి 10వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడానికి కూడా ప్రవేశ పరీక్షనిర్వహించబోతున్నారు. అన్ లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 23 నుండి వచ్చే నెల 16 వరకు అందచేయవలసి ఉంటుంది. ఏప్రిల్ 14 నుండి 15 వరకు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 15న (ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 నుండి 12 గంటల వరకు పరీక్షనిర్వహిస్తారు. 8 నుండి పదవ తరగతుల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుండి 4 వరకు ప్రవేశపరీక్షఉంటుంది. మే 16 నుండి 19వ తేదీ మధ్యలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంపికైన అభ్యర్థుల జాబితాలను ఖరారు చేస్తారు. మే 20 నుండి 25 వరకు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన, పాఠశాలలో ప్రవేశాలు ఉంటాయి. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేశారు.

నేడు గవర్నర్‌తో ఉన్నత విద్యామండలి సమావేశం

- ఉన్నత విద్యలో సంస్కరణలు వివరించనున్న అధికారులు
- వర్సిటీలలో అధ్యాపకుల భర్తీ
- పరిశోధనా రంగాలపై నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉన్నత విద్యలో తీసుకువస్తున్న మార్పులను వివరించేందుకు ఉన్నత విద్యామండలి ప్రతినిధి బృందం గురువారం గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో సమావేశం కానుంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పనితీరు, పరిశోధనా, అభివృద్ధి రంగాలకు కేటాయిస్తున్న నిధులు, సాధించిన ఫలితాలతో పాటు 2018 -19 విద్యా సంవత్సరంలో ఉన్నత, సాంకేతిక విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలతో కూడిన నివేదికను ఈ బృందం గవర్నర్‌కు అందజేయనుంది. ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆచార్య లింబాద్రి, ఆచార్య వేదుళ్ళ వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాసరావులు గవర్నర్‌ను కలువనున్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య, సాంకేతిక, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ కూడా గవర్నర్‌ను కలిసే ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉమ్మడి ప్రవేశపరీక్షల నిర్వహణ, ఆ తర్వాత జరిపే ప్రవేశాలు, వచ్చే విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయాల్లో తీసుకువస్తున్న మార్పులు తదితర అంశాలను గవర్నర్‌తో జరిగే భేటీలో చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తీసుకుంటున్న చర్యలు ఈ సందర్భంగా వివరిస్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈ ఖాళీలను భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి ఈ భర్తీ ప్రక్రియను పూర్తిచేసి తరగతులు ప్రారంభమైన రోజునుంచే వర్సిటీలలో అధ్యాపకులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్న హామీని ఈ ప్రతినిధి బృందం గవర్నర్‌కు చెప్పనుంది. ఉస్మానియా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరగవలసి ఉన్న జాతీయ సైన్స్ కాంగ్రెస్ మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీకి తరలివెళ్ళడానికి దారితీసిన పరిస్థితులను కూడా ఈ సందర్భంగా ఈ బృందం గవర్నర్‌కు వివరించే అవకాశం కనిపిస్తోంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం ఇంజనీరింగ్‌తో పాటు ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో చేపట్టే ప్రవేశాలపై కూడా గవర్నర్‌కు అందజేసే నివేదికలో ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం ఇక్కడి అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఉపకులపతుల సదస్సులో చర్చించిన అంశాలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలు, సాధించిన ఫలితాలపై కూడా ఈ బృందం గవర్నర్‌కు వివరించనుంది. రెండు రోజుల క్రితం ఉన్నత విద్యామండలి పాలకవర్గ సమావేశంలో చర్చించిన అంశాలను కూడా ఈ బృందం గవర్నర్‌కు వివరించే అవకాశం కనిపిస్తోంది.

ఉత్తమ్‌తో సర్దుకుపోదామా..!

- కలిసి పనిచేస్తేనే అధికారమంటున్న కాంగ్రెస్ సీనియర్లు
- టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కొనసాగిస్తూ హైకమాండ్ నిర్ణయం
- ఆ సీటు కోసం ఎదురుచూస్తున్న ఆశావహుల స్వరంలో మార్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆ పార్టీ సీనియర్లు సర్దుకు పోతారా..? లేక ఎవరిదారి వారిదే అన్నట్లుగా ఉం టుందా..? అనే అంశంపై తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎన్నికలు ఏడాదిన్నర కాలం ఉన్నందున నాయకత్వం బాధ్యతలు ఎవరికున్నా సర్దుకుపో దామనే అభిప్రాయంతో చాల మంది నేతలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ రథసారథిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కొనసా గిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఉత్తమ్ మార్పు ఖాయమనుకున్న సీనియర్ నేతలు మాత్రం ప్రస్తుతం మౌనాన్ని పాటిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవి మార్పు ఉంటుందని, ఆ పదవి కోసం చాల మంది నేతలు పోటిలో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే నాయకత్వ మార్పు అవసరమని పార్టీకి చెందిన ఒకరిద్దరూ సీనియర్లతో పాటు మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీ రాజగోపాల్‌రెడ్డి లాంటి నాయకులు బహటంగానే విమర్శలు చేశారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమించిన పార్టీ అసెంబ్లీ నియోజక వర్గాల ఇన్‌చార్జీలను తాము గుర్తించమంటూ రాజగో పాల్‌రెడ్డి విమర్శలు చేసిన సందర్భాలున్నాయి. అయితే పార్టీ హై కమాండ్ మాత్రం ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే టీ పీసీసీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. ఆశావాహుల్లో కొంత మార్పు వచ్చినట్లుగా కనిపిస్తోందని పార్టీ కి చెందిన కొంత మంది నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉత్తమ్ కుమార్‌రెడ్డిపైన నిత్యం అసమ్మతివాదిగా ఉండే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వరం మార్చడం ఇందుకు నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే.. విభేదాలను పక్కన పెట్టి నాయకులందరూ కలసి నడవాల్సిన అవసరరం ఉందని పార్టీకి చెందిన ఒక మాజీ ఎంపీ అభిప్రాయపడ్డారు.

పార్టీ ప్రయోజనాల మేరకు నాయకత్వ బాధ్యతలు ఎవరికున్నా సర్దుకుపోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తమ్‌కువమార్‌రెడ్డి కూడా పార్టీలోని సీనియర్లందరని కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందని పలువురు సీనియర్లు చెబుతున్నారు. అయితే టీ పీసీసీ చీఫ్‌గా ఉత్తమ్‌ను కొనసాగిస్తున్నట్లు హైకమాండ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సీనియర్ నేతలెవరూ ముందుకు రాకపోవడంపైన కూడా చర్చ జరుగుతోంది. ఎందుకంటే పార్టీ హై కమాండ్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఉంటాయనే అభిప్రాయంతో కొందరూ నేతలు మౌనంగా ఉంటున్నారని ప్రచారం జరుగుతోంది.



అనుమతిలేని లేఅవుట్లకు నో రిజిస్ట్రేషన్



(మొదటిపేజీ తరువాయి)

లేఅవుట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ నిలిపివేస్తే ఎలా ఉంటుందనే అంశంపైన ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీలో కూడా మంత్రివర్గ ఉపసం ఘం చర్చించింది. ఎలాంటి అనుమతి లేకుంటా లేఅవుట్లను చేస్తూ విచ్చలవిడిగా ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, దీనివల్ల సామాన్యులు ఇబ్బంది పడవలసి వస్తుందని సమావేశం అభిప్రా యపడింది. లేఅవుట్లకు అనుమతి ఉంటేనే ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తమయింది. ప్రస్తుతం జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో ఉన్నట్టుగానే పంచా యతీ పాలకవర్గ సమావేశాలకు హజరయ్యే సభ్యులకు సిట్టింగ్ ఛార్జీలు ఇవ్వాలనే అభిప్రాయం కూడా వ్యకమయింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా వరుసగా మూడు సార్లు పాలకవర్గ సమావేశాలకు గైర్హాజర్ అయిన వారిపై అనర్హత వేటు వేసే విషయంపై కూడా మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. పంచాయతీల్లో కో అప్షన్ సభ్యులను నియమించే అంశాన్ని పరిశీలిస్తున్న మంత్రివర్గ ఉపసంఘం ఇందులో ఎన్ఆర్ఐలకు, గ్రామంలో లేని వారికి కూడా అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చించారు. పంచాయతీలోని జనాభా ఆధారంగా ఇద్దరు ముగ్గురిని కూడా నామినేట్ చేసుకొనే అవకాశాలపై కమిటీ చర్చించింది.

ఇందులో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులకు అవకాశం కల్పించడం వల్ల గ్రామ అభివృద్ధికి వారి సహకారం ఉపయోగపడు తుందనే అభిప్రాయం వ్యక్తమ యింది. రెండు వందల చదరపు గజాలలోపు విస్తీర్ణంలో జీ ప్లస్ 2 ఎత్తులో నిర్మించే భవనాల అను మతులను గ్రామ పంచాయతీలో ఇస్తుండగా, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో అయితే మండ లాల్లోనూ, ఎంపీడీవో, తహసీల్దార్, ఈవో పీఆర్డీ, పంచాయతీరాజ్ ఏఈల నేతృత్వంలో కమిటీ ఏర్పా టు చేసి అనుమతించే అంశంపైన కూడా కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. భవన నిర్మాణా నికి హెచ్ఎండీఏ అనుమతించిన వారం రోజుల్లోనే పంచాయతీ క్లియరెన్స్ ఇవ్వాలని, లేని పక్షంలో అది అనుమతిచ్చినట్లుగానే భావించాల్సి ఉంటుం దనే విధంగా చట్టంలో పొందుపరిచే అంశం కూడా ఉపసంఘం సమావేశంలో చర్చకు వచ్చింది.

పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీల నుండి అనుమతి తీసుకోవలసిన అవసరం లేకుం డా చట్టంలో పొందుపరిచే అంశంపైనా చర్చించారు.

సర్పంచులకు విస్తృత అధికారాలు కల్పించేదిశగా కొత్త చట్టంలో మార్పుల చేయాలని భావి స్తున్న మంత్రివర్గ ఉపసంఘం ఆదే సమయంలో ప్రజల కోసం ప్రత్యేకంగా హక్కుల జాబితాను కూడా చట్టంలో పొందుపరిచే యోచన చేస్తుంది. ప్రధానంగా డంపింగ్ యార్డులు, వైకుంఠ దా మాలు, పారిశుద్ధ్యం లాంటివి ప్రజల హక్కులుగా చట్టంలో పొందుపరిచే అంశాన్ని చర్చించారు. గురువారం కూడా మంత్రివర్గ ఉప సంఘం మరోసారి సమావేశం కానుంది.

డీలిమిటేషన్‌పై కేంద్ర కేబినెట్ నోట్

(మొదటిపేజీ తరువాయి)

పునర్ విభజనపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలు సూచనలు కేంద్రం నుంచి రాష్ట్రప్రభుత్వానికి అందాయి. నియోజక వర్గాల పునర్ విభజనకు సంబంధించి ఇప్పటికే కేంద్ర కేబినెట్ ప్రత్యేక నోట్‌ను రూపొందిస్తుంది. అందులో భాగంగా హోంమంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు సమాచారం. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందడంతో అప్రమత్తమైంది. తెలుగు రాష్ట్రాల్లోని అసెంబ్లీ సెగ్మెంట్ల డీలిమిటేషన్స్‌పై ఇప్పటికే ప్రాథమికంగా అధ్యయనం చేశారు. సెక్రటేరియట్ సీనియర్ అధికారి ఒకరు ఈ అంశాన్ని కీలకంగా పరిశీలిస్తున్నారు. కొత్తగా ఎస్‌సీ అసెంబ్లీ నియోజక వర్గాల ఏర్పాటుతో పాటు గరిష్టంగా 225 అసెంబ్లీ నియోజక వర్గాలకు లోబడి చర్యలు తీసుకోవాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. రెండు లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొండలు, నదులను కారణంగా చూపి, ఏదైనా అసెంబ్లీ నియోజక వర్గాన్ని విభజించరాదంటున్నారు. నియోజక వర్గాల పునర్ విభజనకు సంబంధించి అధ్యయనం చేసి, విచారించి, నివేదిక రూపొందించేందుకు కేంద్రం మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేయదల్చిన అసెంబ్లీ సెగ్మెంట్ల కోసం ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పర్యటించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, నియోజక వర్గాల పునర్ విభజన కోసం ఈ కమిటీ అవసరమైన మార్గదర్శకాలను రూపొందించి కేంద్రానికి నివేదిస్తుంది. ఈ మార్గదర్శకాల తయారీ ప్రక్రియ ఫిబ్రవరి 2వ తేదీన కల్లా పూర్తవుతుందంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందంటున్నారు. గుంటూరులో రెండు, విజయవాడ నగరంలో రెండు కంటే ఎక్కువ నియోజక వర్గాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కొత్త నియోజక వర్గాలను ప్రకటించే ముందు కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో పర్యటించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటుంది. ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త నియోజవర్గాల అవసరాన్ని కమిటీ ముందు ఉంచేందుకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయమై ఫిబ్రవరి 2వ తేదీ నుంచి కేడర్‌తో పరస్పర చర్చించేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త నియోజకవర్గాల ఏర్పాటుపై కమిటీకి వివరించాలని టీడీపీ పార్టీ శ్రేణులు సర్వం సిద్ధమవుతున్నాయి.

కరెంట్ చీకటి ఒప్పందం



టీఆర్ఎస్ సవాల్‌కు నేను సిద్ధం

- జెన్‌కో సంస్థపై రూ.లక్షకోట్ల భారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలం గాణ ప్రభుత్వం నిర్మించబోయే విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం ఒప్పందం లోనూ పెద్ద ఎత్తున అవినీతి దాగుందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిరంత విద్యుత్ పేరుతో ప్రైవేట్ ప్రాజెక్టులతో ప్రభుత్వం చీకటి ఒప్పందం కుదుర్చుకున్నదని ఆయన ఆరోపించారు. నూతన పవర్ ప్రాజెక్టు లు నిర్మించొద్దని, దేశంలో మిగులు విద్యుత్ చాల ఉందని చెప్పినా.. రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాజెక్టుల నిర్మాణ ంపైన ఎందుకు దృష్టి పెట్టిందో చెప్పా లని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షు డు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయంతో జెన్‌కో సంస్థపై దాదాపు రూ. 94 వేల కోట్ల భారం పడుతోందన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టుకు నూతన టెక్నాలజీగా ఉన్న సూపర్ క్రిటికల్ యంత్రాలను కొనుగోలు చేయాలని కేంద్రం సూచించినా.. రాష్ట్ర ప్రభుత్వం ఆవేమి పట్టించుకోకుండా నాసిరకం (సబ్ క్రిటికల్) యంత్రాలను కొనుగోలు చేయడంలో ఆంతర్యమేమిటిని ఆయన ప్రశ్నించారు.

విద్యుత్ వెలుగుల వెనుక దాగిఉన్న చీకటి ఒప్పందంపై నేను చేసిన విమర్శలు నిరూపించడానికి సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎక్కడి రమ్మంటే అక్కడికి వస్తాను అని రేవంత్‌రెడ్డి తెలిపారు. టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ కోరిన విధంగా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పక్షాన తనతో పాటు ఎమ్మెల్యే సంపత్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్‌కుమార్ వస్తామన్నారు. వేదిక ప్రగతి భవనా..? లేక మరో చోటా రావడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అక్రమ వ్యాపారాలు, చీకటి ఒప్పందాలు, అబద్ధపు ప్రచారాలన్నింటిని బయటపెడుతామన్నారు. నిజాన్ని బయటపెట్టాక టీఆర్ఎస్ నాయకులు ముక్కు నేలకు రాయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఒక వేళ తాము మాట్లాడింది తప్పని తేలితే ముక్కు నేలకు రాయడానికి సిద్ధమేనని తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం, ఖర్చుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, లేదంటే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం బెల్ కంపెనీతో 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ. 7 వేల కోట్లకు మూడేళ్ల క్రితమే ఒప్పందం జరిగిందని రూ. వెయ్యి కోట్లు అడ్వాన్స్‌గా కేటాయించారని,18 నెలల్లో పూర్తి చేయాలని ఉన్నప్పటికి 42 నెలలు గడిచినా ఎక్క డ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. నిషేధిత యంత్రాల కొనుగోలు వల్ల ఎక్కువ ఖర్చు తక్కువ కరెంటు ఉత్పత్తి అవుతోం దన్నారు. సంవత్సరానికి రూ. 500 కోట్ల అదనపు భారం పడుతోందని, 25 సంవత్సరాల వరకు రూ. 12,500 కోట్ల భారం పడుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. యూనిట్ విద్యుత్ రూ.2.20 పైసలు ఉంటే తెలంగాణ ప్రభుత్వం రూ. నాలు గున్నర చెల్లించి ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్న దని ఆయన తెలిపారు. యాదాద్రి పవర్ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూ సేకరణలోనూ అవినీతి జరిగిందన్నారు.

దమ్ముంటే.. కరెంట్‌పై చర్చకు రా



ఫేస్‌టు ఫేస్..

- ఎవరివి దొంగలెక్కలో తేల్చుకుందాం: రేవంత్‌కు సవాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరాపై గోబెల్స్ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి దమ్ముంటే బహిరంగచర్చకు రావాలి.. ఎవరివి దొంగలెక్కలో తేల్చుకుందాం అంటూ టిఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ సవాల్ విసిరారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడిన ఆయన రేవంత్‌తో ఫేస్ టు ఫేస్ చర్చకు సిద్ధమన్నారు. బహిరంగ చర్చ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లోనా? బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోనా? లేక అమరవీరుల స్థూపం వద్దా? స్థలం.. సమయం నువ్వే చెప్పు? చర్చకు నువ్వొక్కడివే వస్తావో.. ఉత్తమ్, జానారెడ్డి, మాజీ విద్యుత్ మంత్రి షబ్బీర్ అలీని వెంట తెచ్చుకుంటవో నీ ఇష్టం. మా పార్టీ నుండి నేను.. పల్లా రాజేశ్వరరెడ్డి, భానుప్రసాద్‌లు వస్తం. విద్యుత్‌పై నువ్వు చెప్పే లెక్కలు నిజమైతే ముక్కు నేలకు రాస్తం. మీ లెక్కలు అబద్దమైతే.. మీరు ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి అంటూ సవాల్ ప్రకటించారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో గాంధీభవన్ గోబెల్స్ భవన్‌గా మారిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించడంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తున్నదని, ఒక్క కాంగ్రెస్ నాయకుల కండ్లలో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. కడుపుమంటతో కుమలిపోతున్నారన్నారు. 2014జూన్ 2నాటికి తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి 6,574మెగావాట్లు అని, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి 14,913.36 మెగావాట్లు అని సుమన్ వెల్లడించారు. విద్యుత్ ఘనత తమదేనని కాంగ్రెస్ నాయకులు చెప్పు కోవడం సిగ్గుచేటన్నారు. భూపాలపల్లి, జైపూర్ ప్రాజెక్టులను వెంటబడి పట్టుబట్టి పూర్తిచేయించడమే గాక మరో సింగరేణి యూనిట్ కేంద్రానికి కూడా శంఖుస్థాపన చేయించారన్నారు. 240 మెగా వాట్ల లోయర్ జూరాల, 120మెగావాట్ల పులిచింతల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామన్నారు. ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు 24గంటల విద్యుత్ ఇస్తున్నారని రేవంత్ చేసిన ఆరోపణ అర్థరహితమన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కేవలం రెండు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు మాత్రమే చేసుకుం దన్నారు. ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇచ్చి కాంగ్రెస్ నాయకులకు దిమ్మతిరిగే షాక్‌నిచ్చామని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి నీళ్ళలో ముంచుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో రోజుకు 6గంటలు, బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్‌లో 16గంటలకు మించి కరెంట్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నారు.

కౌలురైతులకు పెట్టుబడి ఇవ్వాలి !



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ఇచ్చే రూ. 4 వేలు కౌలు రైతులకు వర్తింప చేయాలని సీఎల్పీ ఉపనేత టి. జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ పెట్టుబడి పథకం రబీ నుంచే అమలు చేయాలన్నారు. మంత్రి హరీశ్‌రావు టీఆర్ఎస్‌ను మార్కెట్ చేయడానికి బాగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టేదారు రైతులు, కౌలు రైతులు అనే తేడాలేకుండా సాగు చేసే ప్రతి రైతుకు ఈ పథకం వర్తింప చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతులకు బ్యాంక్‌ల నుంచి పెట్టుబడులు కింద రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఏ పంట ఎప్పుడేస్తారో వ్యవసాయ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి తెలియకపోవడం శోచనీయమన్నారు. మొక్కజొన్న పంట చేతికొచ్చిన తర్వాత పసుపును తీసుకుంటామన్నారు. సీఎం చంద్రశేఖర్‌రావు స్క్రిప్ట్‌రాసిస్తే మంత్రి పోచారం అదే చదువుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రాజెక్టులపై కాంగ్రెస్ కుట్రలు!



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా జరగడానికి నిద్రాహారాలు మాని పనిచేస్తున్న మంత్రి హరీష్‌రావుపై కాంగ్రెస్ నాయకులు పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని, పుట్టగతులుండవనే ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని టిఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మండిపడ్డారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే ఆర్‌డిఎస్‌పై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఓట్ల కోసం ప్రాజెక్టులు చేపట్టి వాటిని పూర్తిచేయకుండా మోసం చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిందన్నారు. నోళ్ళు తెరిచిన బీళ్ళను తడిపి పాలమూరుకు పచ్చదనం తీసుకొచ్చిన ఘనత టిఆర్ఎస్‌దేనన్నారు.

టీఆర్ఎస్‌లోని మాదిగ ప్రజా ప్రతినిధుల్లారా

జాతి ద్రోహులుగా మిగిలిపోవద్దు

- నేటినుంచి 17వరకు తెలుగు రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలు: ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మార్పీఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న నిర్బంధాన్ని ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగాటి సత్యం మాదిగ హెచ్చరించారు. మంద కృష్ణమాదిగకు బెయిల్ రాకుండా కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం ఆయన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు మంద కుమార్, తీగల ప్రదీప్‌గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేకతను లెక్క చేయకుండా పోలీసులతో ఉద్యమాలను అణిచేయాలని చూస్తున్న ప్రభుత్వ తీరును మాదిగల గమనిసున్నారని ఆయన పేర్కొన్నారు. మాదిగ ఎమ్మెల్యేలు, ఎంపీలు జాతీ ద్రోహులుగా ఆత్మగౌరవం లేదని, వారు జాతి ద్రోహులుగా మిగిలిపోక తప్పదన్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాదిగలకు, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మొదటి నుంచి మోసం చేస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. గురు వారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం, 12న డప్పులతో నిరసన, 13న మంద కృష్ణమాదిగ కౌటట్లను గ్రామ, మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసి అరెస్టు, జైలుకు పంపించిన తీరును వివరించనున్నట్లు తెలిపారు. 14న అఖిలపక్ష సమావేశాలు. 15, 16, 17 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామ స్థాయిలోనూ కోటి సంతకాల సేకరణ చేయనున్నట్లు వివరించారు.

మాదిగలపై ప్రభుత్వం కుట్ర!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలపైన కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ పోలిట్‌బ్యూరో సభ్యుడు వనం నరసింహ అన్నారు. భవిష్యత్‌లో టీఆర్ఎస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లా డారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 23 ఏళ్లుగా శాంతి యుతంగా పోరాటం చేస్తున్న మంద కృష్ణమాదిగతో వందలాది మంది ఎమ్మార్పీఎస్ శ్రేణులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఆయన విమర్శించారు.

ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న ప్రభుత్వం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు గళంవిప్పే ప్రయత్నంచేస్తే ప్రభుత్వం ఆ గొంతును నులిమి వేయాలని ప్రయత్నిస్తోందని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ దుయ్యబట్టారు. వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేస్తే జైలులో పెట్టారని, ఉస్మానియాలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పరామ ర్శించేందుకు వెళ్ళిన తెదేపా నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి అక్రమ కేసు బనాయించి జైలులో పెట్టారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అనేక అంశాలపై చర్చించేందుకు గవర్నర్ కూడా సమయం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. తెదేపా కార్యకర్తల మూడవ బ్యాచ్ శిక్షణా తరగతులను బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, తెదేపా నాయకులను అడ్డదారిలో తెరాస తమవైపు తిప్పుకుందని, 2019 ఎన్నికల్లో తెరాసకు గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. మహిళలకు మంత్రి వర్గంలో అవకాశం కల్పించకుండా వారిని అవమానిస్తున్న కేసీఆర్ బడ్జెట్ పేరుతో మోసం చేసేందుకు మరో కుట్రకు పథకం వేశారన్నారు. రానున్న స్థానిక, శాసనసభ, పార్ల మెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని, శిక్షణకు వచ్చిన కార్యకర్తల సూచ నలను పార్టీ స్వీకరిస్తుందని రమణ చెప్పారు.మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రివర్గంలో మాల, మాదిగలకు, మహిళలకు స్థానం లేదని, ప్రభుత్వంలో పేదలకు భాగస్వామ్యం లేదని స్పష్టమవుతోందన్నారు. ఈ విలేకరుల సమా వేశంలో రావుల చంద్రశేఖరరెడ్డి, జాతీయ పార్టీ ప్రధా న కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, తెలుగు యువత అధ్యక్షుడు టి.వీరేందర్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

బీసీలపై కపట ప్రేమ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో బిసిలపై అమిత ప్రేమ ఉన్నట్లు టిఆర్ఎస్ ప్రభుత్వం నటిస్తుందని, బిసిల కోసం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడం లేదని కేంద్ర మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎంపి బండారు దత్తాత్రేయ అన్నారు. నాగోల్‌లో బుధవారం బిజెపి ఓబిసి మోర్చ ఆధ్వర్యంలో జరిగిన బిసి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అతి పేద కుటుంబంలో నుంచి ఎదిగి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోడీకి బిసిల బాధలు తెలుసునని, అందుకే పలు సంక్షేమ, అభివృద్ధి, రాయితీ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బిసి కమిషన్‌కు చట్టబద్ధత కల్పించారన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే బర్రెలు, గొర్రెలు, సబ్సిడీ ట్రాక్టర్లు లాంటి పలు పథకాలను కేంద్రం అమలు చేస్తోందని, ఇవే కాకుండా బిసిలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు, పరిశ్రమల ఏర్పాటుకు గ్యారంటీ లేని రుణాలు తదితర పథకాలెన్నో ప్రవేశపెట్టారన్నారు. కేవలం బర్రెలు, గొర్రెలు పథకాన్ని తన పథకమంటూ ప్రచారం చేసుకుంటూ బిసిలను ఇంకా కుల వృత్తులకే పరిమితం చేయాలనుకుంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలను వంచించేందుకే కొత్త చట్టం తీసుకు రావాలని టిఆర్ఎస్ ప్రభుత్వం యోచిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. దేశాన్ని 70 ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ బిసిలను ఎప్పుడూ పట్టించుకోలేదని, బిసి వ్యక్తి ప్రధాని అయితే జీర్ణించుకోలేకపోతుందన్నారు. చిన్న రాష్ట్రంలో బిసిలకు న్యాయం జరుగుతుందని భావించావని, అయితే టిఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలతో అన్యాయం పెరిగిందన్నారు.

ఏడాదిలోగా 9 జిల్లాల్లో సమీకృత పోలీసు కేంద్రాలు

పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఎండీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం జిల్లా కేంద్ర కార్యాలయాల నిర్మాణాలకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇందుకోసం ఏకంగా రూ. 375 కోట్లను కేటాయించి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు తోడ్పాటును అందిస్తోంది. తెలంగాణలోని పూర్వపు 13 జిల్లాలకు ఎస్‌పి కార్యాలయాలుండగా, మిగతా కార్యాలయాలను రానున్న జనవరి మాసంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలను రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు సిద్ధం చేసింది. కొత్తగా నిర్మించనున్న కేంద్ర కార్యాలయాలు సువిశాలంగా ఉండేందుకు కనీసం 25 ఎకరాల స్థలంలో నిర్మించాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా భూ సేకరణ జరుపుతోంది. ఇందులో ఇప్పటికే పలు జిల్లాలలో స్థల సేకరణ పూర్తవగా కొన్ని జిల్లాలలో సేకరణ ప్రక్రియను ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 375 కోట్లతో సిద్ధిపేట, రామగుండం పోలీసు కమిషనరేట్లతో పాటు నిర్మల్, కొమురం భీం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, కొత్తగూడెం, సూర్యపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల, మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలలో ఎస్‌పి కార్యాలయాలను నిర్మించే పనులలో వేగం పెరిగింది. సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌కు స్థలసేకరణ పూర్తయినప్పటికీ జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కనే సిపి కార్యాలయం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం కొంత స్థలం సేకరించాల్సి ఉంది.

మెదక్ ఎస్‌పి కార్యాలయ స్థలం కోసం అధికారుల పరిశీలన మొదలైంది. వీలైనంత తొందరలో స్థలాన్ని సేకరించి హౌసింగ్ బోర్డుకు అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 25 ఎకరాల స్థలంలో సమీకృత జిల్లా పోలీసు కేంద్రాలను నిర్మించేందుకు పోలీసు హౌసింగ్ బోర్డు అధికారులు భవన నిర్మాణ నమూనాలను సిద్ధం చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, పరేడ్ గ్రౌండ్, రెండు బ్యారక్‌లు, ఎస్‌పి నివాసం, క్యాంప్ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌పి కార్యాలయాల కంటే నూతనంగా నిర్మించనున్న కార్యాలయాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లారెడ్డి వివరించారు.



ఇస్రో చైర్మన్‌గా శివన్

- 9వ సారథిగా నియామకం
- ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహ ప్రయోగంలో తెరవెనుక కీలక పాత్ర

ప్రభన్యూస్ బ్యూరో, నెల్లూరు: భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) నూతన చైర్మన్‌గా డాక్టర్ కె. శివన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇస్రో చైర్మన్‌గా సేవలందిస్తున్న ఏఎస్ కిరణ్‌కుమార్ మూడేళ్ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో విక్రమ సారాభాయి స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న కె. శివన్‌ను ఇస్రో నూతన చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర అంతరిక్ష పరిశోధనా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగనున్నారు. అంతరిక్ష ప్రయోగ రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ ఇప్పటికే ఆ రంగంలో అగ్రస్థానానికి చేరుకున్న ఇస్రోకు 9వ చైర్మన్‌గా నియమితులైన శివన్ 1982 నుంచి ఇస్రోకు సేవలందిస్తూ అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన ఆయన గత ఏడాది ఇస్రో ఒకే రాకెట్‌లో 104 ఉప గ్రహాలను విజయవంతంగా ప్రయో గించిన ప్రతిష్ఠాత్మ కమైన ఆ ప్రయోగం విజయవంతంలోనూ, తెరవెనుక ఈయన తనవంతు పాత్ర పోషించారు. మిషన్ రూప కల్పనలోనూ, రాకెట్ గమ్యాన్ని, సమయాన్ని నిర్దేశించడంలోనూ ఈయన దిట్ట. మద్రాసు యూని వర్శిటీ ఆఫ్ టెక్నాలజీలో 1980లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన శివన్ బెంగుళూరు ఐఐఎస్‌టీలో మాస్టర్ ఇంజనీరింగ్ అగ్రస్థానంలో ఉత్తీర్ణత సాధించారు. ఓ వైపు 1982 నుంచి ఇస్రోకు సేవలందిస్తూనే మరో వైపు అంతరిక్ష ప్రయో గాల్లో ఎప్పటికప్పుడు నైపుణ్యతను సాధించేందుకు ఆయన తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే 2006లో ముంబాయి ఐఐటీలో పీహెచ్‌డీ కూడా పూర్తిచేశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గతంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ ఆఫ్ సైన్స్ సత్యభామ యూనివర్శిటీ చెన్నై నుంచి డాక్టరేట్‌ను కూడా అందించింది. అలాకే 2014లో విక్రమ సారాభాయి అవార్డును కూడా ప్రకటించింది.

ఇస్రో చైర్మన్‌లు వీరే ..

1. విక్రమ్ సారాభాయి (1963 -1971)
2. ఎంజీకే (1971 -1972)
3. సతీష్‌ధావన్ (1972- 1984)
4. రామచంద్రన్ (1984-1994)
5. కస్తూరి రంగన్ (1994-2003)
6. జీ. మాధవన్ నాయర్ (2003-2009)
7. కె. రాధాకృష్ణన్ (2009-2014)
8. ఏఎస్ కిరణ్‌కుమార్ (2014-2018)
9. డాక్టర్ కె. శివన్ ..

పీఎస్ఎల్‌వీ -సీ40 ప్రయోగానికి సర్వం సిద్ధం

సూళ్లూరుపేట, ప్రభన్యూస్: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) సెంటర్ రెండవ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ -సీ40 ప్రయో గానికి సర్వం సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం షార్ లోని బ్రహ్మప్రకాష్ హాల్లో ఎంఆర్ఆర్ సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో రాకెట్‌కు సంబందించి నాలుగు దశలు అనుసంధానం పూర్తిచేసి తుది విడత పరీక్షలు నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథ రైజేషన్ బోర్డుకు అప్పగించారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో మరో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రయోగానికి సంబంధించి గురువారం ఉదయం 5.25గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కౌంట్‌డౌన్ ప్రక్రియ 28గంటలు జరుగనుంది. శుక్రవారం ఉదయం 9.28గంటలకు ప్రయోగం నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. ఈ రాకెట్ ద్వారా కార్టోశాట్ -2ఈతో పాటు ఒక మైక్రోశాట్, ఒక నానోశాటిలైట్‌లను రోదసిలోకి పంపనున్నారు. వీటితో పాటు అమెరి కా, కెనడా, కొరియా, ఫిన్‌ల్యాండ్, యుకె దేశాలకు చెందిన 28 మైక్రో నానో శాటిలైట్‌లను రోదసిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు.

నిరంతర విద్యుత్‌తో.. చిన్న పరిశ్రమలకు ఊరట

వ్యాపారులపై వేధింపులు లేవు: మంత్రి ఈటల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాతో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఎంతో ఊరట కలిగిస్తుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ ఇచ్చి అన్ని వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. గతంలో విద్యుత్ కోతలతో జనరేటర్లు పెట్టి పరిశ్రమలు నడిపేవారని, దాంతో భారీగా ఉత్పత్తి వ్యయం పెరిగేదని చెప్పారు. నిరంతర విద్యుత్‌తో ఉత్పత్తి వ్యయం తగ్గడమేగాక ఉత్పత్తులు భారీగా పెరిగి లాభాలు కూడా గణనీయంగా పెంచుకునే అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను బుధవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తోందని అన్నారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు మరింత ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి చెప్పారు. గృహ వినియోగం, వ్యవసాయం, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందిస్తున్నామని, ఒక లైన్‌లో విద్యుత్ సరఫరా ఆగిపోతే మరో లైన్ నుంచి సరఫరా చేస్తున్నారని, ఇది ఏ ఒక్కరికి కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తుందని ఈటల చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కిలోమీటరుకు రూ.5 ఖర్చుపెట్టి విద్యుత్ లైన్లు వేసుకునే వారని, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తోందని ఆయన చెప్పారు.తెలంగాణలో వ్యాపార, వాణిజ్య వర్గాలపై ఎలాంటి వేధింపులు లేవని, రాజకీయ విరాళాల వసూలుకు అవకాశమే లేదని మంత్రి చెప్పారు. వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తెస్తే పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు.

దీర్ఘకాలికంగా వ్యాపారంచేసే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ అడుగు వేయాలని, ప్రతి లావాదేవీని ఆలోచించి చేస్తే లాభాలు ఆర్జించడంతో పాటు పదిమందికి ఉపాధి కల్పించిన వారవుతారని ఆయన అన్నారు. కాటన్ మిల్లులు వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడ్డాయని, వాటికి ముడి సరుకు అందించే రైతు ప్రయోజనాలను కూడా పరిరక్షించాలని సూచించారు. కంపెనీ అభివృద్ధికి రక్తాన్ని స్వేతంగా మార్చి అహర్నిశలు కష్టించే కార్మికుడి జీవితం గురించి కూడా వ్యాపార, వాణిజ్యవేత్తలు ఆలోచించాలని ఈటల కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కె.రమేష్, ఎన్.లబోటి కూడా పాల్గొన్నారు.

వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

- తొలిదశలో వాణిజ్య వాహనాలకు
- రవాణా, పోలీసుల పరిశీలనలో ప్రతిపాదనలు
- ప్రమాదాల నివారణకు తరుణోపాయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వాహనా లన్నింటికీ జీపీఎస్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. తొలుత వాణిజ్య వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి చేయ డానికి చర్యలు తీసుకుంటుంది. ఆ తర్వాత వ్యక్తిగత వాహనాలకు జిపిఎస్‌ను ఏర్పాటు చేసుకొనే విధంగా వాహన దారులను చైతన్యవంతం చేయాలని యోచిస్తుంది. రోడ్డు ప్రమాదాలు పెరిగి పోవడం పట్ల ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తుంది. బ్లాక్ స్పాట్లను గుర్తించి రోడ్లను మెరుగుపర్చాలని ఆదేశించింది. వాహన దారుల్లో కూడా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించే పద్దతులను కఠినతరం చేయాలని పోలీసు, రవాణా శాఖలకు సూచించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ ఉపసంఘంలో ఈ విషయం పై చర్చించారు. వేగనియంత్రణ, ప్రమాదాల నివారణ, ప్రమాదాలకు పాల్పడి తప్పించుకొనే వారిని గుర్తించడంలో జీపీఎస్ ఎంతగానో దోహదపడు తుందని రవాణా అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే రవాణా, పోలీసు అధికారులు ఈ అంశంపై ప్రాథమికంగా చర్చలు జరిపారు. త్వరలోనే మరో సమావేశం జరగ బోతుందని ఉన్నతాదికారి ఒకరు తెలిపారు. 2016లో 22,811 రోడ్డు ప్రమాదాల్లో 6.606 మంది మృతి చెందారు. మరో 24,217 మంది క్షతగాత్రులయ్యారు. 2017 జనవరి నుండి నవంబర్ వరకు 20,378 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 5,963 మంది మృతి చెందారు. మరో 21,697 మంది క్షతగాత్రులయ్యారు. ఈ పరిస్థితిని అధిగమించాలని ప్రభుత్వం భావిం చింది. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది.

రోడ్డు భద్రతకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని యోచిస్తుంది. అది సాధ్యం కాని పక్షంలో రోడ్లు భవనాల శాఖలో ఒక విభాగంగా ఏర్పాటు చేసి అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చాలని భావిస్తుంది. మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులు అందిన అనంతరం కొన్ని కీలకమైన చర్యలకు ఆదేశించే అవకాశం ఉంది. అందులో ప్రతి వాహనానికి జీపీఎస్ తప్పనిసరి అనే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలపడానికి అవకాశం ఉందని రవాణా అధికారులు తెలిపారు. వాణిజ్య వాహనాలైన ఆటోలు, బస్సులు, స్కూల్ బస్సులు, లారీలకు జీపీఎస్ తప్పనిసరి అని అంటున్నారు.



అతివేగం, ప్రమాదకరమలుపులు, రోడ్డు ఇంజనీరింగ్ సమస్యలను అధిగమించడం కూడా మరో ప్రధానమైన అంశం అని పేర్కొన్నారు. తెలంగాణలో కోటికి పైగా వాహనాలు ఉన్నాయి. అందులో ఆటో రిక్షాలు 3,73,581, కాంట్రాక్టు క్యారేజీ వాహనాలు 7,824, విద్యా సంస్థలకు చెందిన వాహనాలు 24,015, సరకు రవాణా వాహనాలు 4,12,428, మ్యాక్స్ క్యాబ్‌లు 26,328, మోటారు క్యాబ్‌లు 1,10,314, మోటారు కార్లు 12,28,180, మోటారు సైకిళ్లు 76,73,688, ఇతర వాహనాలు 55.902, ప్రైవేటు వాహనాలు 2677, స్టేజ్ క్యారేజీ వాహనాలు 18,344, ట్రాక్టర్లు, ట్రైలర్లు 3,90,856 వరకు ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా ప్రమాదాలకు కారణం అవుతున్న వాహనాలను గుర్తించి తొలి దశలో జీపీఎస్ అమర్చుకునే విధంగా యజమానులను ప్రోత్సహించ డం జరుగుతుందని అధికారులు తెలియచేశారు.

వాహన తయారీ దశలోనే జీపీఎస్ అమర్చే విధంగా సంబంధిత కంపెనీలకు సూచించే విషయం కూడా పరిశీలనలో ఉందన్నారు. వాహనాలకు ఎయిర్ బ్యాగ్‌లను తప్పనిసరి చేసినట్టుగానే జీపీఎస్‌ను తప్పనిసరి చేయవలసి ఉందని రవాణా అధికారులు భావిస్తున్నారు. వాణిజ్య వాహనాలకు జీపీఎస్ లేదని తెలిపారు. ఆటోలు, బస్సులు, విద్యాసంస్థల వాహ నాలు, సరకు రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి చేయవలసి ఉంటుందన్నారు.

శరవేగంగా కేటీపీఎస్ ఏడో దశ పనులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేటీపీఎస్ ఏడో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జెన్‌కో సీఎండి డి ప్రభాకరరావు చెప్పారు. 800 మెగావాట్ల సామర్థ్యం ఈ సంస్థకు ఉందన్నారు. కేటీపీఎస్ పనుల్లో భాగంగా 940 ఎంవిఎ సామర్థ్యం ఉన్న జనరేటర్‌ను విజయ వంతంగా అమర్చినట్లు చెప్పారు. బుధవారం విద్యుత్ సౌధ నుంచి ఆయన పనులను పర్యవేక్షించారు. కీలకమైన ఈ జనరేటర్ బిగించడం ద్వారా విద్యుదుత్పత్తికి తుది ఏర్పాట్లు జరగనున్నాయని పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ రాధాకృష్ణక్షేత్ర స్థాయిలోపనులను పర్యవేక్షించారు.

ఈ ఏడాది నుంచే 2021 జనగణన పనులు

న్యూఢిల్లీ: యావత్ దేశంలో 130 కోట్ల మంది జనాభాకు వర్తించే 2012 జనగణన పనులు ఈ సంవత్సరం ప్రారంభమవుతాయని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఇక్కడ జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో 2021లో చేపట్టాల్సిన జనగణనకు అవసరమైన మార్గ సూచీని చర్చించారు. 2021 జనగణనకు సంబం ధించి 2018లో చేపట్టాల్సిన కార్యకలాపాల గురించి సమావేశం చర్చించిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. 2011 భారత జనగణన నివేదికల ప్రకారం భారతదేశ జనాభా 1,21,08,54,977.

బాలల హక్కుల కమిటీకి కసరత్తు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటుకై ప్రభుత్వం ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖమంత్రి, సభ్యులుగా హైకోర్టు చీఫ్ జస్టిస్ నామినేట్ చేసిన, శాసనసభా పతి నామినేట్ చేసిన వ్యక్తి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.



అనంతను దత్తత తీసుకుంటా

- ఐటీ హబ్‌గా మారుస్తా: నారా లోకేష్

పెనుకొండ, ప్రభన్యూస్: అనంతపురము జిల్లాను సస్యశ్యామలంగా మారుస్తామని, అనంతపురము జిల్లా అంటే మా తాత అయిన నందమూరి తారక రామారావుకు ఎంతో అభిమాని అందుకే అనంతపురము జిల్లాను పారిశ్రామికంగా, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతానని, వచ్చే 2019 ఎన్నికలలో టిడిపి ఘన విజయం సాధిస్తుందని మంత్రి నారా లోకేష్ జోస్యం చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురము జిల్లా పెనుకొండకు విచ్చేశారు. అనంతరం శెట్టిపల్లి బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెట్రోల్ బంక్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా రూపురేఖలు మారుస్తానన్నారు. త్వరలో అనంతపురము జిల్లాను దత్తత తీసుకుంటానని అన్ని రంగాలలో అభివృద్ధిలో వుండేటట్లు చూస్తానన్నారు. శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి సంబంధించి పెనుకొండకు ఎటువంటి సమస్య లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధు లను రూ.5.02 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో అధికారుల చుట్టు ప్రజలు తిరిగేవారని అయితే ప్రస్తుతం ఇప్పుడు ప్రజల చుట్టు అధికారులు తిరుగుతున్నారన్నారు. ప్రజాసమస్యలను పరిష్క రించ డానికి 1100కు తక్షణమే ఫోన్ చేసే సదుపాయాన్ని కల్పించిం దన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భారతదేశంలో ఎవరు చేయని విధంగా రుణ మాఫీ చేసి న ఘనత ఆయనకే దక్కిందన్నారు. 2022 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లేకుండా చేయడానికి చంద్రబాబు ఇప్పటికే 18 గంటలు పని చేస్తున్నారు.

అభివృద్ధిలో మనమే ముందు

- జాతీయ స్థాయికి రెట్టింపు వేగం
- మెరుగ్గా ఉపాధి అవకాశాలు
- ప్రజల ఆదాయం పెంపునకు చర్యలు
- టెక్నాలజీతో వ్యవసాయం
- అన్ని జిల్లాల్లోనూ రేవుల అభివృద్ధి
- తూర్పుగోదావరి జిల్లా జన్మభూమి గ్రామసభలో ఏపీ సీఎం చంద్రబాబు

ముమ్మిడివరం (తూర్పుగోదావరి), ప్రభ న్యూస్ బ్యూరో: దేశం అన్నిరంగాల్లో దూసుకు పోతోంది. అభివృద్ధిలో ముందంజలో ఉంది. అయితే జాతీయ స్థాయితో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ మరింత వేగంగా ముం దుకురుకుతోందంటూ ముఖ్య మంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2015- 16లో జాతీయ వృద్ధి సగటు 7.9శాతం నమోదైతే ఆ ఏడాది ఆంధ్రప్రదేశ్ 10.95శాతం వృద్ధి నమోదు చేసింది. 2016-17లో జాతీయ వృద్దిరేటు 7.12శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 11.17గా ఉంది. 2017-18తొలి అర్ధభాగంలో జాతీయ వృద్ధి 5.8శాతం ఉంటే రాష్ట్రం 11.37శాతం వృద్ధి సాధించింది. మలి అర్ధసంవత్సరంలో కూడా ఈ వృద్ధి ఇలాగే కొనసాగుతోందని ఆయన చెప్పారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వృద్ధి రేటు పెరగడం ద్వారా రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగౌతాయన్నారు. అయినప్పటికీ దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలన్నింటికంటే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. కేరళలో 1,58,348రూపాయల తలసరి ఆదాయం ఉంటే తమిళనాడులో 1,57,106, కర్ణాటకలో 1,59,893 లుగా ఉందన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1,22,376మాత్రమే నమోదైందన్నారు. 2014లో రాష్ట్ర విభజన నాటికి ఉమ్మడి రాష్ట్రంలో తలసరి ఆదాయం 89,214లుంటే విభజన కారణంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజల ఆదాయం 82,270 రూపాయలకు పడిపోయిందన్నారు. ఈ మూడేళ్ళ లో ప్రజల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాల మెరుగుకు చేపట్టిన చర్యల్ని ఆయన వివరించారు. సంప్రదాయ వ్యవసాయం కంటే పళ్ళు, కాయగూరలు, పాలు తదితర వ్యవసాయాధారిత రంగాల్ని ప్రోత్సహిస్తున్నా మన్నారు. అలాగే రాష్ట్రంలో ఆక్వా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గొర్రెలు, చేపల పెంపకానికి రాయితీలిస్తు న్నామ న్నారు. ఉద్యానవన పంటలకు రాయితీలిస్తు న్నామ న్నారు. తద్వారా వ్యక్తిగత ఆదాయ వృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. మలేషియా, సింగపూర్‌లు ఒకప్పుడు కలిసుండేవి. సింగపూర్ ప్రాంతం ఎందుకూ కొరగానిది కావడంతో మలేషియా దాన్ని వదిలించుకుంది. అయితే 50ఏళ్ళలో సింగపూర్ అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందింది. అలాగే విడివడ్డ తర్వాత దక్షిణకొరియా ఐదు దశాబ్ధాల్లో అగ్రస్థాయి రాజ్యాల్తో సరిసమాన స్థాయికెదిగింది. ఉత్తరకొరియా మాత్రం ఉన్న స్థితిలోనే ఆగిపోయింది. స్వాతంత్రానికి పూర్వం నుంచి తెలుగు ప్రాంతం మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉండేది. పొట్టిశ్రీరాములు ఆత్మార్పణతో ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది. అప్పటికప్పుడు రాష్ట్రానికి ఆస్తులు రాలేదు.. అప్పులు కూడా నెత్తినపడలేదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం ఆరుదశాబ్ధాల పాటు హైదరాబాద్‌ను అందరం కలసి అభివృద్ధి చేశాం.. అక్కడ ఆదాయం ఇప్పుడు తెలంగాణాకు పరిమితమైంది. అసంబద్ధ విభజనతో ఆంధ్ర ప్రదేశ్‌ను తిరిగి పునర్‌నిర్మించుకోవాల్సిన ఆవశ్య కతేర్పడిందంటూ చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లో తాను సాంకేతిక విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రోత్సహించానన్నారు. ఈ ఫలితంగా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటిరంగ నిపుణుల్లో 25శాతం భారతీయులుంటే ప్రతి నలుగురిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారన్నారు. పునర్ నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధికి బీజాలేశామన్నారు. రాజధానిలేని ఆంధ్రప్రదేశ్‌లో అందర్జాతీయ స్థాయి నగర నిర్మాణానికి ఉపక్రమించామన్నారు. శాతవాహనుడు అమరావతినే రాజధానిగా చేసుకుని దేశాన్నేలాడని గుర్తు చేశారు.

అప్పు కంటే గ్రాంట్ మేలు

- కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీకి చంద్రబాబు లేఖ
- మొత్తం రూ.16,447 కోట్లు రావాలి
- నాబార్డ్ ద్వారా గ్రాంట్‌గా ఇవ్వండి
- ప్రత్యేక ప్యాకేజీ కింద 90:10 నిష్పత్తిలో నిధులివ్వాలి
- 17న ప్రధానితో భేటీకానున్న ఏపీ ముఖ్యమంత్రి
- భేటీకి ముందు లేఖతో విశేష ప్రాధాన్యం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేకు సంబం ధించి వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను త్వరిత గతిన విడుదల చేసేందుకు యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీకి ప్రత్యేకంగా లేఖ రాశారు. ముఖ్య మంత్రి ఈనెల 17న ఢిల్లీలో ప్రధాని మోడీని కలవనున్న నేపథ్యంలో ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సందరించుకుంది. ప్రధాని భేటీలో ఏపీకి సంబంధించిన పలు అంశాలపై సీఎం చర్చించనున్నారు. కాగా తాజాగా ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖా మంత్రికి రాసిన లేఖ సారాంశం ఇలా ఉంది. మొత్తంగా చూస్తే 2015-16 నుండి 2019-20 వరకు కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ. 16, 447 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు రావాలి. సత్వరమే ఈ నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి. అంతర్జాతీయ బహుముఖ ఆర్థిక సంస్థల నుండి కాకుండా నాబార్డ్ ద్వారా ఏపీలో చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు రుణ మంజూరుకు అవకాశం కల్పించాలి. మొత్తం ఆరు ప్రాజెక్టులకు గాను 16,725 కోట్ల నిధులను నాబార్డ్ ద్వారా మంజూరు చేయాలి. నాబార్డ్ ద్వారా తీసుకునే రుణాలు రాష్ట్ర రుణ పరిమితిలో చేర్చరాదు. ఆ రుణాలను కేంద్రం ఇచ్చే గ్రాంటులుగా పరిగణించాలి .ఇదే సమయంలో ఏపీలో చేపడుతున్న పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు నాబార్డ్ నుండి రుణాలు మంజూరు చేయాలి. ఏపీలో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పంచాయితీ రాజ్ శాఖ రూ. 4500 కోట్ల విలువైన త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించింది. దీనితో తోడు అన్ని మండలాలకు, జిల్లా కేంద్రాలకు రెండు వరుసల రహదారుల నిర్మాణం కోసం రోడ్లు, భవనాల శాఖ 3200 కోట్ల విలువైన ప్రాజెక్టులను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని 13జిల్లాలో గురుకుల హాస్టల్స్ నిర్మాణం కోసం సాంఘిక సంక్షేమ శాఖ రూ. 3341కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రతిపాదించింది. పాతబ్రిడ్జిల మరమ్మ తులు, కొత్త బ్రిడ్జిల నిర్మాణం కోసం రోడ్డు, భవనాల శాఖ రూ. 3200 కోట్ల విలువైన ప్రాజెక్టులను సిద్ధం చేసింది. రాజధాని ప్రాంతాన్నిపచ్చదనం, పరిశుభ్రం గా ఉంచేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరే షన్ మేజర్ పార్కులు అభివృద్ధి, ల్యాండ్ స్కేపింగ్, వరద నివారణ చర్యలు చేపట్టే ప్రాజెక్టును రూ. 1484కోట్ల అంచనాలతో సిద్ధం చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామాల రోడ్లను అభివృద్ధి చేయడం కోసం పంచాయితీరాజ్ శాఖ వెయ్యి కోట్ల అంచనాలతో ప్రాజెక్ట్ సిద్ధం చేశారు. అయితే ఈఆరు ప్రాజెక్ట్‌లకు అవసరమయ్యే రూ. 16, 725 కోట్ల నిధులను నాబార్డ్ నుండి మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు అరుణ్ జైట్లీని కోరారు. నాబార్డ్ ద్వారా మంజూరు అయ్యే రుణాలను ఏపి రుణపరిమితిలో కలప కరాడ దని సీఎం విజ్ఞప్తిచేశారు. దీని వలన ప్రాజెక్ట్‌ల తర్వాత గతిన పూర్తి అవుతాయని సీఎం భావిస్తున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు 90:10 నిష్పత్తిలో నిధుల కేటాయింపు జరపాలి. ఆ ప్రకారం ఏపికి 2015-16 ఆర్థికసంవత్సరంలో రూ. 2951 కోట్లు రావాల్సి ఉండ గా, రూ. 2516కోట్లు మాత్రమే వచ్చాయి. ప్రత్యేక హోదా లేని ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్లు గానే ఏపీకి అప్పుడు నిధులు ఇచ్చారు. కానీ ఏపీ ప్రత్యేక ప్యాకేజీ కింద 90:10 నిష్పత్తిలో నిధులు ఇవ్వాలని సీఎం కోరారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం రూ. 2854కోట్ల నిధులు ఇచ్చారని సీఎం లేఖలో పేర్కొన్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇచ్చిన నిధుల కంటే 13శాతం నిధుల అధికంగా ఇచ్చారన్నారు. ఇదే ప్రాతిపాదిక 2017-18లో రూ. 3238కోట్లు , 2018-19లో రూ. 3673 కోట్లు, 2019-20లో రూ. 4166కోట్ల నిధులు ఏపీకి రావాల్సి ఉందని సీఎం ఆ లేఖలో గుర్తుచేశారు.



నగల దుకాణాలపై ఐటీ దాడులు

న్యూఢిల్లీ: పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారన్న కారణంతో దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను శాఖ 100కు పైగా నగల స్టోర్లు, ఇతర భవనాల్లో సోదాలు చేపట్టింది. ఇందులో దక్షిణ భారతదేశాలనికి చెందిన ప్రముఖ నగల వ్యాపార సంస్థలు కూడా ఉన్నాయి. ఈ మేరకు వివరాలను ఐటీ శాఖ అధికారులు బుధవారం మీడియాకు తెలిపారు. హైదరాబాద్, చెన్నై, త్రిస్సూర్ పట్టణాలతో సహా, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రా మొత్తం 130 వ్యాపార సముదాయాల్లో సోదాలు చేపట్టింది. కేరళకు చెందిన ప్రముఖ నగల వ్యాపార సంస్థ జోయ్‌అలుక్కాస్, అదే సంస్థకు చెందిన మరో స్టోరుపై కూడా ఐటీ శాఖ దాడులు జరిపింది. తమ సోదాల్లో పలు నగల దుకాణాల్లో భారీఎత్తున నగదు డిపాజిట్లు, బంగారం, వజ్రాలు, ఆభరణాల అమ్మకాల వివరాలు ఖాతాల్లో ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. దేశ వ్యాప్తంగా చేపట్టిన ఈ సోదాల్లో చెన్నై ఐటీ శాఖకు చెందిన 100 మంది సిబ్బంది, పలు పోలీస్ బృందాలు పాల్గొన్నాయని ఐటీ శాఖ వర్గాలు వెల్లడించాయి.

బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలి: ఐటీ శాఖ

నగలు, వజ్రాలు కొనడంలో బినామీల పేర్లను ఉపయోగిస్తే.. క్రిమినల్ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని ఐటీ శాఖ అధికారులు ప్రజలకు హెచ్చిరిక జారీ చేశారు. దోషిగా నిర్ధారిస్తే.. వారికి ఏడేళ్లు వరకు కఠిన కారాగార శిక్షవిధించే అవకాశముందని తెలిపారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఐటీ శాఖ దేశవ్యాప్తంగా అన్ని ప్రముఖ దిన పత్రికల్లో ప్రకటనలను ఇస్తున్నదని చెప్పారు. 'బినామి కొనుగోల్లు, లావాదేవీలకు దూరంగా ఉండండి. నల్ల ధనం మానవత్వానికి వ్యతిరేకం, నేరం.. పౌరులు చైతన్యవంతులై చట్ట వ్యతిరేక చర్యల నిర్మూలనలో ప్రభుత్వానికి తోడ్పండి' అని తన ప్రకటనలో ఐటీ శాఖ కోరింది. కొత్త బినామీ లావాదేవీలు(నిషేధం) సవరణ చట్టం-2016ను, నవంబర్ 1, 2016 నుంచి అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి అక్టోబర్ 2017 వరకు ఐటీశాఖ దేశ వ్యాప్తంగా రూ.1,833 కోట్లకుపైగా ఆస్తులను అటాచ్ చేసింది. మొత్తం 517 నోటీసులు జారీచేసి 541 కేసుల్లో అటాచ్ చేసింది. ఈ కొత్తం చట్టంను అతిక్రమిస్తే ఐదేళ్లు జైలు శిక్ష బినామీ ఆస్తుల విలువపై 10 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

జాయ్‌అలుక్కాస్‌లోనూ తనిఖీలు

ప్రముఖ జ్యూవెల్లరీ వ్యాపార సంస్థ జాయ్‌అలూకాస్ షోరూంపై ఆదాయపు పన్ను అధికారులు దాడులు జరిపారు. పన్ను ఎగవేత ఆనువానాలపై అధికారులు జోయ్ అలు కాస్‌కు చెందిన దేశ వ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలపై ఏకకాలంలో జరిపిన దాడులలో భాగంగా హైదరాబాద్‌లోని షోరూంలను తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు జరిగాయి. జోయ్ అలుకాస్‌కు భారత్‌తో పాటు ఒమన్, బహ్రెయిన్, యుకె తదితర 11 దేశాలలోనూ వ్యాపార సంస్థలున్నాయి.

గణతంత్ర వేడుకకు 10 ఆసియాన్ అతిథులు



భారతదేశ చరిత్రలో నూతన అధ్యాయం... రిపబ్లిక్ ఉత్సవాల్లో అరుదైన ఘట్టం.. ఈనెల 26న ఎర్రకోట వేదికపై ఆవిష్కారం కాబోతున్నది. గతానికి భిన్నంగా ఈసారి రిపబ్లిక్ వేడుకల్లో పది దేశాలకు చెందిన అధినేతలు పాల్గొంటున్నారు. సౌత్ ఈస్ట్ ఆసియా కూటమిలోకి భారత్ ప్రవేశించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సభ్యదేశాలను ఒక్కచోటకు చేర్చేందుకు మన ప్రధాని మోడీ సంకల్పించారు. ఈ పరిణామం భారతీయులకు గర్వకారణం అవుతుందని ప్రధాని గతేడాది చివరి మన్‌కీబాత్ ప్రసంగంలో వెల్లడించారు. థాయ్‌లాండ్, సింగపూర్, ఫిలిప్పీన్స్, మయన్మార్, కాంబోడియా,లావోస్, బ్రూనీ, వియత్నాం, మలేసియా, ఇండోనేషియా దేశాల అధినేతలు గణతంత్ర ఆతిథ్యం స్వీకరించబోతున్నారు.

ఇండోనేషియా

జొకొ విడొడొ
(అధ్యక్షుడు)



- అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత రెండోసారిభారత్‌కు వస్తున్నారు. కిందటిసారి 2016 డిసెంబర్‌లో ఢిల్లీ పర్యటనకు వచ్చారు.
- ఆగ్నేయాషియాలో ఇండోనేషియా కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ రీజియన్‌లో అతిపెద్ద దేశంగా ఉంది. ఆఫ్రోఆసియన్ కూటమి వ్యవస్థాపక దేశంగా గుర్తింపు.
- హిందూమహా సముద్ర ప్రాంతంలో ముఖ్య భూమిక నిర్వహించేందుకు ఆసక్తిగా ఉంది.
- భారత్‌తో సంబంధాలను పటిష్టం చేసుకునే దిశగా జొకొ అడుగులు వేస్తున్నారు.
- సైనిక, రాజకీయ ఉన్నత నేపథ్యం లేకుండానే ప్రధాని అయిన తొలి వ్యక్తి ఇతను.

సింగపూర్

లీహైన్ లూంగ్
(ప్రధాని)



- 2004 నుంచి ప్రధానిగా ఉన్నారు. భారత్‌తో మంచి సంబంధాలు కోరుకుంటున్నారు. ఆగ్నేయాసియాలో భారత్ బలమైన శక్తిగా ఎదిగేందుకు సింగపూర్ మద్దతిస్తుందని గతేడాది భారత పర్యటనలో లీ ప్రకటించారు.
- ఆసియాన్‌కు సారథ్యం వహిస్తున్న సింగపూర్, ఈస్ట్ అండ్ యాక్ట్ ఈస్ట్ పాలసీలో ఇండియాకు దన్నుగా నిలుస్తున్నది.
- ప్రధానిగా మోడీ గతేడాది రెండు సార్లు సింగపూర్ పర్యటించారు.
- ద.చైనా సముద్రంలో డ్రాగన్ కుప్పిగంతుల నేపథ్యంలో కఠిన వైఖరి అవలంబిస్తూ అంతర్జాతీయ చట్టాల ఉనికిని పరిరక్షిస్తోంది.

వియత్నాం

గుయెన్ ఫుక్
(ప్రధాని)



- ప్రధానిగా గుయెన్‌కు ఇది తొలి భారత పర్యటన. ఇండియా యొక్క యాక్ట్ ఈస్ట్ పాలసీలో సింగపూర్ తర్వాత భారత్‌కు ప్రధాన మద్దతుదారుగా ఉన్న దేశమిది. అంతేకాదు కీలక రక్షణ భాగస్వామి కూడా.
- చైనా దూకుడును బహిరంగంగా ఎదురొడ్డి మరీ ఇండియాకు మద్దతు పలుకుతున్నది.
- 2016లో మోడీ వియత్నాం పర్యటనకు వెళ్లారు. ఆ తర్వాత మనీలాలో జరిగిన తూర్పు ఆసియా సదస్సులో భాగంగా ఫుక్‌తో భేటీ అయ్యారు.
- ద.ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని నిలువరించే శక్తిగా భారత్ ఎదగాలన్నది వియత్నాం ఆకాంక్ష

మలేషియా

అబ్దుల్ రజాక్
(ప్రధాని)



- 2017 మార్చి - ఏప్రిల్ మాసాల్లో వారం పాటు భారత్‌లో పర్యటించారు.
- ఇండియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నారు.
- ఇండియా-ఆసియాన్, ఈస్ట్ ఆసియా సదస్సుల సందర్భంలో (2015) ప్రధాని మోడీకి విశిష్ట ఆతిథ్యం ఇచ్చారు.

ఫిలిప్పీన్స్

డుటర్టె
(అధ్యక్షుడు)



- రెండు నెలల కిందట ఆసియాన్ సదస్సులో మొదటిసారి మోడీతో డుటర్టె భేటీ అయ్యారు.
- ఫిలిప్పీన్స్ అధ్యక్షుడుకిది తొలి భారత పర్యటన
- మౌలిక ప్రాజెక్టుల అభివృద్ధిలో భారతదేశ సహకారాన్ని ఆశిస్తున్నారు. అదేవిధంగా భారత్ నుంచి స్వతంత్ర విదేశీ పాలసీ రూపకల్పనకు మొగ్గుచూపుతున్నారు.

బ్రూనీ

సుల్తాన్ హాజి
(రాజు)



- ప్రపంచంలోని అత్యంత సంపన్నులలో సుల్తాన్ హాజీ ఒకరు. థాయ్ రాజు మరణానంతరం ఆయన ఈ ఘనతను సాధించారు.
- ప్రపంచంలోని రాజులలో ఇతనే అందరికంటే ధనికుడు. దేశం గర్వించేలా పాలన చేస్తున్నాడు.
- అంతర్జాతీయ సమాజంలో బ్రూనీ దేశానికి గుర్తింపు తెచ్చిపెట్టడంలో కీలక పాత్ర పోషించారు.

లావోస్

తొంగ్లన్ సిసొలిత్ (ప్రధాని)



- 2016లో లావోస్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- తూర్పు ఆసియా సదస్సు సందర్భంగా మోడీతో సిసొలిత్ భేటీ అయ్యారు.
- భారత్‌తో మైత్రిని మరింత దృఢం చేయాలన్న పట్టుదలతో ఉన్నారు.

మయన్మార్

అంగ్‌సాన్ సూకి (స్టేట్ కౌన్సెలర్)



- గతేడాది సెప్టెంబర్ పర్యటనలో ప్రధాని మోడీ సూకీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మయన్మార్ ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ల పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.
- వివాదాస్పద జలాల్లోకి చైనా ప్రవేశించడం వల్ల కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. రఖినేస్టేట్ ఎన్నడూ లేనంత సమస్యల్లో చిక్కుకుంది.
- ఆంగ్‌సాంగ్ సూకీ ఢిల్లీలోని శ్రీరాం మహిళా కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. 1964లో ఇక్కడ విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నారు. అనంతరం షిమ్లాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్‌లో ఫెలోషిప్ చేశారు.

కాంబోడియా

హున్‌సేన్
(ప్రధాని)



- 1985నుంచి కాంబోడిగా ప్రధానిగా కొనసాగుతున్నారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా దేశాన్ని ఏలుతూ వస్తున్నారు.
- ప్రపంచంలో సుదీర్ఘకాలం పాలించిన నాయకుల్లో ఒకరిగా ఖ్యాతి గడించారు.
- వాస్తవానికి కాంబోడియా దేశం చైనాకు మంచి మిత్రదేశం.
- గణతంత్ర వేడుకల ఆహ్వానం మేరకు ఆయన తొలిసారి భారత్‌కు విచ్చేస్తున్నారు.

థాయిలాండ్

చాన్ వో చా
(ప్రధాని)



- థాయ్ రాయల్ ఆర్మీకి మాజీ కమాండర్. జనరల్ చాన్ భారత్‌తో బలమైన సంబంధాలను ఆశిస్తున్నారు. అదే సమయంలో చైనాతోనూ చాన్ దగ్గరగా ఉండే వ్యూహంతో ఉన్నారు.
- దక్షిణాసియాలో భారత్-మయన్మార్, థాయ్ జాతీయ రహదారి ఈ రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నది. దీనిని వియత్నాం వరకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు.
- ప్రాంతీయ ఉపఖండంలో ఇదొక కీలక దేశంగా ఉంది. సీమాంతర ఉగ్రవాద నిరోధంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. టెర్రరిస్టుల అప్పగింతలోనూ గత కొన్నేళ్లుగా ఇండియాకు సహకరిస్తున్నది.
- భారత్‌తో సంబంధాల ద్వారా తమ దేశంలో బుద్ధిజాన్ని వ్యాప్తి చేయాలన్నది చాన్ ఆలోచన. ప్రధానిగా ఆయనకు ఇది రెండో భారత పర్యటన



ఇందిర పాత్రలో విద్యాబాలన్

ముంబాయి: బాలీవుడ్ వినూత్న నటి విద్యాబాలన్ చిరకాల స్వప్నం సాకారం కానుంది. భారతదేశపు ఏకైక మహిళ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ పాత్రలో ఆమె వెండితెరపై కనిపించనున్నారు . ఈ మేరకు సాగరికా ఘోష్ రాసిన ఇందిర: ఇండియాస్ మోస్ట్ పవర్‌ఫుల్ ప్రైమ్ మినిస్టర్ పుస్తకం రూపాంతర హక్కులను విద్యాబాలన్ దక్కించుకున్నారు. ఇందిర హక్కులు దక్కించుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇందిరాగాంధీ పాత్ర పోషించాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. అది సినిమా రూపంలో వస్తుందా లేక వెబ్ సిరీస్ అవుతుందా అనేది ఇంకా నిర్ణయించలేదు. దానికి కాస్త సమయం పడుతుంది అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే విషయాన్ని రైటర్ ఘోష్ సైతం ఫేస్‌బుక్ ద్వారా ధృవీకరించారు. 39 ఏళ్ళ విద్యాబాలన్ చివరిసారిగా తుమ్హారీ సలూ అనే చిత్రంలో ఒక మధ్యతరగతి గృహిణి పాత్రలో కనిపించారు.

సివిల్స్ మెయిన్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: సివిల్స్ మెయిన్ పరీక్షా ఫలితాలను యూపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. మెయిన్ పరీక్ష గత ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ మూడవ తేదీ దాకా జరిగింది. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, తదితర సర్వీసుల్లో అధికారుల ఎంపిక కోసం యూపీఎస్సీ ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ దశల్లో సివిల్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తుంది. మెయిన్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల రోల్ నంబర్లను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు యూపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే మొత్తం ఎంత మంది ఉత్తీర్ణులైనదీ వెల్లడించలేదు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 19న పర్సనాలిటీ టెస్ట్ లేదా ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఇంటర్వ్యూ కోసం జనవరి 18వ తేదీ నుంచి యూపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి ఇ-సమ్మన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఓర్పీ గెలవదు: ట్రంప్

వాషింగ్టన్ : అమెరికాలో 2020 ఎన్నికల వేడి ఇప్పటి నుండే ఊపందుకుంది. అమెరికా అధ్యక్ష కుర్చీ కోసం టెలివిజన్ సలహాదారు ఓర్పీ విన్‌ఫ్రీ వచ్చినా ఓటమే చవి చూస్తారని, ఆమెను అస్సలు గెలవనివ్వబోనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఎన్నికల్లో ఆమె నిల్చున్నా.. తానే సునాయసంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీవర్లీహిల్స్‌లో నిర్వహించిన గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓర్పీ పాల్గొని ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ట్రంప్ పైవిధంగా ఆమెపై విమర్శలుగుప్పించారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓర్పీ పోటీ చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. 63 ఏళ్ల ఓర్పీ గోల్డెన్ గ్లోబ్ అవార్డు పొందిన మొదటి ఆఫ్రికన్-అమెరికా మహిళగా ఘనత సాధించారు.



దావోస్‌లో ట్రంప్-మోడీ భేటీ..!


వాషింగ్టన్: జనవరి 22న దావోస్‌లో జరిగే ప్రపంచ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరుకానున్నాడు. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారిక వర్గాలు ప్రకటించాయి. అయితే భారత్ నుండి ప్రధాని మోడీ సైతం ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఇద్దరూ శిఖరాగ్ర సదస్సులో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సదస్సుకు గత 18 ఏళ్లలో ఏ అమెరికా అధ్యక్షుడు కూడా హాజరుకాలేదు. ఈ సారి ట్రంప్ దీనికిహాజరై సరికొత్త రికార్డు సృష్టిస్తారని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ దేశాధినేతలతో అమెరికా ఎజెండాను ట్రంప్ ముందుకు తీసుకెళ్లనున్నట్టు సమాచారం. దీంతో భారత్‌తోనూ ట్రంప్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తరువాత కూడా భారత ప్రధాని మొదటిసారి వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు హాజరుకానున్నారు. 1997లో అప్పటి ప్రధాని దేవగౌడ ఈ సదస్సుకు వెళ్లారు. ఈసారి మొత్తం 100 మంది ప్రతినిధుల మోడీ టీం దావోస్‌కు వెళ్లనుంది.

ట్రంప్‌కు వైద్య పరీక్షలు!

వాషింగ్టన్ : రాబోయే సంవత్సరంలో సరిగా పనిచేయగలరా..? లేరా..? అనే అంశమై అమెరికా అధ్యక్షులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే డొనాల్డ్ ట్రంప్ కూడా శుక్రవారం పరీక్షలకు హాజరుకానున్నారు. కొందరు ట్విట్టర్ వేదికగా నెటిజన్లు, ప్రతిపక్షాలు 71 ఏళ్ల ట్రంప్‌కు మానసిక పరిస్థితి బాగోలేదంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన ఫైర్ అండ్ ఫ్యూరీ : ఇన్‌సైడ్ ది ట్రంప్ వైట్‌హౌస్ అనే పుస్తకంలో కూడా రచయితతో పాటు, ఓ సీనియర్ జర్నలిస్టు అధ్యక్షునికి సంబంధించిన కొన్ని విషయాలు వెలుగులోకి తీసుకొచ్చారు. మానసిక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు ఉండబోవని, కేవలం ఆరోగ్యానికి సంబంధించిన టెస్టులు మాత్రమే ఉంటాయని వైట్ హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాషింగ్టన్‌కు వెలుపల, బెతేస్డా, మేరిల్యాండ్‌లోని వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. డాక్టర్ రోనీ ఎల్.జాక్సన్ ట్రంప్ అధికారిక వైద్య సలహాదారు. అదేవిధంగా వైట్‌హౌస్ మెడికల్ యూనిట్‌కు డైరెక్టర్ కూడా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సమక్షంలో ఈ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

పాతికేళ్ల కిందే బ్రిటన్‌లో జిహాద్!

- **1995లోనే ముస్లింలను ఉగ్రవాదం వైపు మళ్లించిన సయీద్**



లండన్: లష్కర్ ఇ తోయిబా ఉగ్రసంస్థ వ్యవస్థాపకుడు, 2008 ముంబై పేలుళ్ల సూత్రధారి హాఫీస్ సయీద్ చీకటి కోణం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. 1990 దశకంలో బ్రిటన్ పర్యటనలో ఇతను జిహాద్‌కు పునాదులు వేశాడని బీబీసీ వెల్లడించింది. బ్రిటన్‌లోని ముస్లింలతో సమావేశాలు జరిపారని, జిహాద్ దిశగా వారిని ప్రేరేపించాడని తెలిపింది. 'ప్రస్తుతం పాక్‌లోని జమాత్ ఉద్ దవా గ్రూపునకు అధినేతగా ఉన్న, అంతర్జాతీయ ఉగ్రవాది హాఫీజ్ సయీద్ 1995లో ఇక్కడకు వచ్చాడు. ఈ విషయాన్ని లష్కర్ ఇ తోయిబా పత్రిక ఒకటి ప్రచురించింది. బర్మింగ్‌హామ్ ప్రసంగంలో ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. హిందువులపై జిహాద్‌కు పిలుపునిచ్చాడు. లీసెస్టర్ పర్యటనలో 4000 మంది యువకులతో సమావేశం అయ్యాడు. కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన సాజిద్ ఇక్బాల్ స్కాట్‌లాండ్ బీబీసీకి ఈ విషయాన్ని వెల్లడించాడు' అని బీబీసీ రేడియో పేర్కొంది. ఈ మేరకు 'ద డాన్ ఆఫ్ బ్రిటీష్ జిహాద్' పేరుతో 4 డాక్యుమెంటరీలను మంగళవారం ప్రసారం చేసింది. గ్లాస్కో లోని సెంట్రల్ మసీదు ప్రసంగంలో ముస్లింలను మరింత రెచ్చగొట్టాడు. ఇస్లామిక్‌లను హతమార్చేందుకు జియోనిస్టులు బిలియన్ డాలర్లు ఖర్చు చెస్తున్నారు. మనల్ని అప్పుల్లో ముంచేందుకు వడ్డీ ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు' అంటూ సయీద్ ప్రసంగించినట్లు బీబీసీ తెలిపింది. కాగా, సెంట్రల్ మసీద్ ఒక ఉగ్రవాదికి తలుపులు బార్లా తెరవడం తనను ఆశ్చర్యానికి గురిచేసింది.

బ్రిటన్ కేబినెట్‌లోకి ఇన్ఫీ నారాయణమూర్తి అల్లుడు

- **రిషి సునక్‌కు హౌసింగ్, కమ్యూనిటీ, లోకల్ గవర్నమెంట్ మంత్రిత్వశాఖ**
- **మరో భారత సంతతి వ్యక్తి ఫెర్నాండెజ్‌కూ మంత్రివర్గంలో చోటు**

లండన్ : ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్‌ను ఉన్నత పదవి వరించింది. బ్రిటన్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ఆయనకు థెరీసా మే కేబినెట్‌లో చోటు లభించింది. కన్జర్వేటివ్ ప్రభుత్వం సోమవారం చేపట్టిన మంత్రివర్గం, కార్యదర్శుల పునర్వ్యవస్థీకరణలో ఇద్దరు భారత సంతతి ఎంపీలకు మంత్రులుగా అవకాశం లభించింది. రిషితోపాటు సుయెల్లా ఫెర్నాండెజ్ ఉన్నారు. ఫెర్నాండెజ్ పూర్వీకులు గోవాకు చెందిన వారు. ఈ ఇద్దరు కూడా గతంలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా ఓటేసిన వారు కావడం విశేషం. బ్రెగ్జిట్ స్టీరింగ్ కమిటీలో ఫెర్నాండెజ్ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో కేబినెట్‌లో భారత సంతతి మంత్రుల సంఖ్య మూడుకు చేరింది. రిషికి కీలక బాధ్యతలు అప్పగించిన విషయాన్ని మంగళవారం రాత్రి బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. రిషికి



హౌసింగ్, కమ్యూనిటీ, లోకల్ గవర్నమెంట్ మంత్రిత్వశాఖను కట్టబెట్టారు. ఈసారి కేబినెట్ ప్రక్షాళనలో మహిళలు, మైనార్టీ చట్టసభ్యులకు ప్రాధాన్యత ఇచ్చారు.37 ఏళ్ల రిషి సునక్ 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. యార్క్‌షైర్‌లోని రిచ్‌మడ్ నియోజకవర్గం నుంచి 2015, 2017 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. కిందటేడాది ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీల్లో చదువుకున్నారు. సునక్ తండ్రి వైద్యుడు కాగా, తల్లి ఫార్మసిస్ట్. డిగ్రీ పూర్తిచేసిన తర్వాత సునక్ లండన్‌లో వ్యాపారసంస్థను ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ఓ సిలికాన్ వ్యాలీ కంపెనీలో సునక్ పెట్టుబడులు ఉన్నట్లు సమాచారం. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్‌లో సహ విద్యార్థిని అయిన నారాయణ మూర్తి కమార్తె అక్షతామూర్తిని ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాలిఫోర్నియాలో బురద బీభత్సం

- **13 మంది మృతి..**

కాలిఫోర్నియా : కాలిఫోర్నియాను వర్షాలు గజగజలాడిస్తున్నాయి. విపరీతంగా పేరుకుపోయిన బురదతో దక్షిణ కాలిఫోర్నియా అతలాకుతలమైంది. బురదలో కూరుకుని సుమారు 13 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మోంటేసిటో, వాయువ్య లాస్‌ఏంజిల్స్‌లో తీవ్రత అధికంగా ఉందని, రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గాలింపు చర్యలు చేపడుతున్నామని, భారీ వర్షాల కారణంగా సుమారు 20 మంది అచూకీ లభించకుండా పోయిందని శాంటా బార్‌బరా అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు వివరించారు.

సిక్కుల వ్యతిరేక అల్లర్లపై సిట్

- **సుప్రీంకోర్టు ఆదేశం**
- **దర్యాప్తులేకుండానే 186 కేసుల మూసివేతపై అసహనం**

న్యూఢిల్లీ: 1984 సంవత్సరంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం సిక్కులకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లపై దర్యాప్తుకోసం కొత్తగా ముగ్గురు సభ్యులతో కూడిన సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)ను ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని జస్టిస్ ఎ.ఎం. ఖాన్‌విల్కర్, డివై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తమ నిర్ణయాన్ని వెలువరిస్తూ... కొత్త సిట్‌లో సభ్యుల నియామకంకోసం పేర్లను సూచించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సిట్ బృందానికి మాజీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వం వహిస్తాడని, మిగతా ఇద్దరు సభ్యుల్లో ఒకరు డిఐజీ ర్యాంకుకు తక్కువకాని పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారి, మరొకరు సర్వీసులో ఉన్న పోలీస్ అధికారి ఉంటారని తెలిపింది. గతంలో ఈ అల్లర్లపై దర్యాప్తు చేసిన సిట్ మొత్తం కేసులను పూర్తిగా దర్యాప్తు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. 1984లో చెలరేగిన అల్లర్లపై నమోదైన కేసుల వివరాలు, సిట్ పురోగతిపై గత ఏడాది ఆగస్టు 16న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జెఎం. పాంచల్, న్యాయమూర్తి కెఎస్‌పి రాధాకృష్ణన్‌లతో కూడిన ఒక సూపర్‌వైజరీ బాడీని నియమించి నివేదికను మూడు నెలల్లో సుప్రీంకోర్టుకు సమర్పించాలని కోరామన్నారు. ఈ సూపర్‌వైజరీ బాడీ బుధవారం తన నివేదికను సుప్రీంకోర్టుకు సీల్డ్ లెదర్ బ్యాగ్‌లో సమర్పించింది. అనంతరం, నివేదికను అధ్యయనం చేసిన ధర్మాసనం సిట్ దర్యాప్తును తప్పుపట్టింది. నమోదైన మొత్తం 241 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తు చేపట్టకుండానే సిట్ మూసివేసిందని సూపర్‌వైజరీ బాడీ గుర్తించిందని ధర్మాసనం వెల్లడించింది. కేంద్రం గతంలో ఈ అల్లర్లకు సంబంధించి సిట్ దర్యాప్తు చేసిన 250 కేసుల్లో 241 కేసులకు సంబంధించి క్లోజర్ నివేదికలను సమర్పించిందని వెల్లడించింది. తొమ్మిది కేసులను సిట్ ఇంకా దర్యాప్తు చేస్తున్నదని, మరో రెండు సిబిఐ దర్యాప్తు చేస్తున్నదని తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ నియమించిన పాత సిట్ (బృందానికి 1986 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి ప్రమోద్ అస్థానా నేతృత్వం వహించగా, సభ్యులుగా పదవీ విరమణచేసిన జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రాకేష్ కపూర్, అదనపు డిప్యూటీ కమిషనర్ ఢిల్లీ పోలీస్ కుమార్ గ్యానేష్ ఉన్నారు) దర్యాప్తు జరిపి మూసివేయాలని నిర్ణయించిన 199 కేసులకు సంబంధించిన ఫైళ్లను ఈ ఏడాది మార్చి 24లోగా తమకు సమర్పించాలని కేంద్రాన్ని కోరింది. ఇందిరా గాంధీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లలో ఒక్క ఢిల్లీలోనే 2,733 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లపై సిక్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎస్ గుర్‌లాద్ సింగ్ కహలాన్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. కేసులో భాగంగా సిట్ సమర్పించిన వివరాలను కేంద్రం కోర్టుకు తెలిపింది. మొత్తం 293 అల్లర్లకు సంబంధించి కేసులను పరిశీలనకు సిట్ బృందం తీసుకుందని.. పరిశీలనానంతరం 199 కేసులను మూసివేయాలని నిర్ణయించిందని కేంద్రం కోర్టుకు తెలిపింది.



ఆధార్ లేకుంటే భారతీయులు కారా?

న్యూఢిల్లీ: పట్టణాల్లో ఇండ్లు లేనివారికి ఆధార్ కార్డులు ఎలా ఇస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు బుధవారం ప్రశ్నించింది. దేశవ్యాప్తంగా పట్టణాల్లో ఇండ్లు లేనివారికి ఆవాసం సమకూర్చే అంశంపై విచారణ సందర్భంగా ఒక వ్యక్తికి ఇల్లు లేనిపక్షంలో అతడ్ని ఆధార్ కార్డులో ఎలా ప్రస్తావిస్తారు అని ఉత్తరప్రదేశ్ సర్కారుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. అలాంటప్పుడు సదరు వ్యక్తులకు ఆధార్ ఉండదని మెహతా విన్నవించుకున్నారు. దానికి ఆధార్ లేని అలాంటి నిరాశ్రయులు భారతదేశంలో లేదా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ హయాంలో ఉండరా, వారిని షెల్టర్ హోమ్‌లలో ఉంచరా అని ధర్మాసనం నిలదీసింది. ఆధార్ లేనివారు మనుగడలో లేరనడం సరికాదని, వారికి చిరునామాతో కూడిన వోటర్ ఐడీ లాంటి గుర్తింపు కార్డులు ఉంటాయని మెహతా వివరణ ఇచ్చారు. మేము ఒక మానవ సమస్యతో వ్యవహరిస్తున్నాము. దానికి(ఆధార్‌కు) శాశ్వత చిరునామా ఇస్తున్నాం. ఇండ్లు లేని వారు ఎప్పటికీ సంచార జనాభాగానే మిగిలిపోతారు అని ధర్మాసనానికి వివరించారు. అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో 90 కోట్లమందికిపైగా ప్రజలకు ఆధార్ ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

లోపాలు ఎత్తి చూపితే పెత్తనం అంటారేం?

- **కార్యనిర్వాహక వ్యవస్థపై సుప్రీం ధర్మాగ్రహం**

న్యూఢిల్లీ: పాలనాయంత్రాంగంలో లోపాలను ఎత్తి చూపితే ప్రభుత్వాన్ని నడిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నిస్తోందంటూ విమర్శలు చేస్తారేం అని కార్యనిర్వాహక వ్యవస్థపై సుప్రీంకోర్టు ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసింది.కార్యనిర్వాహక వ్యవస్థ తన బాధ్యతలను నిర్వర్తించకపోవడం వల్లనే సమస్యలు ఎదురవుతున్నాయని జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దేశంలోని నగరాలు, పట్టణాల్లో ఇళ్ళు లేని వారికి ఆశ్రయం అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లో దీనదయాళ్ అంత్యోదయ యోజన- నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్‌యుఎల్ ఎం) పథకం 2014 నుంచి అమలులో ఉంది.కానీ, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ పథకం అమలువిషయంలో చేసిందేమీ లేదని సుప్రీంకోర్టు బెంచ్ పేర్కొంది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరపున వాదించిన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి ఈ అంశాన్ని మానవీయ కోణం నుంచి పరిశీలించాలని పేర్కొంది. ఎటువంటి నీడ లేని వారికి సంబంధించింది ఈ కేసు. ఈ విషయంలో ప్రభుత్వం ముఖ్యంగా, కార్య నిర్వాహక వ్యవస్థ వెంటనే స్పందించాలి. అని బెంచ్ స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాల్లో గృహాల నిర్మాణం అంశం విషయంలో రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు బెంచ్ సూచించింది.ఇళ్ళ నిర్మాణ కార్యక్రమాలు త్వరిత గతిన పూర్తి కావడానికి కేంద్రం,రాష్ట్రా లతో సమన్వయంతో పని చేయాలని బెంచ్ సూచించింది. పిటిషనర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత భూషణ్ ఉత్తరప్రదేశ్‌లో లక్షా 80వేల మందికి ఆవాసాలు కల్పించాల్సి ఉండగా,ప్రస్తుతం ఏడువేల మందికే వసతి లభిస్తోందని చెప్పారు. ఇళ్ళ నిర్మాణం విషయంలో రాష్ట్రా లు చురుకుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాప్రతినిధులకు బార్‌కౌన్సిల్ నోటీసులు

న్యూఢిల్లీ: న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తున్న ఎమ్మెల్యేలూ,ఎంపీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నోటీసులు జారీ చేసింది.ఈ నోటీసులకు వారంలోగా సమాధానమివ్వాలని కౌన్సిల్ ఆదేశించింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వోద్యోగులు న్యాయవాదులుగా ప్రాక్టీసు చేయకూడదనీ,తమకు అందిన పిటిషన్‌ను పురస్కరించుకుని నోటీసులు జారీ చేశామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మానన్ కుమార్ మిశ్రా ఒక వార్తా సంస్థకు తెలిపారు. బీజేపీ ఢిల్లీ అధికార ప్రతినిధి అశ్వినీకుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ని పురస్కరించుకుని ఈ నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. పార్లమెంటు సభ్యులు కపిల్ సిబాల్, పి.చిదంబరం, సుబ్రహ్మణ్య స్వామి,కెటిఎస్ తులసీ, అభిషేక్ మను సింఘ్వీ,కల్యాణ్ బెనర్జీ ప్రభృతులు న్యాయవాదులుగా కూడా ప్రాక్టీస్ చేస్తున్నారు.

తొలి టెస్ట్ భారత్ చేజారింది. టీమ్ఇండియాకు కలిసి వచ్చే వేదికపై విరాట్ కోహ్లి సేన గెలుపు కాకపోయినా కనీసం మ్యాచ్‌ను డ్రా చేసుకుంటుందేమోనని ఆశగా ఎదురు చూసిన భారత క్రికెట్ అభిమానికి నిరాశే మిగిలింది. పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై టీమ్ఇండియా బౌలింగ్ మెరుగ్గా ఉన్నా... బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో యువ ఆల్‌రౌండర్ పాండ్య ఆదుకోకుంటే భారత్ పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. మొత్తానికి కేప్‌టౌన్ టెస్టులో నాలుగో రోజే ఫలితం వచ్చేసింది. నిజానికి ఆట సాగింది మూడు రోజులే. మూడు రోజుల్లో 40 వికెట్లు నేలకూలాయి. విజయానికి.. పరాజయానికి మధ్య తేడా 72 పరుగులే. ధావన్, విజయ్, పుజారా, కోహ్లి, రోహిత్‌లతో కూడిన టాప్, మిడిలార్డర్ ఘోర వైఫల్యం భారత్ విజయాన్ని ఎంతగానో దెబ్బ తీసింది. ఇక భారత్ బ్యాటింగ్‌కు మరింత కఠిన సవాలు విసిరే సెంచూరియన్ వికెట్... కోహ్లి బృందం కోసం ఎదురు చూస్తోంది. మొదటి టెస్టుకు జట్టు కూర్పులో ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకున్న యాజమాన్యం... తన పొరపాటును దిద్దుకుంటుందా? రెండో మ్యాచ్‌కు సరైన కూర్పుతో బరిలోకి దిగుతుందా? వేచి చూడాల్సిందే!

కూర్పు కుదిరేనా!



ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

టీమ్ఇండియా యాజమాన్యం తుది జట్టు నుంచి ఓపెనర్‌గా సాంకేతికతలో లోపాలు ఎంచలేని కేఎల్ రాహుల్, విదేశాల్లో తిరుగులేని రికార్డు కలిగిన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానేలను పక్కన పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వారి స్థానంలో శిఖర్ ధావన్, రోహిత్ శర్మలను తీసుకుని పొరపాటే చేసింది. బౌన్స్ విపరీతంగా వచ్చే పేస్ పిచ్‌పై ధావన్ బోల్తా పడడం ఇది కొత్తకాదు. విదేశాల్లో టెస్టుల్లో రోహిత్ రికార్డు కూడా మెరుగ్గా లేదు. స్వదేశంలో... అదీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఫామ్‌ను చూసి వీరిని తుది జట్టులోకి తీసుకున్నారు. దక్షిణాఫ్రికా వంటి పిచ్‌లపై ఆడగల సాంకేతికత ధావన్‌కు లేదు. రోహిత్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. వాస్తవానికి ధావన్‌కు ఓపెనర్‌గా తొలి ప్రాధాన్యం లేదు. కుడి ఎడమల కూర్పు కోసం ధావన్‌ను తీసుకున్నామని కోహ్లి అంటున్నాడు... కానీ ఈ సూత్రం అన్ని సార్లు, అన్ని సందర్భాల్లోనూ వర్తించదు. ధావన్ రెండు సందర్భాల్లోనూ రైజింగ్ డెలివరీకి బలయ్యాడు. ఈ రోజుల్లో జట్లకున్న సాంకేతిక సాయంతో ధావన్ బలహీనతను ఏ జట్టయినా సులువుగా పసికట్టేయగలదు. 2013 డిసెంబరులో చివరి సారిగా భారత్... దక్షిణాఫ్రికాలో రెండు టెస్టులు ఆడింది. జొహన్నెస్‌బర్గ్‌లో డ్రా చేసుకొని...డర్బన్‌లో 10 వికెట్ల తేడాతో ఓడింది. రెండు మ్యాచ్‌ల్లోనూ ధావన్, విజయ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. విజయ్ 97 పరుగులు చేయగా.. ధావన్ తంటాలు పడ్డాడు. విజయ్ 2010లో కూడా దక్షిణాఫ్రికా వచ్చినా ఒకే టెస్టు ఆడాడు. రోహిత్ మెరుగ్గా ఆడేందుకు ప్రయత్నించాడు కానీ.. ఆ పాత్రలో అతను బలవంతంగా ఇమిడ్చినట్లు ఉందే తప్ప సహజసిద్ధమైన మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా కనిపించలేదు. కొన్ని బంతులకు పరుగులు రాకపోవడంతో రోహిత్ అసహనానికి గురయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లోనూ అతను ఇదే మాదిరి దృక్పథంతో ఆడాడు. అందుకే విఫలమయ్యాడు. రహానే, రాహుల్‌లు ఇప్పటికే టెస్టుల్లో కుదురుకుని తమను తాము నిరూపించుకున్న ఆటగాళ్లు. ప్రత్యేకించి రహానేది విదేశాల్లో తిరుగులేని రికార్డు. రాహుల్ కూడా వరుసగా 8 అర్ధసెంచరీలతో తనను తాను నిరూపించుకున్నాడు. వాటిలో ఎక్కువగా ఉపఖండంలో సాధించినవే అయినప్పటికీ ఓపెనర్‌గా అతని టెక్నిక్ తిరుగులేనిది. రాహుల్ అన్ని ఫార్మాట్లలోనూ పరుగులు సాధించాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ అతని పరుగుల వేట ఆగలేదు. ప్రస్తుత పరిస్థితులు.. సవాళ్ల నేపథ్యంలో తుది జట్టులో చోటుకు ధావన్ కంటే రాహులే తగినవాడు. మూడో ఓపెనర్‌గా అందుబాటులో ఉన్న రాహుల్‌ను సందేహించకుండా తీసుకుంటే మేలు. టీమ్ఇండియాకు అతనే అసలుసిసలు ఓపెనర్. తానాడిన ప్రతి విదేశీ పర్యటనలోనూ సెంచరీ సాధించాడు. అతణ్ని ప్రయోగాల పేరుతో మిడిలార్డర్‌లో ఆడించి యాజమాన్యం మరో పొరపాటు చేయకూడదు. రాహుల్ టాప్‌ఆర్డర్‌లోనే ఉండాలి. రోహిత్ స్తానంలో రహానేను తీసుకోవడం ఉత్తమం.

మేలుకోవాలి

మూడు టెస్టుల సిరీస్‌లో తొలి టెస్ట్ ఓడిపోతే... కోలుకొని సిరీస్ గెలవడం అంత సులువుకాదు. ఐతే జట్టు ఓటమి నుంచి పాఠాలు నేర్వగలిగితే రెండో టెస్టును డ్రా చేసుకొని కలిసి వచ్చే జొహన్నెస్‌బర్గ్‌లో గెలిచి సిరీస్‌ను సమమైనా చేయొచ్చు. అందుకే కోహ్లి సేన వెంటనే మేలుకోవాలి. కర్తవ్యాన్ని బోధపరచుకోవాలి!.

సెంచూరియన్‌లో చెలరేగుతారు

తొలి టెస్టు నాలుగో రోజు 10 టీమ్ ఇండియా వికెట్లు నేలకొరిగాయి. ఫిలాండర్ వైవిధ్య భరితంగా బౌలింగ్ చేశాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేశాడు. ఆరు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోకుండా చేశాడు. అతను పడగొట్టిన వికెట్లలో విజయ్, విరాట్, రోహిత్, అశ్విన్‌వి కూడా ఉన్నాయి. ఫిలాండర్ ఒంటి చేత్తో మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాకు కట్టబెట్టాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో తక్కువ వేగంతో బంతులు వేసే ఫిలాండరే ఇంత కేప్‌టౌన్‌లో ఇంత ప్రమాదకారి అయితే... మరింత బౌన్స్ ఉండే సెంచూరియన్లో మోర్కెల్, రబాడ మరెంతగా రెచ్చిపోతారో. గాయానికి గురైన డేల్ స్టెయిన్ స్తానంలో క్రిస్ మోరిస్ జట్టులోకి వచ్చే అవకాశముంది. తక్కిన టెస్టుల్లోనూ తమ పేసర్లు విశ్రమించబోరని.. నలుగురు పేసర్ల వ్యూహంతోనే బరిలోకి దిగుతామని కోచ్ గిబ్సన్ విస్పష్టంగా చెబుతున్నాడు. అంటే సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికా పేస్ మరింత పదునెక్కబోతోందన్నమాట.

ఐర్లాండ్‌లో టీ20లు ఆడనున్న కోహ్లిసేన

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ లో జులై-సెప్టెంబరులో పర్యటనకు ముందు టీమ్ ఇండియా ఐర్లాండ్‌లో టీ20 మ్యాచ్‌లు ఆడు తుంది. 2007 తరువాత ఆ దేశంలో పర్యటించనున్న భారత జట్టు జూన్‌లో అక్కడ రెండు టీ20లు ఆడు తుంది. ఈ 2వ్యాచ్‌లు జూన్ 27న, 29న డబ్లిన్ లో జరుగుతాయి. 2007లో భారత జట్టు ఐర్లాండ్ లో ఓ వన్డే ఆడింది.

క్రీడాప్రభ

మంచులో మెరిసింది

- స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం అందించిన ఆంచల్



చండీగఢ్: మనాలీ నివాసి ఆంచల్ ఠాకుర్ చరిత్ర సృష్టించింది. స్కీయింగ్‌లో మన దేశానికి తొలి అంతర్జాతీయ పతకం అందించింది. 21 ఏళ్ల ఆంచల్ ... అంతర్జాతీయ స్కీయింగ్ సంస్థ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి స్కీ (ఎఫ్ఐఎస్) నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్‌లో కాంస్యం గెలిచింది. ఈ పోటీలు టర్కీలోని ఎర్జురుమ్‌లోని పలండొకెన్ స్కీ కేంద్రంలో జరిగాయి. ఆంచల్ స్లలూమ్ విభాగంలో పతకం దక్కించుకుంది. ''నెలల పాటు సాగిన శిక్షణ చివరకు ఫలితాన్నిచ్చింది. ఆరంభం మెరుగ్గా చేశాను. ఆధిక్యం కొనసాగించాను. దీంతో మూడో స్థానంలో నిలువగలిగాను'' అని ఆంచల్ తెలిపింది. భారత్‌లో శీతాకాల క్రీడలకు పెద్దగా ప్రోత్సాహం కానీ, వసతులు కాని లేకున్నా ఆంచల్ అంతర్జాతీయ పతకం సాధించడం చెప్పుకోదగింది.

యుకి, రామ్‌కుమార్ ముందంజ

మెల్‌బోర్న్: భారత టాప్ సింగిల్స్ ఆటగాళ్లు యుకి బాంబ్రి, రామ్‌కుమార్ రామనాథన్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో ముందంజ వేశారు. సుమీత్ నగల్, గణేశ్వరన్ ఇంటిదారి పట్టారు. తొలి రౌండ్లో 15వ సీడ్ బాంబ్రి 1-6, 6-3, 6-4తో కెనడాకు చెందిన బ్రాడ్లే షునర్‌పై గెలవగా... 28వ సీడ్ రామ్‌కుమార్ 6-7 (8), 7-6(3), 6-2తో అమెరికా క్రీడాకారుడు బ్రాడ్‌లే క్లాన్‌ను ఓడించాడు. యుకీ రెండో రౌండ్లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ టబెర్నర్‌తో తలపడతాడు. రామ్‌కుమార్.. ఫ్రాన్స్ ఆటగాడు గ్లెబ్ సఖరోవ్‌ను ఢీకొంటాడు. గణేశ్వరన్ 6-1, 1-6, 2-6తో తొబియాస్ (జర్మనీ) చేతిలోను... నగల్ 6-7 (5), 6-3, 3-6తో గియాని (ఇటలీ) చేతిలోనూ ఓడారు.

వచ్చింది మరో 'గోడ'

- ద్రవిడ్ కొడుకు సెంచరీ కొట్టాడు



బెంగళూరు: మాజీ కెప్టెన్, అండర్ 19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ కొడుకు సమిత్ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నాడు. కర్ణాటక స్టేట్ క్రికెట్ సంఘం నిర్వహించిన బీటీఆర్ కప్ అండర్ 14 టోర్నమెంట్లో సమిత్ సెంచరీ చేసి జట్టును గెలిపించాడు. సమిత్.. మాల్య అదితి ఇంటర్నేషనల్ స్కూల్ తరపున ఆడాడు. సమిత్ శతకంతో మాల్య అదితి 412 పరుగులు భారీ తేడాతో వివేకానంద స్కూల్‌పై ఘన విజయం సాధించింది. సమిత్ 150 పరుగులు సాధించాడు. ఐతే సమిత్ స్కోరే మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు కాదు. భారత మాజీ స్పిన్నర్ సునీల్ జోషి కొడుకు ఆర్యన్ జోషి 154 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వీరిద్దరి విజృంభణలో జట్టు 50 ఓవర్లలో 5 వికెట్లకు 500 పరుగులు సాధించింది. సమిత్, ఆర్యన్‌ల జోరుకు తోడు బౌలర్లు విజృంభించి వివేకానంద 88 పరుగులకే ఆలౌటైంది. సమిత్ వార్తలకెక్కడం ఇదే తొలిసారి కాదు. అండర్ 14 విభాగంలో ఈ చిచ్చర పిడుగు రెండేళ్లుగా సంచలనాలు సృష్టిస్తున్నాడు. 2015లో అండర్ 12 గోపాలన్ క్రికెట్ చాలెంజ్‌లో బెస్ట్‌బ్యాట్స్‌మన్ అవార్డు గెలుచుకున్నాడు. సమిత్ మూడు అర్ధసెంచరీలు సాధించాడు. ఫైనల్లో 77 నాటౌట్‌తో పాటు 93, 77 పరుగులు సాధించి మాల్య అదితిని విజేతగా నిలిపాడు. ఇపుడు తండ్రి అండర్ 19 ప్రపంచ కప్‌ను భారత్‌కు గెలిపించే పనిలో న్యూజిలాండ్లో ఉంటే... కొడుకు స్కూలు జట్టుకు విజయం చేకూర్చే పనిలో పడ్డాడు. గురువారం 44వ పుట్టిన రోజు జరుపుకోనున్న రాహుల్ ద్రవిడ్‌కు కొడుకు ముందుగానే బహుమతి ఇచ్చాడన్నమాట!.

భారత జట్టుకు పాండ్య గొప్ప ఆస్తి



కేప్‌టౌన్: హార్దిక్ పాండ్య.. భారత్ జట్టుకు తిరుగులేని ఆల్‌రౌండ్ ఆస్తిగా ఎదుగుతున్నాడని దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ అన్నాడు. ''తొలి ఇన్నింగ్స్‌లో పాండ్య బ్యాటింగ్ అద్భుతం. పాండ్య ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికా ఒత్తిడిలో పడింది. బారత్‌కు అతను తిరుగులేని ఆస్తిగా మారనున్నాడు. అతనింకా ఎదుగుతున్నాడు. తన బౌలింగ్‌లో మరికొంత పేస్‌ను పెంచుకోగలిగితే అసలుసిసలు ఆల్‌రౌండర్‌గా రూపొందుతాడు'' అని క్లూసెనర్ అన్నాడు. ''పాండ్య అద్భుత ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆడే తీరువల్ల కొన్ని సార్లు విఫలమైనా అతణ్ని సానుకూల దృక్పథంతో ప్రోత్సహిస్తే మంచిది. భారత జట్టులోనైనా, ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌లోనైనా అతని చుట్టూ మెరుగైన ఆటగాళ్లున్నారు. వారి సాహచర్యంలో పాండ్య ఎదుగుతాడు. అతణ్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిదే'' అని క్లూసెనర్ చెప్పాడు. ''మంచి ప్రాక్టీసు మ్యాచ్ ఆడివుంటే ఎపుడైనా మంచిదే. కానీ ఉపఖండంలో ఆడినంత మాత్రాన ఇక్కడ ప్రాక్టీసు మ్యాచ్ ఆడాలని లేదు. ఐతే విదేశీ పరిస్థితుల్లో ప్రాక్టీసు మ్యాచ్ ఆడితే మేలు'' అని క్లూసెనర్ అన్నాడు.

బ్రాడ్‌మన్ రికార్డును తిరగరాసిన అఫ్గాన్ టీనేజర్



న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్ టీనేజర్ బషీర్ షా అరుదైన రికార్డు నెలకొల్పాడు. క్రికెట్ చరిత్రలో మరో బ్యాట్స్‌మన్‌కు సాధ్యంకాని విధంగా 18 ఏళ్ల బషీర్.. ఏడు మ్యాచ్‌లలో 12 ఇన్నింగ్స్‌లో 121.77 సగటుతో 1096 పరుగులు సాధించాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ ఫస్ట్ క్లాస్‌లో సాధించిన 95.14 సగటును అధిగమించాడు. 1000 పరుగులకు పైగా పరుగులు చేసిన సందర్భంలో ఇంతవరకు బ్రాడ్‌మన్ సగటే అత్యుత్తమం. స్పీన్ ఘర్ రీజియన్ తరపున అరంగేట్రం చేసిన షా... అమో రీజియన్‌పై అజేయంగా 256 పరుగులు సాధించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో ఇదే రెండో అత్యధిక స్కోరు. భారత మాజీ క్రికెటర్ అమోల్ మజుందార్ 260 పరుగులతో తొలి స్తానంలో ఉన్నాడు. బషీర్ 14 మాసాల కెరీర్లో ఐదు సెంచరీలు... రెండు అర్ధసెంచరీలు సాధించాడు. ఐదు ఇన్నింగ్స్ అనంతరం షా... ట్రిపుల్ సెంచరీ కొట్టి మియాందాద్ తరువాత పిన్న వయసులో ట్రిపుల్ సాదించిన బ్యాట్స్‌మన్‌గా చరిత్రకెక్కాడు. ''నాకిది మరచిపోలేని క్షణం. క్రీజులో రెండు రోజుల పాటు నిలిచాను. సునాయాసంగానే ఆడాను. టోర్నీకి ముందు ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాను'' అని బషీర్ అన్నాడు.



జకోవిచ్ గెలిచాడు

మెల్‌బోర్న్: ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత నొవాక్ జకోవిచ్... పునరాగమనాన్ని విజయంతో ఆరంభించాడు. బుధవారం కూయంగ్ క్లాసిక్ టోర్నీ రౌండ్ రాబిన్ పోటీలో జకోవిచ్ 6-1, 6-4తో ప్రపంచ నెంబర్ 5 డొమినిక్ థీమ్‌పై గెలిచాడు. గత వారం కుడి మోచేయి గాయంతో అబుదాబి ఓపెన్ నుంచి వైదొలగిన జకోవిచ్ ఈ విజయంతో .... ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు అవసరమైన విశ్వాసాన్ని కూడగట్టుకున్నాడు. ''ఇది గొప్ప ఆరంభం. తిరిగి కోర్టు లో ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది'' అని జకోవిచ్ ఆనందం వ్యక్తం చేశాడు.

సిడ్నీ సెమీస్‌లో బోపన్న జోడి

సిడ్నీ: సిడ్నీ ఇంటర్నేషనల్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న, రోజర్ వాస్లెన్ జోడీ సెమీస్ చేరింది. బుధవారం బోపన్న, రోజర్ క్వార్టర్స్‌లో 7-6(5), 7-6(5)తో మార్టిన్, నికోలస్‌పై గెలిచారు.

జాతీయ మహిళల బాక్సింగ్ సెమీస్‌లో సరిత, సోనియా

రోహ్‌తక్: మాజీ ప్రపంచ చాంపియన్ ఎల్ సరితా దేవి (60 కిలోలు), ఆసియా రజత పతక విజేత సోనియా లాథర్ (57 కి.) బుధవారం జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెమీ ఫైనల్ చేరారు. ఆలిండియా పోలీస్ తరపున ఆడుతున్న సరిత... తొలి రౌండ్లో అరుణాచల్ ప్రదేశ్ బాక్సర్ దుపాక్‌ను ఓడించింది. రైల్వే తరపున ఆడుతున్న సోనియా... ఉత్తరాఖండ్ బాక్సర్ కమలా బిస్త్‌పై 5-0తో గెలిచింది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.